ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 2 సంచిక - 1 అక్టోబర్ - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20

## నివాళి



ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం

4.6.1946 - 25.9.2020

సాహితీస్రవంతి


ఫోటో: ఎస్.ఎస్.బి. గేరా - 9492922492

# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం

## చేసిన నేరము 'లేమి'!

**టా**ల్‌స్టాయ్ సూటిగా ఆ పేరే పెట్టారు గాని కళా సాహిత్య జగత్తులో అత్యధిక సృజన నేరమూ శిక్ష దృక్పథం చుట్టూ అల్లుకున్నదే. మానవ చరిత్రలో ప్రవృత్తిలో, వ్యక్తిగత జీవితాలలో కుటుంబాలలో సామాజిక వ్యవస్థలలో తప్పొప్పులు వాటికి శిక్షలు పడటం తప్పించుకున్నా తమలో తాము నలిగిపోవడం, కళాత్మకంగా ఆవిష్కరించాలనే మహారచయితలంతా ప్రయత్నిస్తూ వచ్చారు. మహా మారణహోమాలు రగిలించిన నియంతల నరహంతలపై ఆక్షేపణ నుంచి అపరాధభావనతో రగిలిపోయే ఆత్మావలోకనం వరకూ మహా రచనలెన్నో వెలశాయి. తర్వాత ఇతర కళారూపాలుగా మారాయి. సీతారామస్వామి నే చేసిన నేరములేమి అన్న భక్త రామదాసు కీర్తన వింటూనే వున్నాం. కాని నేరము 'లేమి' అన్నట్టు కళ్లముందు జరిగిన చరిత్రలో నమోదైన ఒక దారుణం నేరం కాకుండా పోవడం, అందులో ముందున్న వారంతా నిర్దోషులుగా విడుదల కావడం మహావైపరీత్యం. అయోధ్య తీర్పుపై భిన్నాభిప్రాయాలున్నా ఏదో ముగిసిందిలెమ్మని సరిపెట్టుకున్న వారు కూడా బాబరీ మసీదు విధ్వంసంలో ఎవరి తప్పు లేదని లక్నో సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేక పోతున్నారు. అత్యంత ఘోరమైన చట్ట ఉల్లంఘన అని సుప్రీం కోర్టు చెప్పినదానికి ఆచరణలో ఎవరూ బాధ్యులు కాకుండా నిర్దోషులైపోవడం న్యాయాన్ని అపహాస్యం చేస్తున్నది. గుమ్మటాలు వాటికవే కూలిపోయాయా అని పసిపిల్లలకు కూడా సందేహం కలుగుతున్నది. దీనిపై ఏలినవారు ఉన్నత న్యాయస్తానాలకు వెళతారో లేదో తెలియదు. కాని లౌకికతత్వాన్ని, మత సామరస్యాన్ని దెబ్బతీసే పోకడలను, అసహన రాజకీయాలను ప్రశ్నించాల్సిన బాధ్యత రచయితలపై వుంది. ఇప్పుడు తెలుగురాష్ట్రాలలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో కూడా మతాల మధ్య మంటలు పెట్టే రాజకీయాలు జోరుగా నడుస్తున్నాయని గుర్తుచేసుకుంటే ఇది తక్షణ సవాలుగా కళ్లముందు నిలుస్తుంది. అక్షరాలలోనూ ఆచరణలోనూ ఆ ముప్పును నివారించడం, తరతరాల సహజీవన సామరస్య సంప్రదాయాలను కాపాడుకోవాల్సి వుంది. ఈ అక్టోబరుతో మహాత్ముని 150వ జయంతి ఉత్సవాలు ముగిసి వుండొచ్చు గాని ఆయన జీవితంలో చూపిన మత సామరస్య సందేశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. ◆

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం
ముఖచిత్రం ఫొటో:
మైఖేల్ బ్లాంకెట్టా

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh.
Editor : Telakapalli Ravi

## కథలు

**కలహాల మారి** – కె. ఉషారాణి........................ 5
**వసంత రాగాలు** – ఎం.ఆర్.అరుణకుమారి........... 26
**నిర్ణయం** – మారుతి పౌరోహితం...................... 49
**అనివార్యం** – నల్లా యోగేశ్వరరావు..................... 59

## కవితలు

**మనుషుల్లేని దేశం** – కేశవ్‌కుమార్..................... 9
**నేనెవరంటావ్..?** – యస్. నితిన్‌కుమార్ రెడ్డి........ 12
**స్వేచ్ఛ** – పులుమద్ది సత్యనారాయణ.................... 12
**వద్దు నువ్వలా** – పద్మావతి రాంభక్త.................... 15
**ద్రోహలోకం** – శిఖా – ఆకాష్......................... 16
**కాలాన్ని సవరించిన మనిషి** – ర్యాలిప్రసాద్...........20
**చైతన్యధాతువు** – ఆర్.వి. రాఘవరావు................. 24
**కొత్తదారులు కావాలి** – కొండా శిరీష.................. 25
**టెక్నాలజీ–బొమ్మా–బొరుసు** – ఆర్. లక్ష్మి..............25
**ఎరుకలం** – గిరిప్రసాద్ చెలమల్లు......................29
**వాన – జ్ఞాపకం** – సునీత పేరిచెర్ల.....................32
**ఆత్మీయతల ఆరబోత** – కళ్యాణదుర్గం స్వర్ణలత....... 33
**కదలి కెరటం** – కోడే యామినీ దేవి.................... 33
**పాపం రామా కనవేమిరా!**– తెలకపల్లి రవి............ 35
**ఖాళీలను పూరించడానికి** – దిలీప్. వి. ................ 41
**తీగెల మీద జీవితం** – మహమూద్..................... 42
**ముసురు** – ప్రొ॥ బొంతా విద్యాధర్.................... 42
**సాంగత్యం** – సడ్లపల్లె.................................... 47
**సైకిల్** – యు. రమ్యజ్యోతి............................... 48
**హైకులు** – దామరకుంట శంకరయ్య..................48
**అందరం కలుద్దాం** – బుర్రా సాయిబాబు...............54
**ఏ పాట నే పాడను?** – స్వర్ణలత గొట్టిముక్కల ...... 54
**అక్షరాలు మొలకెత్తుతున్న వేళ**– లోసారి సుధాకర్.... 63

## వ్యాసాలు

**సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ 2020 పురస్కారాలు**.... 9
**తరతరాల స్వరధార** – తె.ర............................ 10
**సామ్రాజ్యవాద అవిచ్ఛిన్నత 'కృష్ణస్వప్నం'**
– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి.................. 13
**కన్నడమూలం – తెలుగులో అమూల్యం**
– వై. హెచ్.కె. మోహన్‌రావు.................... 17
**ఉద్వేగాలకు ఆనవాళ్ళు అఫ్సర్ కవిత్వం**
– తగుళ్ళ గోపాల్................ 21
**బాధల సంతకమే ఈ కవిత్వం** – కెంగార మోహన్... 30
**బాబ్రీ విధ్వంసంపై తీర్పు వివేకానికే సవాలు**
– తెలకపల్లి రవి.......... 34
**తెలుగు సాహిత్యంలో ముస్లింమైనారిటీ కవుల ప్రస్థానం**
– డా॥ షేక్ ఇబ్రహీం............. 36
**ధర్మాగ్రహ సాహిత్యరూపం 'నాగులకట్ట సుద్దులు'**
– డా॥ లిఖిత్...................... 43
**సమాజ అంతర్ బాహిర్ స్వరూపమే 'జలగల వార్డు'**
– డా॥ ఎ. రవీంద్రబాబు....... 55
**స్వీకారం**.......................................... 64
**డైరీ**.............................................. 65



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:

సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 / ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# కలహాల మారి

- కె. ఉషారాణి
9492879210

మాది కేవలం పదిహేడే ఎపార్టుమెంట్లున్న చిన్న సమూహం. అయిదే ఫ్లోర్లు. మూడే బ్లాక్లు. రెండు పెంట్ హౌసులు. అన్ని ఫ్లాట్స్‌లోను ఉన్నది ఒకరిద్దరే. అందులో ఎక్కువమంది సీనియర్ సిటిజెన్స్. అంతా ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకుంటూ పలకరింపులు పరామర్శలతో సరదాగా ఉండే ఫ్లాట్ ఓనర్లు  ఉన్న ఫ్లాట్స్ మావి. అన్ని ఫ్లాట్స్‌కి గాలి, వెలుతురు పుష్కలంగా ఉంటుంది. సూర్యోదయ సూర్యాస్తమయం కూడా ఇంటిలో నుండి చూడవచ్చు. మా వంటింటి నుండి సూర్యోదయం చూస్తూ కాఫీ చేసుకుంటాను. సాయంత్రం బాల్కనీలో కూచుని సూర్యాస్తమయం చూస్తూ టీ తాగుతాను. మా ఫ్లాట్స్ కార్యవర్గం అంతా  మహిళలే. నేను ట్రెజరర్‌ని. మాది నాలుగో ఫ్లోర్. అధ్యక్షురాలు మా పక్కింటి కనకదుర్గ. ఇక  కార్యదర్శి పద్మిని. మంచి సుహృద్భావ వాతావరణం లోనే ఉండే, పొరపొచ్చాలు లేని మా ఫ్లాట్స్‌లోకి మాయదారి కరోనా అడుగుపెట్టిందన్న అనుమానం కలహాలకు అంకురం వేసింది. మా ఫ్లాట్స్ లోకి, మా ఇంట్లోకి, మా నట్టింట్లోకే  గుట్టు చప్పుడు కాకుండా కరోనా చేరిందనే అనుమానం చుట్టూ ఉన్న అందరిలో కలగడానికి కూడా కారణం నేనే. కరోనా కలహప్రియ అని నాకు అప్పటి వరకు తెలియదు.

మా ఫ్లాట్‌లో ఉండేది నేను, మా అయన. అప్పటివరకు కరోనా రాకుండా ఉండడానికి  - ఎస్ ఎం  ఎస్ - శానిటైజేషన్, మాస్క్, సోషల్ డిస్టన్సింగ్ (ఆరడుగులు దూరంగా ఉండడం) అని, వస్తే ఐసోలేషన్ అని  మాత్రమే అనుకున్నా. ఐసోలాటిన్ అనుభవం లోకి వస్తే గాని దాని సారం అర్ధంకాలేదు

ఓ రోజు పొద్దున్నే మా ఇంటాయన దగ్గుతుంటే,

“ ఏవండీ, దగ్గుతున్నారు. కాస్త వేపర్ పట్టండి. గార్లింగ్ చేయండి” అంటూ ఒకటికి రెండు సార్లు చెప్పాను.

ఎప్పటిలాగే ఆయన

“కాస్తంత దగ్గుకు అలా వెంటపడతావు ఎందుకు” అంటూ కొట్టి పారేసారు.

నిజానికి దగ్గు ఆపకుండా వచ్చిందే లేదు. కానీ ఎందుకయినా మంచిదన్న ముందు జాగ్రత్త!

మంచికి చెప్పినా వినుకున్నందుకు కాస్తంత నొచ్చుకున్నాను. కానీ తప్పేదేముంది. దగ్గక పోయినా మళ్లీ మళ్లీ  గుర్తు చేస్తూనే ఉన్నా. ఆయనేమో విదిలిస్తూ పోతూనే ఉన్నారు.

ఎప్పటిలాగే పనమ్మాయి ఏడింటికల్లా వచ్చింది. అంట్లు తోముతూ ఈయనను నేను వేపర్ పట్టమనడం వినింది. అంతే.

“అమ్మా! అయ్యగారు దగ్గుతున్నట్టు ఉన్నారుకదా! ఎందుకయినా మంచిది. టెస్టుకు వెళ్ళమనండి. రిజల్ట్ వచ్చిన తరువాత నాకు కబురు పెట్టండి. మీరిచ్చే జీతాలకు మా జీవితాలను బలివ్వలేముకదా ! మీకయితే తప్పదు” అంటూ

లేచి పోయింది. నాకు నోట మాటే రాలేదు. షాక్ అన్నమాట. బలవంతంగా రమ్మనలేను. అన్నా రాదనుకోండి. కానీ డిఫెన్సె లెస్‌గా ఫీల్ అయ్యాను.

ఆ రోజే పదింటికల్లా వచ్చే బట్టలుతికే ఆమె రాలేదు. ఏమయిందో కనుక్కుందామని వాచ్ మాన్‌కి ఇంటర్ కామ్‌లో ఫోన్ చేసి అడిగాను. వచ్చి వెళ్లిందని, మా ఇంట్లో మా ఆయనకి కరోనా వచ్చిందన్న అనుమానం వలన బట్టలుతకను రాలేదని చెప్పాడు. పనమ్మాయి అతనికి చెప్పిందట.

అబ్బా! గాలి కన్నా వేగంగా వ్యాపిస్తున్నదే ! అనిపించింది.

ఇంతలో ఫ్లాట్‌ల కార్యదర్శి ఫోన్.

"మీ వారికి కరోనా అటగా!"

"ఇంకా టెస్ట్ చేయించుకోలేదండి. ఏదో కాస్త పొద్దున్న ఒకటి రెండు సార్లు దగ్గారు. వెళతారు లెండి." అన్నా. ఏమనాలో తెలియక.

ఇంతలో రోజూ పండ్లు తెచ్చే అమ్మాయి ఇంటి ముందు నుండి ముఖమంతా చీరతో కప్పుకుని పక్కింటికి వెళుతున్నది. పూలిచ్చే అమ్మాయి కూడా అంతే. మాస్క్ వేసుకోడం కాదు. ఏకంగా బురఖాలు వేసుకున్నట్టు చీరలు కప్పుకున్నారు. పొద్దున్న జరిగిన సంఘటనలతో ఇప్పుడిక ఆశ్చర్యం వేయలేదు.

కొరియర్ డెలివరీ వాచ్‌మాన్‌కి ఇచ్చి పోయాడు.

పేపర్ వాడు డిటో.

మాది మధ్య నున్న ఫ్లాట్. ఇటువాళ్ళు అటు వాళ్ళు ఫోన్‌లు.

"విజయా ! ఎందుకయినా మంచిది. మీవారిని హాస్పిటల్‌లో చేర్పించు. లేకపోతే ఇబ్బంది. మాకే కాదు. నీకు కూడా. నీకు మాత్రం వయసు తక్కువుందా. ఈ వయసులో రిస్క్(?) అవసరమా. డబ్బుకు వెనకాడకు" ఆ సలహా ఇచ్చే గొంతులో జాగ్రత్త చెప్పడం కన్నా ఆందోళనలు పలికాయి.

ఫోన్ పెట్టగానే మరో కాల్.

" వనజని, విజయా ! కరోనా అంటే భయపడక్కరలేదు. జాగ్రత్తలు తీసుకుంటే సరి. సోషల్ డిస్టన్సింగ్ ముఖ్యమని నీకు కూడా తెలుసుకదా! మా ఫ్రెండ్‌కి తెలిసిన హాస్పిటల్ ఉంది. కరోనా ఐసోలేషన్ కోసం పెట్టిందే. డబ్బుగురించి నువ్వు ఆలోచించకు. తెలిసినాయనే. తగ్గించి ఛార్జ్ చేయమంటాలే. మనవాడే కాదనడు. "అదే భయంతో కూడిన ఆందోళన. "మీవారు మరీను. మేము వద్దన్నా వినకుండా సమాజసేవని బయట తిరిగారు. బయటికి వెళ్లడం వలన ఇపుడు మీకే కాదు మాకు రిస్క్ కదా! సర్లెండి ఇప్పటికయినా హాస్పిటల్‌లో చేర్చడం అశ్రద్ధ చేయకండి ." సలహా !

నాకు కోపం తార స్థాయికి చేరింది. కానీ ఎవరిమీద కక్కాలి. ఎదురుగుండా రాగానే ఆయననే వాయించాను. వెంటనే టెస్ట్‌కి వెళ్ళమని లేకపోతే నిరసనగా నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించాను. నాకు జలుబు లేదు. జ్వరం లేదు. టెస్టులు చేయరేమో అన్నా వినలేదు. ఇక తప్పని పరిస్థితిలో ఆయన ఆధార్ కార్డుతో బయలు దేరారు.

రెండు గంటల తరువాత ఇంటికొచ్చారు. అప్పటికి కేవలం టెస్ట్ చేసుకోను పేరు మాత్రం రిజిస్టర్ అయిందట. టెస్ట్‌కి రేపు రమ్మన్నారుట.

మళ్లీ ఉదయమే నేను పనులతో సతమత మవుతుండగా, బయలు దేరారు. లిఫ్ట్‌లోకి వెళ్ళంగానే అందులో ఉన్నవారందరూ దిగి పోయారట! మీరు లిఫ్ట్ ఎక్క వద్దని అనలేక కాబోలు! రోజూ పలకరించే రెండో ఫ్లోర్‌లో ఉండే తాతగారు ఆరడుగుల దూరానికి జరిగి ముఖం తిప్పుకున్నారుట. వాచ్‌మాన్ ఆయనని చూసిన వెంటనే ముఖానికి ఉన్న మాస్క్ ని మరింత సర్దుకున్నాడుట. ఇప్పుడు ఆయనకి కూడా పరిస్థితి అర్థమయింది. నా ఆందోళన బుర్ర కెక్కిందనుకుంటా. ఆయన కాస్త చిన్న బుచ్చుకున్నట్టున్నారు. పైకిరాగానే అనుమానానికయినా అర్థం ఉండాలని విషయం చెప్పి రుస రుస లాడారు. పొద్దున్న టిఫిన్ తిని టెస్ట్ కని బయలు దేరినాయన మధ్యాహ్నం మూడయినా రాలేదు. కళ్లు తేలేసుకుంటూ నాలుగింటికొచ్చారు. టెస్ట్ చేసే వాన్ రావడం ఆలస్యమయిందిట.

అమ్మయ్య !! టెస్ట్ అయింది అని నిట్టూర్చాను.

రిజల్ట్ ఫోన్‌కే వస్తుందట. కొంతలో కొంత అదోనయం. మళ్లీ పరిగెట్టక్కరలేదు. గుడ్డిలో మెల్ల అని సంతోషించాము.

ఎందుకయినా మంచిదని 'ఐసొలేషన్ (ఒంటరిగా బంధించడం ) మొదలు పెట్టాను.

అయన రాకమునుపే నేనా ఏర్పాట్లు చేశాను. జ్వరం చూసేందుకు ఒక థెర్మోమీటర్, పల్స్ ఆక్సిజెన్ చూసేందుకు పల్స్ ఆక్సిమీటర్ మీటర్, వేపర్ పట్టడానికి వేపరైజర్, నీరసం రాకుండా ఉండడానికి డ్రై ఫ్రూట్స్ – బాదాం, పిస్తాలు, ఎనెర్జీ డ్రింక్, వేడినీళ్లు తాగడానికి ఒక ఫ్లాస్కో వేడినీరు పోసి రూమ్‌లో పెట్టాను. తిన్నవి తాగినవి కడిగేందుకు వీలుగా

రిన్ సబ్బు, బట్టలు ఉతుక్కోడానికి సర్ఫ్ ప్యాకెట్, బాత్రూంలో పెట్టాను. బట్టలు బీరువాలో పెట్టి, తన గదిని తలుపేసుకుని వీలయినంత ఇబ్బంది లేకుండా ఉండేవిధంగా తయారు చేశాను.

"నాకు జ్వరం లేదు. జలుబు లేదు. ఈ ఏర్పాట్లేమిటి" అన్నా జరిగిన అనుభవంతో ఒద్దికగా సద్దుకున్నారు.

భోజనం గది బయటే పెట్టి, తీసుకోమన్నాను. గంట గంటకు వేడిగా ఏదో ఒకటి అందించడం మొదలు పెట్టాను.

అయిదింటికి వేడి నీళ్లు మరిగించిన అల్లం రసం, పసుపుతో. ఆరింటికి వేడి పాలలో మిరియాలు వేసి, ఏడింటికి టీ, ఎనిమిదింటికి భోజనం. తొమ్మిదింటికి వేడినీళ్ల ఫ్లాస్క్‌లో పోసి, అమ్మయ్య ఈ రోజు గడిచిందని అనుకున్న. అన్ని ఏర్పాట్లు చేయడం, గది బయట పెట్టడంతో కాళ్ళ నొప్పులు అప్పుడే మొదలయ్యాయి.

కిటికీలో నుంచి ఎండ కళ్ళలో పడగానే అప్పుడే తెల్లారిందా బాబూ అనిపించింది.

ముందు పనిమనిషి పని, ఆ తరువాత బట్టలుతికే పని ముగిసాయి.

వాచ్ మాన్ డస్టుబిన్ క్లియర్ చేయలేదు. ఆ పనీ నేనే.

ఇంతలో

" విజయా ! ఇంకా కాఫీ చేయలేదా" దాదాపు అరుపులు గదిలో నుంచి వచ్చాయి.

" ఇప్పుడే వంటింట్లోకి వచ్చాను"

" ఇంత ఆలస్యమయింది ???"

" ఆ, నిద్రపోయాలెండి"

"వెటకారమే!"

"మరేం"

కాఫీ ఇచ్చి కూరల సంచితో బయలు దేరాను.

మాస్క్ వేసుకునే. నేను నడుస్తుంటే చుట్టు పక్కల ...

అందరి చూపుల్లో ప్రశ్నలు.

అందరి నడకలో ఆందోళన.

అందరి ముఖాలలో అసహనం.

ఇన్నేళ్ల తరువాత జీవితంలో అంటరాని వారు ఎటువంటి భావనకు లోనవుతారో అనుభవించాను. కరోనా వలనే. కాస్త జ్ఞానోదయం అయింది.

చేతికున్న హ్యాండ్ గ్లోవ్ నమ్మకాన్ని ఇవ్వలేదు. శానీటయిజర్ మీద గురికుదరలేదు.

భయం భయం భయం.

పాపం ప్రాణం కదా ! పోతే తెచ్చుకోలేమన్న భయం.

పోకుండా కాపాడుకోడానికి ఆసుపత్రులకు చేయాల్సి వచ్చే చెల్లింపులకు భయం.

ఆసుపత్రులలో తీసుకునే శ్రద్ధ తెలిసి భయం,

ఆసరా లేకుండా పోతుందన్న భయం.

సమూహంలో ఒంటరితనం !

మన చుట్టూ చూపుల గోడలు .

అనుమానపు నీడలు.

ఆవేదనలు అలజడులు .

మనిషి బలం సమూహం. కానీ కరోనా ఆ బలాన్ని భయపెట్టింది. మనిషిని ఒంటరి చేసింది.

నెమ్మదిగా పని ముగించుకుని ఇల్లు చేరాను... రేపటి కోసం ఎదురు చూస్తూ ...

గంట గంటకు రసాలు చేయడం, అందించడం రాత్రయేసరికి నడుం వంగింది.

తెల్లవారింది. కరోనా సెంటర్ నుండి ఫోన్‌కి ఏ సందేశం రాలేదు.

ఇక ఇప్పుడు బంధువుల పలకరింపులు మొదలయ్యాయి. ఫ్లాట్ మేట్స్ ఫోన్‌లు. సందేహాలు తీర్చుకోడానికి.

"అక్కా, బావగారు ఎలాఉన్నారు? మీ పక్కింటావిడ మార్కెట్లో కలిసి చెప్పిందమ్మా"

"వదినా, అన్నయ్యగారు బాగున్నారు కదా ! మీ ఎదురింటి ఫ్లాట్‌లో వాళ్ళు ఆఫీస్‌లో కలిసినప్పుడు విషయం చెప్పారు"

"అమ్మాయ్! జాగ్రత్త! ఏ మాత్రం అశ్రద్ధ చేయకు. మీ వీధిలోని పచారీ సామాను అమ్మే అయన చెప్పాడు" పిన్ని హెచ్చరిక.

"అల్లుడికి బాగులేదంటకదా, అమ్మాయ్! జాగ్రత్త తల్లీ! అందరం ఉన్నా ఏమిచేయలేని పరిస్థితి. నువ్వే జాగ్రత్తగా చూసుకోవాల్సి వస్తున్నది మరి. హాస్పిటల్‌లో జాయిన్ చేస్తే ఎలాఉంటుందని అనుకుంటున్నావు" అమ్మ ఆందోళన.

"కనుక్కున్నానమ్మా. ప్రైవేటు హాస్పిటల్స్‌లో రోజుకు ఏభైవేలు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో బెడ్స్ లేవు. బెడ్స్ ఉన్న చోట స్టాఫ్ లేరు. లేదా ఇతర సౌకర్యాలు లేవు. చూద్దాంలే. ఇంతకీ రిజల్ట్ రానీ. వచ్చాక నీకు ఫోన్ చేస్తాలే."

ఔరా ! ఎంతమందికి మనమంటే అక్కర !! ఆ అక్కరలో

ఎన్ని రంగులు !!!

ఇంకా నా స్నేహితుల ఫోన్‌లు. ఆయన స్నేహితుల ఫోన్‌లు.

ఈయన స్నేహితుడు కనకారావు తీసుకోవలసిన జాగ్రత్తలు చెపితే, వామనరావు ఆయుర్వేదం, అలోపతి, హోమియోపతి మందుల గురించి చెప్పారు. అవంతి ధైర్యం చెపితే, హర్ష జాగ్రత్తలు తీసుకోక పోవడంతో, నిర్లక్ష్యం చేసినవారి అనుభవాలు చెప్పారు. అన్వర్ యూట్యూబ్‌లోని కరోనాకి సంబంధించిన వివరాలన్నీ వాట్స్ అప్ చేసారు. నాని తెలిసిన డాక్టర్ల వివరాలు మెసేజ్ చేసారు. ఫోన్లు ఆయనకు కాదు. నాకు చేస్తున్నారు.

ఇంటెడు పనికి కామాలు పెడుతూ, ఫోన్‌లకు సమాధానాలు చెపుతున్నా.

కానీ మా అనుమానాలకు సమాధానం ఈ రోజు కూడా కోవిడ్ కేంద్రం నుండి రాలేదు.

ఐసోలేషన్‌లో ఆయనకి విసుగు మరింత పెరిగింది. "ఎంత సేపని చదవను? ఏ జ్వరమో వచ్చి ఉంటే పడుకునే వాడిని" అంటూ నస. ఆ విసుగు చూపిస్తూ వంటలు బాగులేవని వంక. కూరలో కారం తగ్గింది. పప్పులో ఉప్పేలేదు. అన్నం ఇంకాస్త ఉడికించవలసింది. తిరగమాతలు వేగకుండా పోపేస్తున్నావేంటి? కాఫీ వేడిగా లేదు. టీ చల్లారి పోయింది. పనివాళ్లకు పెట్టినట్టు పెట్టి, తిన్న కంచాలు, గిన్నెలన్నీ నా చేతే కడిగిస్తున్నావు. బట్టలు ఉతికిస్తున్నావు. ఐసొలేషన్‌కి ఇవన్నీ చేయక్కరలేదు. మూడడుగులు దూరంగా ఉంటే చాలు. కసి తీర్చుకుంటున్నావు కాబోలు." మంద్ర స్థాయిలో అరుపులు.

"కనీసం టి వి చూడనివ్వు"

" బాత్రూం కూడా నేనే కడుక్కోవాలి?! హు .."

"మొబైల్ చార్జర్ పనిచేయడం లేదు" మరోటి కొను.

"ఒక్క టవల్ పెడితే ఎలా ? అది కూడా ఉతుక్కోవాలా?"

మూడో రోజంతా ఇలా గడిచింది. పడుకునే సరికి నాకు కూడా జ్వరం వచ్చిందా అనిపించేంతగా ఒళ్ళు హూనం అయింది.

మర్నాడు కూడా మళ్ళీ సూర్యుడే నిద్ర లేపాడు. లేవలేనని అనిపించినా కాఫీ కావాలనే కేకలు వినిపిస్తాయనే భయంతో గబగబా లేచాను.

"నిద్ర పట్టిందా ?" అని పలకరించాను. జ్వరం వచ్చిందా" అని అడిగే ధైర్యం లేక.

"అన్నీ బాగానే ఉన్నాయి. కాఫీ తగలెట్టు" ఈ రోజు సూర్యోదయంతో పాటే చిరాకు కూడా పొద్దున్నే వచ్చేసింది!"

నిజమే పాపం, మూడు రోజులు ఒంటరిగా ఒక గదిలో బంధించబడాలంటే మాటలా ! సింగల్ సెల్‌లో బంధించడం శిక్షేకదా !! ఏ నేరానికి ఈ శిక్ష?

టైమ్ పది అయింది. ఈ రోజు ఎండబాగా కాస్తున్నది. ఏ సి వేసుకోవద్దన్నాను. గది తలుపులు వేయడం వలన గాలి ఆడడం లేదనుకుంటా. పైగా ఫ్యాన్ గాలి సరిపోవడం లేదనుకుంటా. విసుగ్గా ఉన్నారు.

"ఈ రోజుకూడా టెస్ట్ రిజల్ట్ రాకుండా ఎందుకుంటుంది? కరోనా సేవా కేంద్రానికి ఫోన్ చేయండి" ఓ ఆలోచనను పంచుకున్నా.

వెంటనే ఫోన్ చేసారు.

" మీకు మర్నాడు పాజిటివ్ అని రాకపోతే నెగెటివ్ అనే లెక్కండి. నెగటివ్ వాళ్ళకి నెమ్మదిగా రిజల్ట్ పంపిస్తాము. "కరోనా సేవా కేంద్రం బిజీ, ఎస్ ఎం ఎస్ లు పంపే స్టాఫ్ సెలవు. టెస్ట్ చేసిన నమూనాలను పరీక్షించే టెక్నీషియన్ తండ్రికి కరోనా, అందుకతను రాలేదు."

ఏతావాతా రిజల్ట్ పంపడం ఆలస్యమయింది.

"హుర్రే హుర్రే !!" అంటూ మావారు చిన్న పిల్లాడు గోల్డ్‌మెడల్ సాధించినంత హుషారుగా గది బయటికి వచ్చారు.

ఏమంయితేనేం అమ్మయ్య. ఎలాగోలా రిజల్ట్ తెలుసుకున్నాము. చెప్పొద్దూ, నా సంతోషానికి కూడా హద్దులు లేవు.

పద్నాలుగు రోజుల బదులు నాలుగు రోజులలో బయట పడడం నయం కదా! మాయదారి కరోనా ఎంతగా భయపెట్టింది! ఎంతమంది మీద కోపం తెప్పించింది? మన కోపాన్ని ఆరు నెలల తరువాత వ్యక్తం చేయాలని మా అమ్మ మాట మనసులో ఉండబట్టి గాని, లేకుంటే సహాయనిరాకరణ చేసిన వారందరిని కడిగేసేదానినికాదూ! ఆపదలో ఉన్నవాడిని ఆదుకునే మానవ ధర్మాన్ని కరోనా కాటేసింది. ఆమ్మో!

కంటికి కనిపించని కరోనా బంధాలు అనుబంధాలు కనిపించేటట్టు చేసింది, ఔరా !!.

మొత్తానికి కలహాల మారి కరోనా మా నట్టింట అడుగు పెట్టనందుకు మేం పండగ చేసుకున్నాము. ఆ పండగ చేసుకున్నది కూడా మేమిద్దరమే. ♦

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ 2020 పురస్కారాలు

**ఆలోచనాత్మక అనుభూతుల కవిత్వం**

వ్యాసానికి : రూ.500/-

రచయిత : స్వర్ణలత గొట్టిముక్కల

**మనిషితనాన్ని తట్టిలేపుతూ**

కవితకు : రూ. 500/-

రచయిత : మామిడిశెట్టి శ్రీనివాసరావు

■■■

వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం

కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం, చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

- ఎడిటర్

---

కవిత

## మనుషుల్లేని దేశం

- కేశవ కుమార్

జనగణమన దేశం
మనుషుల విభజన దాస్యం
మట్టికొట్టుకుపోతున్న
సహజీవన సందేశం
భక్తిగాన గణయంత్ర
తంత్రం
మనిషి జాతిజెండా
మటుమాయం

మబ్బులు కమ్మిన ఆకాశం
మసకబారిన మనం
నడిచిన దారి
అజ్ఞానపు లోయల్లో
అహంకారపు వీధుల్లో

విర్రవీగుతున్న దేశం
నమ్మకాలు నెర్రలిచ్చి
పూడ్చులేని అగాధాలు
దేశమాత సరిహద్దు రేఖలే
కులనిప్పుల గీతల్లా
మనుస్మృతి పడగనీడలో
పవళించిన పవిత్రదేశం

మానవ మనుగడ గీతం
జాతుల కలల జాతర

సామూహిక ఆత్మ సంగీతం
వెలిసిపోయిన
ఇంద్రధనస్సులా దేశం
మూతిని నొక్కేసే
మెటల్ మాస్క్
కళ్లకు కుట్టిన టీవీ తెరల
మాయా నిర్దేశం
మాటల్లేని దేశం
ఉక్కు వుచ్చుల్లో
వూపిరాడక

చీకటి చివరిరాత్రి
కంటిన్యూయేషన్

మనిషితనం కూల్చిన
శిథిలాలపై దిష్టిబొమ్మగా నేషన్
మల్టీనేషనల్ కంపెని గొలుసులేసుకుని
నకిలీ దేశభక్తిని

నిజం దోపిడీని
వొళ్లంతా విబూదిలా రాసుకుని
దేశం దిమ్మపై
మాంత్రికుడి వికటాట్టహాసం
'నేనే శాసన్నాన్ని, దేశాన్ని, దేవుడ్ని'!

కట్టుబట్టా, కూరచట్టి
క్లాస్ బుక్కు, ఫేస్బుక్కు లైకూ
ఆకలి వేటా, చీకటి పాట

నిత్యనిరంతర నిఘాలో
దేశం సిసీ టీవీ కెమెరాలో
ఆత్మగౌరవమనరిచినోడు
ఎవడైనా ద్రోహే
అర్ధాంతరంగా
రద్దయిన చారిత్రక వారసత్వం
ఆగమయిన అతుకుల బతుకులు
దేశమిప్పుడు
అందమైన అబద్ధాల శవపేటిక

మనుషుల్లేని దేశం
దేశం లేని మనుషులు
గుండెనిండా
దేశమంత ప్రేమని
నింపుకున్నోడి కోసం వెతుకులాట ♦



# తరతరాల స్వరధార
## చాలు లేని బాలు !

*పాటను ప్రాణంగా చేసుకున్న నటుడుగా, నిర్మాతగా, వ్యాఖ్యాతగా, సమన్వయకర్తగా, ఉపన్యాసకుడిగా, సాహిత్య ప్రియుడుగా తెలుగు ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కళా స్వరూపి బాలు.*

బాలుడు బాలసుబ్రహ్మణ్యం అంటూ తనను తాను ఎప్పటికీ పసివాడుగా పరిగణించుకున్న శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం... భారతీయ సంగీత వైభవ పతాక. భాషా వైవిధ్య ప్రతీక. తరతరాల్లోకి ప్రవహించిన స్వరధార. చలనచిత్ర గీతాలాపనకు సంబంధించిన గీతలను చెరిపేసిన నవీన గీతాచార్యుడు. రామారావు నుంచి రాజబాబు వరకూ, శంకరాభరణం నుంచి వంకర టింకర గొంతుల వరకూ అన్నిటినీ అపురూపంగా పాడి అలరించిన గానగంధర్వుడు. 16 భాషల్లో పాడి అందరివాడిగా నిలిచిన భారత సుబ్రహ్మణ్యం. అన్నిటినీ మించి ఆయన పాటల బాటను తేలికపర్చారు. సాంకేతిక, సామాజిక మార్పులను ఆకళింపు చేసుకుని కొత్త వేదికలూ, వాడుకలూ కల్పించి స్వరాభిషేకం చేశారు. పాడుతూ తీయగా అంటూ తన పాట మన గుండెలో పలికిస్తూ వెళ్లిపోయారు. పాటను ప్రాణంగా చేసుకున్న నటుడుగా, నిర్మాతగా, వ్యాఖ్యాతగా, సమన్వయకర్తగా, ఉపన్యాసకుడిగా, సాహిత్య ప్రియుడుగా తెలుగు ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కళా స్వరూపి బాలు.

అరవయ్యవ దశకం నాటికి తెలుగు సినిమాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్‌లకు ఘంటసాల 95 శాతం పాటలు పాడితే– కాంతారావు, హరనాథ్ వంటివారికి పిబి శ్రీనివాస్ పాడేవారు. కొత్తగా వస్తున్న శోభన్‌బాబు, కృష్ణ వంటివారి విషయంలో మిశ్రమంగా ఉండేది. కమెడియన్లకు పిఠాపురం, మాధవపెద్ది ఎక్కువగా పాడేవారు. కోదండపాణి ప్రోత్సాహంతో తొలిసారి పద్మనాభం చిత్రంలో పాట పాడిన బాలు, కృష్ణ చిత్రాలకు అత్యధిక గీతాలు పాడేవారు. ఆయన తన పాత్రలకు విభిన్నమైన గొంతువుంటే మంచిదని భావించడంతో పాటు ప్రతిభాశాలికి నిలదొక్కుకోవడానికి తోడ్పడాలనుకున్నారు. అప్పట్లో ఆయన చిత్రాల సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉండేది గనక పాటలు ఎక్కువగానే వచ్చేవి. అయితే బాలు గొంతు అలాటి యువ నటులకు సరిపోవచ్చు గాని అగ్రనటులు ఎన్టీఆర్, ఏఎన్నాఆర్‌లకు ఘంటసాలే పాడాలనుకునేవారు. ఎన్టీఆర్, మహమ్మద్ రఫీతో ప్రయోగాలు మొదలుపెట్టారు. అక్కినేని, రామకృష్ణకు అవకాశాలు ఇస్తున్నారు. శోభన్‌బాబు కూడా రామకృష్ణతోనే పాడించుకోవడం మొదలెట్టారు. ఈ దశలో బాలు భవిష్యత్తు ఒకింత ఇబ్బందిలో పడినట్టే అనిపించింది. అప్పుడు ఆయనకు కృష్ణ తోడుగా నిలిచారు. 'నా చిత్రాలకు నీవు మాత్రమే పాడతావ'ని అభయమిచ్చారు. ఆయన జేమ్స్‌బాండ్ తరహా చిత్రాల్లో బాలు పాప్ తరహా ప్రయోగాలు చేయగలిగారు. చలం సినిమాల్లోనూ మంచి పాటలు పాడారు. కలెక్టర్ జానకిలో కుచేలుడి పేరుతో కుటుంబ నియంత్రణ చెప్పే ఆధునిక హరికథ వంటివి బాలు ప్రత్యేకతను చాటాయి. 'ఆకాశం నుంచి నా కోసం వచ్చావా' అని రాజబాబుకు తమాషాగా పాడిన పాట ట్రెండ్ సెట్టర్ అయింది. అప్పటికే ఘంటసాల అస్వస్థులయ్యారు. అల్లూరి

సీతారామరాజులో 'తెలుగు వీర లేవరా' పాట బాలుతో పాడించుకోమని కృష్ణకు సలహా ఇచ్చారు కూడా. ఆయన తర్వాత అగ్రనటులకు ఎవరు పాడతారన్న సందేహాలు కూడా ఉండేవి. వాటన్నిటినీ పటాపంచలు చేశారు బాలూ.

దాసరి 'మనుషులంతా ఒక్కటే' లో 'ముత్యాలు వస్తావా' అని అల్లు రామలింగయ్యకూ, 'అనుభవించు రాజా' అని ఎన్టీఆర్‌కు కూడా పాడి మెప్పించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. 'కృషి వుంటే మనుషులు రుషులవుతారు' అని 'అడవి రాముడు'లో పాడినట్టు బాలసుబ్రహ్మణ్యం జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగింది. అక్కినేనికి ప్రేమాభిషేకంలో 'ఆగదు ఏ నిముషం నీ కోసమూ' వంటి పాటలు అమితంగా ఆకట్టుకున్నాయి. సాహిత్యంపై అమితమైన మక్కువ గల బాలు రచయిత ఉద్దేశించిన భావాన్ని అభినయించే నటుల మేనరిజాన్ని మేళవించి పాడటం కొత్త వరవడిగా మారింది. 'శంకరాభరణం'లో శాస్త్రీయ సంగీత గీతాలాపనతో జాతీయ పురస్కారాలు పొందడం ఆయనను కొత్త శిఖరాలకు చేర్చింది. తెలుగు సినిమా పాట అంటే బాలు అన్నట్టు తయారైంది పరిస్థితి. ఒక్కడే అన్నీ పాడుతున్నాడన్న విమర్శలు వచ్చినా– నిర్మాతలు, ప్రేక్షకులు, చిరంజీవి వంటి కొత్త హీరోలూ కూడా తననే ఎంచుకోసాగారు. మధ్యలో కొద్దికాలం కృష్ణతో అపార్థాలు తలెత్తిన కారణంగా రాజ్ సీతారాం అనే మరో గాయకుడు వచ్చినా, మాధవపెద్ది సురేష్, మనో లాటి గాయకులు కూడా పాడినా– బాలు యుగమే సుదీర్ఘకాలం కొనసాగింది. తన తండ్రి కూడా హరికథ కళాకారుడైతే– కుమారుడు చరణ్, సోదరి శైలజ కూడా గాయకులవడం యాదృచ్ఛికం కాదు.

ఒక దశలో బాలు ఎంత తీరిక లేకుండా గడిపారంటే రోజుకు 24 గంటలుంటే ఆయన 21 పాటలు పాడి రికార్డు సృష్టించాడు. మొదటి పాట పాడిన కొద్ది రోజుల్లోనే కన్నడ, తమిళ భాషల్లోనూ గానం చేశారు. కోదండపాణి, మహదేవన్, సత్యం వంటివారి నుంచి ఇళయరాజా, ఎఆర్ రహమాన్ వరకూ ఈ సంగీత ప్రస్థానం కొనసాగింది. వీరు మొదట ఆయన దగ్గరే పనిచేసిన వారు కావడం మరో అద్భుతం. ఈ కాలంలోనే కమల్‌హాసన్, రజనీకాంత్ వంటివారికి డబ్బింగ్ చెప్పడం వారి ఘన విజయానికి దోహదం చేసింది. ఉత్తరోత్తరా అది ఉప వ్యాపకమైంది. దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ హిట్స్ ఇచ్చిన బాలు ఏక్ దుజేకిలియే (మరో చరిత్ర) తో జాతీయ పురస్కారం పొందడం అరుదైన చరిత్ర. 40 వేల పాటలు పాడి గిన్నీస్ బుక్‌కెక్కిన ఆయన బోలెడన్ని పాత్రలు ధరించడం, చిత్రాలు నిర్మించడం బహుముఖీనతకు అద్దం పడతాయి. సంగీత దర్శకత్వం సరేసరి. తన శుభ సంకల్పంతో విశ్వనాథ్‌ను తెరమీదకు తెచ్చింది కూడా బాలూనే. ఇదే కాలంలో సంగీత కచేరీలను ఆధునికం చేసి దేశ విదేశాల్లో ఎందరికో స్ఫూర్తినీ, ఉపాధినీ ఇచ్చారు.

2000 తర్వాత, క్రమేణా పరిశ్రమలో మార్పుల తర్వాత మరో తరం యువత ప్రధాన పాత్రల్లోకి వచ్చాక, బాలు సినిమాలకు పాడటం క్రమేణా తగ్గింది. అయితే అదే సమయంలో టీవీలలో స్వరాభిషేకం వంటి కార్యక్రమాలతో కొత్త తరాలకు స్వరధారను అందించారు. వాటిని సమయస్ఫూర్తితో, ఉత్తేజకర జ్ఞాపకాలతో, చమత్కారాలతో నిర్వహిస్తూ విజయవంతం చేశారు. ఆ విధంగా కాలంలో మార్పులనూ సాంకేతిక ప్రక్రియలనూ ఆకళింపు చేసుకుంటూ సవాళ్లను అధిగమించి సంకల్పబలం చాటారు. అయితే కొత్త తరహా సంగీత కారుడుగా సంప్రదాయ సినీ బాణీలను మార్చిన బాలు ఈ క్రమంలో తనే గత ధోరణులకు ప్రతినిధిగా మారడం ఒక విచిత్రం. ఉచ్చారణకు అధిక ప్రాధాన్యత, కొత్త పరభాషా గాయకుల స్వల్ప లోపాలు చెప్పడం పరిపాటిగా తయారైంది. దాంతో మలిదశలో ఆయన ఇమేజ్ మారింది. తన తొలి గురువు కోదండపాణి పేరిట రికార్డింగ్ స్టుడియో కడితే ప్రేరణగా నిలిచిన ఘంటసాల విగ్రహాన్ని ప్రతిష్టించి గౌరవం చాటుకున్నారు. తన సంగీత కార్యక్రమాల్లోనూ పాత తరం కళాస్రష్టలనూ, జానపద ప్రజా కళాకారులనూ గౌరవంగా పరిచయం చేయడం కూడా తన వినమ్రతను చాటుతుంది. జాతీయ అవార్డులు, నంది పురస్కారాలు బాలుకు లెక్కకు మిక్కుటంగా రావడానికి తన నిరంతర సాధన తపనలే కారణం. గొప్పవారు, కళాకారులు కన్నుమూసినప్పుడు కలిగే బాధను మించి నలుదిక్కుల నుంచి గుండెల్లోకి దూసుకొచ్చే బాలు కంఠస్వరం కన్నీళ్లు తెప్పిస్తుంది. ప్రతి ఇంట్లోనూ సొంత మనిషిని కోల్పోయామనేంతగా కలచివేస్తుంది. 'మనిషి పోతె మాత్రమేమి మనసు వుంటది' అని ఘంటసాల పాడినట్టు, 'నువ్వు లేవు నీ పాట వుంది' అని తిలక్ అన్నట్టు– బాలు మనలో నిలిచే ఉంటారు. కృష్ణా తరంగాల సారంగ రాగాలు వినిపిస్తూనే ఉంటారు.

**- తె. ర ♦**

## కవిత

# నేనెవరంటావ్...?

- యస్. నితిన్ కుమార్ రెడ్డి

నేనెవరబ్బా..?
అని సందేహపడుతున్న నాకు
నా మనసు
ఇదుగో ఇదే నువ్వని ఇచ్చిన బదులు...!
నేనెవర్ని...?
లాలించే అమ్మ నడిపించే నాన్నల
ప్రేమకి చిహ్నంగా చిగురించిన చిన్నవాడ్ని...!
ఆదరించే అందమైన అక్కకు
ఆనందాన్ని అన్ని విధాల
అందివ్వాలని అనుకుంటున్న వాన్ని...!
నేనెవర్ని...?
రాళ్ళు తేలిన భూములు
రాటు తేలిన మనుషుల మధ్య
రూపొందిన రూపాన్ని నేను..!
రాళ్ళ సీమ కాదిదీ!
రాయలేలిన సీమ
మా రతనాల సీమ అని చాటే
సిసలైన సీమవాసి సిన్నోని...!
నేనెవర్ని...!
పచ్చదనాన్ని పట్టుపరికిణిలా కట్టుకున్న
పల్లెటూరిలో పుట్టినోడ్ని...!
పంతాలు పట్టింపులతో పాటుగా
ప్రేమ పలకరింపుల పరివారంలో పెరిగినోడ్ని...!
పసితనంలోనే కసితనంగా



పొలం పనిలో పార పట్టిన పాలెగాన్ని...!
నేనెవర్ని...?
తిరిగిరాని తీరాలకు చేరువైన ఆనందాన్ని..
తరగని చెరగని మరపురాని మధురిమల్ని...
పంచుకొని పెంచుకున్న ఎన్నో సంతోషాల్ని
గుండెలో నిండిపోయే
మనసులో ఉండిపోయే అనుభవాల్ని...!
దరిచేర్చిన దోస్తుగాలున్న వెనుక వరుస విద్యార్థిని...!
నేనెవర్ని...?
అలల కడలిలో అలుపెరగని అలజడులలో
సాగే (జీవితమనే) నావకి
అందమైన తీరగమ్యాలను చూపే నావికుడిని...!
నేనెవర్ని...?
అందరూ అనుకునేంత అమాయకుడిని కాను..!
అందరిలా మహా మాయకుడినీ కాను...!
అందని కథను నడిపే ఓ నాయకుడని...!
నేనెవర్ని...?
కనులు కన్న కళను కలిపే కదలిక కోసం...
కలలో కథగా కదులుతున్న కల కోసం...
కలగంటున్న ఓ అభాగ్యుడ్ని!
ఇంతకీ... నేనెవరంటావ్...? ♦

---

# స్వేచ్ఛ

- పులుమద్ది సత్యనారాయణ
9441000537

వోల్టేరు ఒడిలోనే మాటలు నేర్చుకుంది
ఆయుధమై ఫ్రెంచి విప్లవాన్ని ఆవిష్కరించింది
ప్రపంచానికి తన అవసరాన్ని నేర్పింది
స్వేచ్ఛ మనిషికి మొదటి అవసరం
ఈ అవసరం కోసమే చరిత్రలో ఇన్ని పోరాటాలు
ఇప్పుడు మహాసముద్రాల కావల
చీకట్లో దాగున్న చిలకలా
ఆర్థిక సంస్కరణల రూపంలో
ఇనుప టోపీ నీడలో బ్రతికే ఉంది
పార్లమెంటూ, అసెంబ్లీ, పోలీసు స్టేషన్లూ
నియంత స్థావరాలై
తుపాకులకు ఖాకీ డ్రెస్సులు వేసి



మరణశయ్య వైపు లాక్కెళ్తున్నాయి
మీ ప్రయాణం ఆపకండి
ఒక్కొక్క మలుపు దగ్గర
కొత్త కొత్త సంస్కర్తలు పుట్టుకొస్తారు
నియంతను నిర్వీర్యం చెయ్యటానికి
ప్రజలకు స్వేచ్ఛను గుర్తుచేస్తారు
ఇప్పుడది
బాలెట్ బాక్సులో ఉంది
మీకూ నాకూ సెలవు
మళ్లీ మనం
ఎన్నికల్లో ఓటింగప్పుడు
కలుసుకుందాం... ♦

విశ్లేషణ

# సామ్రాజ్యవాద అవిచ్ఛిన్నత 'కృష్ణస్వప్నం'



- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

*మార్పులకు కారణాలనూ చాలా కథలు చెప్పాయి. మార్పులను చరిత్ర నేపథ్యంలో చిత్రించే కథలు తక్కువగానే వచ్చాయి. 'కృష్ణస్వప్నం' వాటిలో గొప్ప కథ. కృష్ణార్జునులను పాత్రలుగా ప్రవేశపెట్టడం వల్ల ఈ కథ పౌరాణికమూ కాదు, ఫాంటసీ కాదు, మరేదో కాదు. ఇది అచ్చమైన వాస్తవిక వాద కథ.*

***'మైదానాల వాళ్లం మనం***
***వనాలనూ వన్య జీవులనూ తొలగించినట్లే***
***యిట్లాంటి అడవిజాతులను సంహరించకపోతే***
***మనమెలా విస్తరిస్తాం? ఎలా జీవిస్తాం చెప్పు"***

"కృష్ణ స్వప్నం" అనే కథ వివిన మూర్తి రాసినది. ఇది అన్వేషణ అనే వారపత్రికలో 1995 డిసెంబర్ 12 సంచికలో వచ్చింది. మూర్తి ఇంజనీరు. బెంగళూరులో ఉంటారు. శ్రీకాకుళం వాసి. ప్రవాహం, దిశ వంటి కథా సంపుటాలు, వ్యాపార సంబంధాలు వంటి నవలలు రాశారు. శ్రీకాకుళంలోని 'కథానిలయం' ను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. తొలి తెలుగు కథలుగా చర్చలో నలిగిన ఏడు కథలను సంకలనం చేశారు. గురజాడ 'దిద్దుబాటు' కు ముందు 1879 నుండి వచ్చిన 92 తెలుగు కథలను సేకరించి 'దిద్దుబాటలు'గా సంకలనం చేశారు. ఇదొక మాన్యుమెంటల్ వర్క్.

'కృష్ణస్వప్నం' కథ 140 ఏళ్ళ తెలుగు కథా వికాసంలో చరిత్రలో లభించే అరుదైన కథలలో ఒకటి. ఇది సామ్రాజ్యవాదంలోని అవిచ్ఛిన్నతను చిత్రించింది. కాలాలకు, దిక్కులకు, సంస్కృతులకు అతీతంగా సామ్రాజ్యవాదం ఎలా కొనసాగుతున్నదో ఈ కథ ఆవిష్కరించింది. జీవితాన్ని, సమాజ పరిణామాలను శకలాలుగా చూడడం అలవాటైన వారికి ఈ కథ కళ్ళు తెరిపిస్తుంది. అత్యాధునికత పేరుతో, ఆధునికానంతర వాదం పేరుతో మహా కథనాలకు కాలం చెల్లింది అనే వాదించే వాళ్ళకు సామ్రాజ్యవాదంలోని మహాకథన స్వభావాన్ని ఈ కథ ప్రదర్శింది. చూపిస్తుంది. ప్రపంచమంతా ఏదో మారిపోతూ ఉంది అని వాదించే వాళ్ళకు, మారని పీడన, హింసా దౌర్జన్యాలను ఈ కథ చూపిస్తుంది.

ఎనభై ఏళ్ళు పైబడిన అమెరికా అధ్యక్షుడు శ్వేతభవనంలో పడగ్గదిలో పడుకొని ఉంటాడు. నిద్రమాత్రలు వేసుకున్నా నిద్రపట్టని మగతలో పొర్లుతూ ఉంటాడు. ఉదయం మూడుగంటల సమయం. ఉన్నట్టుండి ఆ గదిలో వెలుతురు కనిపిస్తుంది. చల్లని గాలి వీస్తుంది. అధ్యక్షుడు కళ్ళు తెరిచి చూస్తాడు. ఆ వెలుతురు నుండి శ్రీకృష్ణుడు ప్రత్యక్షమౌతాడు. ఆయన తలమీద నెమలిపింఛం, వంటిపైన పీతాంబరాలు, చేతిలో మురళి, వక్ష స్థలం మీద కౌస్తుభరత్నం, మెడలో వైజయంతి మాల, ముక్కుమీద మౌక్తికం ఉన్నాయి. అధ్యక్షుడు ఆ రూపాన్ని చూసి మొదట భయపడతాడు. "ఎవరు నీవు" అంటాడు. "కృష్ణుడును" అని సమాధానం వస్తుంది. "అంటే"" అని అడిగిన అధ్యక్షునికి "రేపు కలవబోయే భారత ప్రధానితో మాటలాడటం కోసం నువ్వు చూస్తున్న గీత ప్రవక్తను" అని చెబుతాడు కృష్ణుడు. "ఎందుకు వచ్చావు" అన్న ప్రశ్నకు "అభినందించాలని" అని సమాధానం చెబుతాడు. "ఏం చేశానని" అన్న ప్రశ్నకు "నా స్వప్నాన్ని సాకారం చేశావు" అని చెబుతాడు. నాగరికుల స్వప్నం. యుగయుగాల స్వప్నం.

నేతల స్వప్నం. విజేతల స్వప్నం." అంటూ ఇరాక్ యుద్ధంలో అధ్యక్షుడు గెలవటాన్ని గుర్తుచేస్తాడు. ఈ సందర్భంలో కృష్ణుడు మహాభారతంలోని ఖాండవ దహన ఘట్టాన్ని దృశ్యంగా అమెరికా అధ్యక్షునికి ప్రదర్శిస్తాడు.

పచ్చని ప్రకృతిలో అసంఖ్యాక జీవరాశి మధ్య సహజ జీవనం గడుపుతున్న మూలవాసులైన నాగజాతి ప్రజలు నివసించే అరణ్యాన్ని కృష్ణార్జునులు ఇంద్రప్రస్థపురం నిర్మించడానికి కాల్చిబూడిద చేస్తారు. వన్యప్రాణులు, మూలవాసులు మాడి మసైపోతారు. నీటివనరులన్నీ తాగడానికి పనికిరాకుండా పోతాయి. కృష్ణార్జునులకే దప్పిక అయితే తాగడానికి నీళ్ళు దొరకవు. తేనెతుట్టెలు కూడా కాలిపోయి ఉంటాయి. అంతా కాలిపోయాక కొమ్మలు పగులుతున్న శబ్దం తప్ప ఇంకేమీ వినిపించదు. అర్జునుని కాళ్ళకు ఒక శిశువు చుట్టుకుంటే, కృష్ణుడు చంపమంటాడు. అర్జునుడు చంపలేను అంటాడు. ఈ యిద్దరి మాటల మధ్య "యుద్ధాల్లోకి అడుగు పెట్టకుండా యుద్ధ విజేతలయ్యే యుగం తప్పక వస్తుంది" అంటాడు కృష్ణుడు. "అది నీ స్వప్నం" అన్న అర్జునునితో "ఇది ఈనాడు స్వప్నం. భవిష్యత్తుకు సత్యం" అంటాడు కృష్ణుడు.

ఈ దృశ్యమంతా చూపించిన కృష్ణుడు అమెరికా అధ్యక్షునితో "నువ్వు దాన్ని సత్యం చేశావు నా వారసుడా.." అని చెప్పి అదృశ్యమైపోతాడు. అప్పుడు అధ్యక్షునికి అలెగ్జాండర్, చంఘీజ్‌ఖాన్, తామర్లేన్, హిట్లర్ వంటి వాళ్ళ ఉపన్యాసాలు చెవులకు వినిపిస్తాయి. ఇంతలో సమయం ఉదయం ఆరు గంటలౌతుంది. అధ్యక్షుడు బల్ల మీద చేయి బెడ్తాడు. కాగితాలు తగులుతాయి. అవి ఆ రోజు ఇతర దేశాలలో మానవ హక్కుల మీదా, ప్రజాస్వామ్యం మీదా, కార్మిక జీవన ప్రమాణాల మీదా అధ్యక్షుడు చేయవలసిన ఉపన్యాసాలు. అవి ఆయా రంగాలలో నిపుణులు తయారుచేసి పెట్టినవి. వాటిని తీసుకుని అధ్యక్షుడు టాయ్‌లెట్‌లోకి వెళతాడు. అవి చదువుతూంటే ఆయనకు నవ్వు వస్తుంది. ఆ నవ్వు పెరిగి పెరిగి దేశదేశాలకూ విస్తరిస్తుంది. విశ్వాంతరాళాన్ని చుట్టు ముట్టేస్తుంది. ఆ నవ్వులోంచి ఒక రూపం పుడుతుంది. అది భూమ్యాకాశాలనూ, నక్షత్రమండలాన్ని తాకుతుంది. అదొక విరాట్ స్వరూపం దానికింద కోటానుకోట్ల మానవులు నలిగిపోతున్నారు. ఒక బీభత్స వాతావరణం నెలకొంది. ప్రపంచ దేశాల అధినేతలూ, విద్యావంతులూ, శాస్త్రవేత్తలూ ఆ రూపానికి భజన చేస్తున్నారు. ఆ రూపం క్రమంగా కుంచించుకుపోయి ఒక చిన్న మాత్రగా మారింది. అది అధ్యక్షుని కడుపులో చేరింది. ఆయనకు సుఖ విరేచనమయ్యింది. ఆయన 'అమ్మయ్య' అనుకుంటూ టాయ్‌లెట్ నుండి బయటకి వచ్చాడు. ఇదీ ఈ కథలో ఇతివృత్తం.

ఈ కథ 1995లో వచ్చింది. అప్పటికి మనదేశంలో ప్రపంచీకరణ మొలకదశలో ఉన్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రధాన రూపం పరిణత రూపం సామ్రాజ్యవాదం. దాని అభివ్యక్తిరూపం ప్రపంచీకరణ. ప్రపంచీకరణ అంటే పాశ్చాత్యీకరణ. ప్రధానంగా అమెరికకీకరణ. ప్రపంచ దేశాలలో ఎక్కడైనా ప్రజా హక్కులకు భంగం కలిగినప్పుడు అమెరికా ప్రశ్నిస్తుంది. తాను మాత్రం చిన్న చిన్న దేశాలమీద యుద్ధం చేస్తూ ఉంటుంది. ప్రపంచ దేశాలన్నీ తనకు ఒదిగి ఉండాలని అనుకోవడం, దానికోసం దౌర్జన్యంగా ప్రవర్తించడం, ప్రపంచం మీద తన పెత్తనాన్ని కొనసాగించడం సామ్రాజ్యవాద లక్షణం. అయితే ఈ కథ ఇంత మాత్రమే చెప్పి ఉంటే, ఇది మామూలు కథే అయి ఉండేది. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థలోనే కాదు, భూస్వామ్య వ్యవస్థలోనే ఉంది అని చెప్పడం వల్ల ఈ కథ విశిష్ట కథ, విభిన్నమైన కథ అయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ కన్నా భూస్వామ్య వ్యవస్థ ముందటిది గనక, దానికి ప్రతినిధిగా శ్రీకృష్ణుని తీసుకొని ఖాండవ వన దహన కథను విస్తరణవాద కథగా వ్యాఖ్యానించారు. ఒక జాతిని మరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఎంత పురాతనమైనదో ధ్వని పూర్వకంగా చెప్పారు రచయిత. ఈ పీడక ధర్మం ఆధునిక కాలంలో రాలేదని, పూర్వం నుంచే వచ్చిందని చెప్పడం ద్వారా ఈ కథకు ఐతిహాసిక గుణం, స్వభావం చేకూరాయి. వ్యవస్థలు మారుతున్న కొలదీ సామ్రాజ్యవాదం రూపం మార్చుకుంటూ, ప్రపంచీకరణ దశకు చేరుకుందని ఈ కథ సూచిస్తుంది.

ఇప్పటిదాకా లభిస్తున్న చరిత్రంతా వర్గపోరాటాల చరిత్ర అనే కమ్యూనిస్టు మ్యానిఫెస్టో చెప్పినదానిని ఈ కథ సమర్థిస్తున్నది.

***"గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీళులతో"/ నరజాతి చరిత్ర సమస్తం/ పరపీడన పరాయణత్వం/ నరజాతి సమస్తం/ పరస్పర హరణోద్యోగం"***

'దేశచరిత్రలు' అనే శ్రీశ్రీ కవిత్వంలోని వాక్యాలు ఎంత నిజాలో ఈ కథ తెలియజేస్తున్నది. పీడన రూపం ఎలా తనను తాను మార్చుకుంటూ కొనసాగుతున్నదో కూడా ఈ కథ రుజువు చేసింది. భూస్వామ్య వ్యవస్థలో పీడకులు స్వయంగా

## కవిత

# వద్దు నువ్వలా

- పద్మావతి రాంభక్త
9966307777



వద్దు నువ్వలా అనకు
కమ్మని స్వప్నంలో
కత్తులు దింపకు
వెన్నెలను జల్లించి
చీకటిరాళ్ళను ఏరకు
వెలుగుచరణాలలో
అపశృతులను మీటకు
పూల లోతుల్లో
పురుగులను ఊహించకు
మంత్రముగ్ధ మాటలలో
మురికిని వెతకకు

అనుబంధాల గదులలో
అనాకారితనం చూడకు
శ్వేతపావురాయి రెక్కలకు
రక్తాన్ని అంటించకు
హరివిల్లు రంగులలో
నలుపుకై నిరీక్షించకు
నీలిఆకాశం నీడలలో
రాత్రులను అన్వేషించకు

పుడమి గర్భంలో
భూకంపాలను కెలకకు
సముద్రం అడుగున
సునామీకి వలెయ్యకు
వద్దు నువ్వలా
అందమైన ముఖాలకు
బొగ్గుమసి పూయకు
మనసుల వెనకాల
మచ్చలను వెతకకు

ఏ గుండెకొలనులో
ఎన్ని కన్నీటిచేపలు
రహస్యంగా ఈదుతున్నాయో
పసిగట్టగలవా నువ్వసలు ♦

సాయుధులై యుద్ధాలు చేసేవారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పీడకులు కాలు కదపకుండానే యుద్ధాలు జరిపిస్తున్నారు. కృష్ణుడు ఖాండవ వన దహనం పూర్తి కాగానే అధ్యక్షునికి భవిష్యత్తులో రాబోయే మార్పును చెప్పాడు. ఖాండవ వన దహనంలో ఏమి జరిగిందో ఇవాళ ఉత్తరాంధ్రలో అదే జరుగుతున్నది. బహుళజాతి కంపెనీలు పెట్టుబడులు రూపంలో, పరిశ్రమలు రూపంలో మూలవాసుల నివాసప్రాంతాలలోకి ప్రవేశించి, అక్కడి జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నారు. ప్రశ్నించిన వాళ్ళను, ప్రతిఘటించిన వాళ్ళను అణచి వేస్తున్నారు పాలకులు. ఈ హింస, ఈ పీడన అనాదిగా ఉందని సామ్రాజ్యవాదం మూలాలను రచయిత బహిర్గతం చేశారు. ప్రపంచీకరణను అమలు చేయడంలో భారతదేశం అగ్రస్థానంలో నిలిచి, ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయడంలో బషీర్‌బాగ్ సంఘటనల వంటి వాటికి కూడా వెరవకపోవడంలో ముందుండడం, అమెరికాకు అంటకాగడం అనే సందర్భాన్ని శ్రీకృష్ణ, అమెరికా అధ్యక్షుల సమావేశం ద్వారా కవితాత్మకంగా చిత్రించారు.

ప్రపంచం మీద పెత్తనం చేసేవాళ్ళు ఇతర దేశాలలో పౌరహక్కులను గురించి, కార్మిక జీవితాల గురించి ప్రసంగాలు చెయ్యడం అసంబద్ధమైన అంశం. ఆ ప్రసంగాలు కూడా అగ్రరాజ్యం నియమించుకున్న అధికారులు రాసిపెట్టినవి కావడం విశేషం. ఈ అసంబద్ధాంశాన్ని చెప్పడానికి రచయిత అధ్యక్షుడు టాయిలెట్‌లోకి వెళ్ళి బయటకి తిరిగిరావడం లోపల జరిగిన దానిని చిత్రించి ప్రదర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా తాను చేసే హింసా ప్రవృత్తి అంతా నానా బీభత్సం చేసి ఒక చిన్న మాత్రగా మారి కడుపులోకి వెళ్ళిన తర్వాత అధ్యక్షునికి సుఖ విరేచనమై శరీరం తేలికపడింది అని చెప్పడం గొప్ప అధిక్షేపం. ఈ ముగింపు పాఠకునిలో సామ్రాజ్యవాద హింస మీద ఏవగింపు కలిగిస్తుంది. రూపంలో ప్రజాస్వామ్యం గానూ, సారంలో నిరంకుశత్వంగానూ సాగుతున్న రాజనీతి మీద పాఠకులను ఆలోచింపజేస్తుంది. ఒక సామాజిక సమస్యను పైపైన కాకుండా దాని మూలాలలోకి పోయి ఆలోచించిన కథ 'కృష్ణస్వప్నం'. చరిత్రలో కొనసాగుతున్న ఒక అవిచ్ఛిన్నతను రచయిత దర్శించి చిత్రించారు. సమాజంలో వచ్చే మార్పులను చాలా కథలు చెప్పాయి. మార్పులకు కారణాలనూ చాలా కథలు చెప్పాయి. మార్పులను చరిత్ర నేపథ్యంలో చిత్రించే కథలు తక్కువగానే వచ్చాయి. 'కృష్ణస్వప్నం' వాటిలో గొప్ప కథ. కృష్ణార్జునులను పాత్రలుగా ప్రవేశపెట్టడం వల్ల ఈ కథ పౌరాణికమూ కాదు, ఫాంటసీ కాదు, మరేదో కాదు. ఇది అచ్చమైన వాస్తవిక వాద కథ.

"ప్రపంచీకరణకున్న సామ్రాజ్యవాద స్వభావాన్ని అద్భుతంగా చిత్రించే ఉహాకల్పన 'కృష్ణస్వప్నం'. ఖాండవ వనాన్ని బూడిద చేసి, నాగుల వంటి 'తక్కువ రకం' మనుషుల్ని నిర్మూలించి సామ్రాజ్యాన్ని స్థాపించిన కృష్ణ భగవానుడు అమెరికా ప్రెసిడెంటుకు దర్శనమిచ్చి ఈ కాలంలో తన స్వప్నాన్ని సాకారం చేసినందుకు అభినందించడం క్రూరమైన గొప్ప చమత్కారం. విజేతలు ఎప్పుడూ అలాగే పరస్పర గౌరవంతో, ఆత్మీయంగా ఉంటారు" (వల్లంపాటి వెంకటసుబ్బయ్య: ముందుమాట – దిశ) ♦

కవిత

# ద్రోహలోకం

- శిఖా-ఆకాష్
9381522247

ఒకానొక విజ్ఞానాంధకార యుగాన
నాలుగు పాదాలూ తెగిన దారులెంట
నాలుగు భుజాలూ కలవని కాలాన
వడి వడిగా... హడావుడిగా
పెదవుల పడగలపైన
ద్రోహలోకం మోహరాగం!

♦

కట్టురా... కట్టు
మేడమీద మేడ కట్టు.
గదులనిండా నోట్లకట్టలు పోగుపెట్టు.
అబద్ధాల మీద నిజాలకు పాడె కట్టు.
మానవతకు మనుగడలేని
శాస్త్రీయ సమాధి కట్టు!
ప్రపంచమొక కార్పొరేట్ వల
ఏ కలగన్నా మృత్యువే పరామర్
ఒరోరి చావు దేవుడా!
భయాన్నే మహారోగం చేసి
నోట్లకట్టలకు ప్రాణాల్ని బలితీసి
ఓరోరి కార్పొరేట్ కపట దేవుడ
రోగాల మాయావి మాంత్రికుడ




పొద్దున్నే లేచి లోకమంతా
రోగమయం కావాలని
మొక్కరా ..బకాసురా!
వైద్య కుయుక్త చక్రవర్తీ!!
శ్మశానాలు మొలుస్తున్నాయి!?
రాక్షస జలగలు విజృంభిస్తున్నాయ్.
నరబాముల పుట్టలు లేస్తున్నాయ్.
దేహమొక వ్యాపార శాల!
నగరాల నిండా
కార్పొరేట్ల మరణశాల!?
నాగరిక వేషము
పసందైన మోసము
ధనదాహపు అవశేషము
రోగమొక భయానక అవకాశము.
హంసలు తోడేళ్లయిన వైనము.
మృత్యు దేవతలు నడయాడు
కార్పొరేట్ నరకము!?

♦

ఏ తూకానికి అందనిదీ లోకము
రూపాయి తక్కెడకు తప్ప.!?
విరిగిన మనుషులు
కూలుతున్న వంతెనలు
కాలుతున్న బంధాలు
తెగిపోయిన పాదాలు
అపసవ్య పాఠాలు
అభద్ర తీరాలు
గుర్తుపట్టలేని దారులు
కట్టుగొయ్య బతుకులు
దిగులు నదుల
ద్వీపమైపోయిందీ జీవితం
శాస్త్రం బహుకరించిన మోసకారుడా
నాగరికత నేర్పిన కాలనాగా
వేగం కనిపెంచిన విధ్వంసకుడా
ఓరోరి చావు దేవుడా
హత్యల కార్పొరేట్ దేవుడా!
పేదవాని ఆకలితీరదు
ధనవంతుని అధికారం చావదు
నీవున్న దేశంలో
ధర్మానికి కులముంది.
న్యాయానికీ మతముంది.
కార్పొరేట్ భాష తెలిసినోడికే
ఈ నేలమీద శ్వాసించే,
ఈ ప్రపంచాన్ని శాసించే
బలముంది!?
ఇంకెన్నాళ్లీ మరణ యాతన
ఎందాకీ మౌనారోదన?
ఈ మేడలు కూలాలి
ఈ దోపిడీ ఆగాలి
ప్రశ్నించే గొంతులు ఉప్పెనవ్వాలి.
కార్పొరేట్ కలలకు
ఈ దేవుడి హత్యలకు
ఉరిబిగించాలి.

♦

# కన్నడ మూలం - తెలుగులో అమూల్యం




- వై.హెచ్.కె. మోహన్‌రావు
9440154114

వలస చాలామంది వెళతారు. శాఖమూరు రామగోపాల్ వలస, మొత్తం తెలుగు లోకానికి ప్రయోజనం చేకూర్చింది. పదకొండు ఏళ్ళపాటు ఆయన కర్నాటకలో వలస జీవిగా వుండటం ముఖ్యంగా తెలుగు కథా రంగానికి మహోపకారమే ఒనగూడింది. తెలుగు వానిగా జన్మ తీసుకున్న రామగోపాల్ కన్నడం నేర్వడమే గాకుండా కన్నడ భాషలో ప్రసిద్ధులైన కథా రచయితల విశిష్ట కథలను మనదైన కమ్మని తెలుగులోకి సరళానువాదం చేశారు. యధాతథ తర్జుమాతో కథలన్నీ అచ్చ తెలుగులో శోభిల్లాయి. ఈ కథలలో మనకు తెలియని మన తెలుగు పదాల నెన్నింటినో పాయసంలో ఎండుద్రాక్ష వలె చదువరుల జిహ్వకు అందించిన రామగోపాల్ కథల తీరు కడు ప్రశంసనీయం. మూలం తప్పకుండా తెలుగులో ఆయన బహురమ్యంగా కథా గమనాన్ని నడిపించారు. విలక్షణమైన భూమికలతో వచ్చిన కథలను రామగోపాల్ ఒడిసి పట్టారు. రాయలసీమ సరిహద్దుగా గల కన్నడ గడ్డపై నివాసమున్నందున సీమ భాషా పదజాలం ఆయన కథా రచనతో పెనవేసుకుపోయింది. తెలుగు పాఠకులకు కన్నడ కథా సరళిని అందించిన రామగోపాల్ కన్నడ తెలుగు సాహిత్యాలను చిక్కని సౌహార్ధ బంధాన్ని అల్లారు. అనువాదంతో కన్నడ తెలుగు పాఠకులకు రుచి చూపడమే గాకుండా తెలుగు వారి సుహృద్భావ పరిమళాలను కన్నడ గడ్డపై పరివ్యాప్తం చేశారు.

తన అశక్తతను కూడా సూటిగా వల్లెవేసే వ్యక్తి రామగోపాల్. దాపరికం లేకుండా, బేషజాలకు పోకుండా మాట్లాడే రచయిత తను. కొంతకాలం మద్రాసులో వున్నా తమిళం అక్షరం నేర్వలేక పోయాననంటూ అంగీకరిస్తారు. తెలుగు నుండి కన్నడంలోకి అనువదించే శక్తి తనకు లేదని స్పష్టం చేస్తారు. ఎం.ఎ. ప్రజా పరిపాలన పూర్తి చేసిన రామగోపాల్ స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని ఓ గ్రామం. పల్లె వాతావరణమన్నా, వ్యవసాయమన్నా ఆయనకు ఎనలేని మక్కువ. ఆ కారణమే ఆయనను ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు కొలువుల వైపు మొగ్గకుండా రైతాంగ సమూహంలోకే చేర్చింది. ఐతే ఆయనకు ప్రీతికరమైన మరో అంశం సాహిత్యం. ఈ నేపథ్యమే ఆయనను అనువాద కథకునిగా మలిచింది. 2010 నుండి 2018 వరకూ ఆయన కలం నుండి 13 కన్నడ అనువాద రచనలు వచ్చి అలరించగా, 2019లో "వైరాగ్యంలోని మహిమ" అనే తలకట్టుతో

కన్నడంలో విశేష మన్నన పొందిన గొప్ప కథకుల 26 కథలను తెలుగు కథా ప్రేమికులకు అందించారు. కథలన్నీ వైవిధ్య భరితమై వివిధ సామాజికాంశాలతో సాగాయి. సాధారణ జన జీవనాన్నీ, ఆలోచనలనూ, ఆచరణలనూ, రుగ్మతలనూ, నమ్మకాలనూ, మోసాలనూ, మోసపోతున్న అల్పజీవులనూ, వెరశి లోకంలోని బలహీన ఔచిత్యాలను సంతరించుకున్నాయి. కన్నడ కవుల సంస్కరణ ఐనా, మూఢాచారాలపై ఎత్తిన ధ్వజమైనా తీవ్రంగా వుంటాయని ఈ కథలు రుజువు చేస్తాయి. బహుశా ఈ ఒరవడి 12వ శతాబ్దినాటి వీరశైవ సంస్కర్త "బసవడి" అనువంశకం గావచ్చు. అట్లాగే మహిళా సంస్కర్త అక్క మహాదేవి ఎత్తిన జెండా రెపరెపల పరంపర కావచ్చు.

భాషా పరంగా ఈ కథలను విశ్లేషిస్తే అనువాదకులు కొన్ని కొత్త పదాలను సృజించారు. కొన్ని సీమ వాడుక పదాలు అలవోకగా వచ్చి చేరిపోయాయి. ఐనప్పటికీ, కోస్తా, కోన, ఉత్తరాంధ్ర, పల్నాటి వాసులకు ఈ పదాలు నూతనంగా అనిపించినప్పటికీ, అర్థం చేసుకోవడానికి ఈ పదాలు ఏమాత్రం అడ్డంకి కావు. పైగా మన తెలుగులోనే వాడకంలో వున్న సరికొత్త పదాలుగా తెలుసుకుంటున్న ఉత్సుకతకు లోనౌతాము. భాషా విస్తృతికి ఈ పదాలు వినియోగపడతాయని రచయితలూ, పాఠకులూ గట్టిగా నమ్ముతారు. ముద్దించింది, స్థలాంతరం, జరీదించి, యజమానికె వంటి సృజనాత్మక విశేషణాలు, కిరస్తాని (క్రైస్తవ), కొంకిరి(వంకర), సంబళం(జీతం), ఉద్దారం(వృద్ధి) వంటి పరప్రాంత పదాలు అనేకం ఈ అనువాద ప్రక్రియతో మనముందు నిలుపుతారు రామగోపాల్.

కథా విశేషాలను సమీక్షించుకుంటే సంపుటి మకుటం ''వైరాగ్యంలో మహిమ'' కథలో నకిలీ బాబాలూ, దొంగస్వాముల బండారాలూ సరికొత్తగా ఆవిష్కృతమయ్యాయి. అక్షరజ్ఞానం లేనివాడైనా కాషాయం ధరిస్తే నాడు చీత్కరించిన జనమే కైమోడ్పులందిస్తారని తెలియజెప్పే సారంశం గలిగిన కథ. మరదే...! కాషాయానికి భారతీయ సంస్కృతిలో వున్న ప్రగాఢమైన పూజనీయ భావం. ఈ విశ్వాసాలను పరదాలుగా చేసుకుని అమాయకులను సమ్మోహితులను చేసే వంకర బాబాలు ఎట్లా సంపన్నులౌతారో విశదీకరించింది. సర్వసంగ పరిత్యాగులుగా వేషధారణతో, జుట్టు పెంచి గుట్టుగా ప్రజలను దోచుకునే స్వాముల కుతంత్రాలను వినూత్నరీతిలో చిత్రించారు. నమ్మకంగా నమ్మి వచ్చిన వారి ధన, మానాలను హరించి ఏ విధంగా వారికి గుండుకొడతారో వెల్లడించిన ఈ కథ ఆసక్తిదాయకంగా నడిచింది. "శుక్రాచార్యుడు" కథ మొత్తంగా గొప్ప సంస్కరణ దిశగా నడుస్తుంది. ఒక కులీన కుటుంబీకుని పరివర్తన సమాజంలో పేట్రేగిపోతున్న కులవైషమ్యాలనూ, దురాచారాలనూ ఏ విధంగా ధ్వంసం చేస్తుందో విడమర్చే కథ. పూర్వం తను ప్రేమించి, తనకు దూరమై వైధవ్యం ప్రాప్తించిన వనితను భార్యగా స్వీకరించడమే గాక, కుమార్తె వర్ణ, కులాంతర వివాహాన్ని ప్రోత్సహించి, శ్రీమతిని భారతీయ పురాతన శాస్త్ర విషయాలలో అనేక విధాలుగా అనునయించిన తీరు బహుదా ఆహ్వానీయం. ఈ కథలో అనేక పురాతన సంస్కరణ విషయాలను రచయిత మనముందుకు తీసుకొచ్చారు. "బ్రాహ్మణులే నిలబెడతారు – బ్రాహ్మణులే పడగొడతారు" అనే నానుడికి ఈ కథ నిర్వివాద ఉదాహరణ. "తమ కులమే ఉన్నతమూ, ఎవ్వరూ మాకు సాటిరారు, మన కులస్థులు ఎవరికీ రక్తము ఇవ్వొద్దు, ఇతరుల రక్తం తీసుకోవద్దంటూ" విర్రవీగే కుల దురహంకారులకు ఈ కథ పెద్ద చెంపపెట్టు.

"పౌర్ణమిలో నల్లటి నీడ" పిన్న వయసులో మధుమేహ రోగగ్రస్తురాలైన ఆరో తరగతి చదువుతున్న పదకొండేళ్ళ "పూనమ్" సంఘర్షణాత్మక గాథ. ఐదుగురు కుటుంబీకులలో తనొక్కతే ఈ రుగ్మత బారిన పడి తీపికి దూరమై వేదనాభరితమైన జీవితాన్ని చక్కగా మలిచారు. మధుమేహం ఇప్పుడు ప్రపంచాన్ని కుదిపేస్తున్న మహమ్మారిగా మనకందరికీ తెలిసిన విషయమే. పూర్వం ఎప్పుడో ముదిమి వయసు శరీరాలను ఆశ్రయించే ఈ విస్ఫోటనం ఇప్పుడు గర్భస్థ శిశువులను కూడా ఛిద్రం చేస్తుంది. జీవితాంతం అనుభవించే ఈ రోదనకు కారకమైన భూతాన్ని వైద్యరంగం ఎప్పుడు తరిమికొడుతుందో! ఎప్పుడు అంతం పలుకుతుందో! బాంధవ్యాలు కలుపుకునే సందర్భాలలో కఠోర జబ్బు ఎదుటి వారికి తెలియకుండా అటూ ఇటూ తల్లిదండ్రులు ఉపాహారాలతో స్వీటు కూడా స్వీకరించి అందుకోసం అధిక ఔషధాలు వాడుతుంటారు. "నూరు అబద్దాలైనా ఒక పెళ్ళి జరపమని" వినిపించే నానుడి. ఐతే వివాహం ముగిసిన పిదప

విషయం ఎరిగి మధుమేహంతో వున్న పెళ్ళి కుమార్తెను విడాకులతో వదిలించుకున్న సంఘటన నాకు తెలుసు. మధుమేహ ప్రభావం కాపురాలు కూల్చే స్థితికి చేరింది. ఈ కథలోని ప్రధాన పాత్ర "పూనమ్" అనుభవాలను రచయిత తను అనుభవించి వివరించారు.

"జీవనం" కథ కుమారుని మతాంతర వివాహంతో తీవ్రమైన ఆటుపోట్లకు గురైన ఆ కుటుంబంలోనికి ప్రవేశించిన నూతన జీవిత పరిస్థితులు చక్కబడిన సాంప్రదాయ కుటుంబ సగటు తల్లి చుట్టూ పరిభ్రమిస్తుంది. మతమూ, కులమూ మానవ సమూహాన్ని వర్గాలు వర్గాలుగా విభజించి తిరిగి కలుసుకోలేనంతగా దూరాలను పెంచాయి.ఆధునిక సమాజంలో కూడా మతము వైషమ్యపూరిత విషాన్నే చిమ్ముతుంది. ఈ క్రమంలో పుత్రుడు ఇతర మతస్తురాలిని కోడలిగా తెచ్చిన వైనంతో ఒక కులీన కుటుంబ తల్లి పడే వేదనను తెలియజేస్తూనే, తిరిగి తల్లిని కొడుకూ కోడలితో మమేకం చేసిన విధానం హృద్యంగా వుంది. వరుస క్రమంలో తొలుత కుమారునిలోనూ, అనంతరం తల్లిలోనూ సంస్కరణను చూశారు కథా రచయిత. అత్యున్నత ఆశాపథంతో సాగిన ఈ కథాంశం స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని కథలూ, నవలలూ, చలన చిత్రాలూ రావలసిన అవసరం మానవ సమాజ ఐక్యతకు చాలా చాలా అవసరం.

"కాంచన రథం" బలవంతుల పదఘట్టనలో నలిగిపోయే బలహీనుల ధన మానాలు గోచరిస్తాయి. అనాదిగా ఈ వికృత క్రీడ విస్తరిస్తూనే వుంది. ఈ దుష్ట సంస్కృతి వేయి తలల విషనాగులా పడగ విప్పే వుంటుంది. కాకపోతే కాలమాన ప్రాంతాలను అనుసరించి దాని రూపం, తీరూ మార్చుకుంటుంది. దుర్మార్గానికి పాల్పడిన బలవంతుడూ ఏదో ఒక అవసాన దశలో పరివర్తన చెందినంత మాత్రాన ఒనగూడే ప్రయోజనం ఏమీ వుండదు. జరిగిన నష్టం సరిచేయని విధంగా పరిణామం చెంది వుంటుంది. ఐతే ఈ కథ సార్వకాల తరాల నడవడికి ఉత్తమ సంకేతం. మనిషి మానవ విలువలు దాటకూడదనే సందేశాన్నిచ్చే కథ. బుద్ధి జీవులు కోరుకునే మానవీయ సమాజాన్ని రచయిత ఈ కథలో అందించారు. దుర్మార్గాలకు ఒడిగట్టే వికృత మనస్కులు ఈ సమాజానికి గర్హనీయం. విస్మరించలేని మార్గదర్శనం నిర్దేశిస్తున్న భూమికతో వచ్చిన కథకు జేజేలు. ముందుతరాలైనా మానవ విలువలను కాపాడతాయని ఆశిద్దాం. ప్రతి మనిషీ ఎదుటి వారిని ఒకే విలువతో దర్శించినపుడు మాత్రమే మానవ విలువల సోదర సమాజం ఉద్భవిస్తుంది. అందరూ ఆ దిశగా అడుగులు వేయాలని కోరుకుందాం.

ఇట్లా ఈ సంపుటిలోని కథలన్నింటినీ సమీక్షించుకుంటూ వెళితే చాలానే చెప్పవలసి వుంటుంది. సంపుటిలోని మొత్తం పద్నాలుగు కథలు కూడా అద్భుతంగా నడిచాయి. సంపుటిలోని వరుసగా మూడు కథలు కన్నడంలో మొదటి జ్ఞానపీఠ అవార్డు, ఆ రాష్ట్ర ఆస్థాన కవి కు. వెంపు చెందిన మూలమైనవి. నాల్గవ కథ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పూర్ణ చంద్రతేజస్వి మూలం. ఐదవ కథను గిరీష్ కాసరవల్లి అనే కన్నడ ప్రఖ్యాత దర్శకులు చలన చిత్రంగా రూపొందించి ఫ్రాన్స్ అంతర్జాతీయ అవార్డు పొందారు. ఈ కథ మూలం కూడా తేజస్విదే. కు.వెంపు తనయుడే తేజస్వి. ఏడవ కథ కన్నడ కథా ప్రపంచంలో అత్యుత్తమని భద్రపరిచిన నూరు కథల జాబితాలోకి చేరిన బంగలోడి దేవరాయనిది. ఇట్లాగే ఈ కథలన్నీ కూడా అత్యుత్తమ కథా రచయితలు చిత్రీకరించిన మెరుపు తీగెలు.

కథా ప్రియులతో పాటుగా కథా శ్రామికులు కూడా తప్పకుండా చదవాల్సిన కథా సంపుటి రామ్‌గోపాల్ "వైరాగ్యంలోని మహిమ" పొత్తం. ఈ సంపుటిని ఈయన చిరకాల మిత్రుడైన తెలంగాణవాది ప్రొ॥ కోదండరామ్ తెనాలి వచ్చి ఆవిష్కరించడం విశేషం. సంపుటికి సుదీర్ఘమైన ముందుమాటలూ, వెనుక మాటలూ లేకపోవడాన్ని నేను మనసా ఆహ్వానిస్తున్నాను. కన్నడ కథాకేళిని తెలుగువారికి అందించిన అనువాదకులు రామగోపాల్ గారికి తెలుగు పాఠకలోకం తరపున హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. 297 పుటలు గల కథా సంపుటి వెల రూ.300. పుస్తకాల కొనుగోలు పట్ల నెలకొన్న నేటి అననుకూల పరిస్థితులను బేరీజు వేసుకుంటే ధర కాస్త ఎక్కువ అనిపించినప్పటికీ, కథాంశాల వాసిని మూల్యాంకనం చేసుకున్నప్పుడు ఇదేమీ పెద్ద భారమనిపించదు. సంపుటి చదవడం ముగిసిన పిదప ప్రతి ఒక్కరూ నా అభిప్రాయానికి మద్దతుగా నిలుస్తారని గట్టిగా నమ్ముతాను. పుస్తకం కోసం 9052563666 సంప్రదించండి. ♦

కవిత

# కాలాన్ని సవరించిన మనిషి

- ర్యాలి ప్రసాద్
9494553425



కంటికి మరో కన్ను తగిలించుకుని
చెడిన కాలాన్ని బాగుచేస్తున్న అతన్ని చూస్తుంటే
మూడో కన్ను తెరవని ముక్కంటిలా కనిపిస్తాడు.

కాలానికి ప్రతిగా కాలాన్ని
సృష్టించడం తెలిసిన బ్రహ్మ అతను.

కీ యిచ్చి ముడికాలాన్ని
దగ్గరకు బిగించినపుడు
సమాజాన్ని ఏకంచేసే సూత్రమేదో
మనుషుల్ని దగ్గర చేస్తూ
మహాబంధం అలుముకున్నట్లుంటుంది.

వదులవుతున్న మెయిన్ స్ప్రింగ్ నుండి
సెకన్లూ నిమిషాలూ గంటలూ
పన్నెండు అంకెల మధ్య దాచివుంచిన
ఇరవై నాలుగ్గంటలుగా రోజును విడదీసి
ప్రపంచానికి పంచుతుంటాడు.

ఒక్కోసారి కాలాన్ని
వేగంగానూ నెమ్మదిగానూ
క్రమంగా నడిపిస్తాడు.

ఒకే డైలులో
రెండు పొద్దుల్ని చూసినపుడు
కాపురాన్ని నడిపే ఆలుమగల్లా వుంటాయి.

తలవెంట్రుక కన్నా
సన్నని హెయిర్ స్ప్రింగును గుండ్రంగా చుట్టి
బేలన్స్ స్టాపును లయబద్ధంగా
అటూ యిటూ అచ్చం
గుండెలాగా నడిపిస్తాడు.

కాలాన్ని చూపే మూడు ముళ్ళూ
బాల్య యవ్వన వార్ధక్యాల ప్రతిబింబాలవుతాయి.

సుముహూర్తం కోసమో
నమాజ్ వేళల పట్టువిడుపుల కోసమో
ప్రత్యేక సమయాల గంటమోతల కోసమో
మతరహితంగా చూసేది ఇతని కాలాన్నే.


లోకంలోని ప్రతి కదలికనూ
నమోదు చేసే భూమ్మీది చిత్రగుప్తుడతను.

శివమెత్తి తిరుగుతున్న కాలం
ఉదయానికల్లా శవమవుతుంది.
కీ తో మళ్ళీ ప్రాణం పోసుకుంటుంది.

ఆధునికత మనిషి జీవితాన్ని
సులువుగా కాటేయడం మొదలుపెట్టాక
బేటరీరూపంలో ప్రవేశించింది.

వాచీమెకానిక్కు
ఇపుడు కాలం చెల్లిన నాణెం.
శిధిలాలుగా మిగిలిన గంటల గడియారం.

రోడ్డు పక్క అద్దాల పెట్టెలు
గోడకు తగిలించిన పాతకాలం ఫోటోల్లా
గతించిపోయిన కాలానికి
గుర్తులుగా మిగిలిపోతాయి. ♦




అఫ్సర్



# ఉద్వేగాలకు ఆనవాళ్ళు అఫ్సర్ కవిత్వం

- తగుళ్ళ గోపాల్
9505056316

1

*"చాలా కాలం తరవాత వెళ్తున్నానా వూరికి,*
*ఇంటికి,*
*నా వుద్వేగాల తొలి ఆనవాళ్ళకి*
*•*
*యేమేం తీసుకెళ్తాను ఇంటికి*
*నా వూరికి*
*ఆ తొలిరక్తపు సెలయేటికి?"* (ఇంటివైపు-467)

మళ్ళీ నలభైయేండ్ల తరువాత ఇంటివైపు వెళ్ళడం ఎవరికైనా ఎలా ఉంటుంది? ఖండాంతరాలు దాటిన కవి మనసులో ఎన్నెన్ని దృశ్యాలు కదులుతుంటయి? మనసు పసిపిల్లాడిలాగ పరిగెత్తుకుంటూ వెళ్తుంటే ఎన్నెన్ని విషయాలు జ్ఞాపకానికొస్తాయి? ఆదరించిన చేతులు, అవమానించిన మనుషులు, దాసుకున్న ఉత్తరాలు,రాసి కొట్టేసిన కవితలు, భుజాలపై చేతులేసి తిరిగిన స్నేహాలు. అఫ్సర్ నలభైయేండ్ల కవిత్వం ఒకే సారి చదువుతున్నప్పుడు కూడా ఒక ఉద్వేగాల ఆనవాళ్ళకు ప్రయాణిస్తున్నట్టే ఉంటది. అఫ్సర్ కవిత్వమంతా ఒకచోట చేర్చిన "అప్పటినుంచి ఇప్పటిదాక" కవిత్వం చదివినపుడు పాయలుగా మొదలై నదీరూపాన్ని సంతరించుకున్న దృశ్యం కండ్లముందు మెదులుతుంది.

"కవిత్వానికి కాలమే వస్తువు" అంటాడు అఫ్సర్ ఒక వ్యాసంలో. ఈ మాటలు అఫ్సర్ కవిత్వానికి సరిగ్గా సరిపోతాయి. అఫ్సర్ రక్తస్పర్శ (1979-1985)తో మొదలై ఇంటివైపు (2010-2018) దాక నడిచాడు. మధ్యలో ఇవాళ (1986-1991), వలస (1992-1999), ఊరిచివర (2000-2009) కవిత్వ సంపుటాలు.

ఒక్కొక్క సంపుటికి మధ్యన దాదాపు ఏడెనిమిదేళ్ళ కాలం వుంది. అటుఇటుగా ఒక దశాబ్దం. ఆ కాలాన్నంతా కవితావస్తువుగ చేసుకొని రాసినట్టుగ ఉంటుంది అఫ్సర్ కవిత్వం. అఫ్సర్‌ని చదవడం అంటే మళ్ళీ ఆ కాలంలో జీవించడం. ఒక దశాబ్దంలో జరిగిన పరిణామాలను అవగతం చేసుకోవడం.

ఒక్కొక్క సంపుటికి మధ్య తానెంత ఘర్షణ పడ్డాడో, వస్తువుపరంగా, అభివ్యక్తిలోనూ ఎలాంటి మార్పులు వచ్చాయో "అప్పటినుంచి ఇప్పటిదాక" చదివితే స్పష్టంగా అర్థమౌతుంది.

అఫ్సర్ మొదటికవితాసంపుటి రక్తస్పర్శ (మిత్రులతో కూడి ప్రచురించింది)లో శబ్దాడంబరం కన్నా అభివ్యక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు. మొత్తం కవిత్వంలో అఫ్సర్ తొందరగా పట్టుబడడు. ఒకసారి పట్టుబడితే అంతతొందరగా, అంత సులువుగా పాఠకుడి మనసులోంచి బయటకు పోడు. దానికి కారణం పాత విలువలను, సాంప్రదాయ కవిత్వరూపాన్ని బ్రేక్ చేసిన పోస్ట్ మోడర్నిజంలో తన కవిత్వం ఉండడమే. రక్తస్పర్శ, ఇవాళ సంపుటాలు చాలా సంక్లిష్టంగా ఉన్నా తరువాత ఇంత సంక్లిష్టత తన కవిత్వం ఉండదు. దానికి తాను ఎంచుకున్న కవితావస్తువులు (ముస్లిం, దళిత జీవితాలు) కూడా ఒక కారణం.

అఫ్సర్ తన కవిత్వం గురించి తానే చెప్పుకున్నట్టు

*"పదాలు కనిపించడం మానేసి, అనుభవం వినిపించడం"* ఉంటుంది తన కవిత్వంలో.

హిందీకవి దయాళ్ సక్సేనా చనిపోయినప్పుడు రాసిన కవిత "అంతిమస్పర్శ" అందుకు ఉదాహరణ.

*"అశ్రుపూరిత మేఘంగా విహరిస్తావో*
*కాలంకురులను చలిగాలిపై మీటుకుంటూ వెళ్తావో/ నీ యిష్టం" (రక్తస్పర్శ-పే.5)*

కాలంకురులు లాంటి ఎన్నో కొత్త పదచిత్రాలు రక్తస్పర్శలో కనబడుతాయి. చీకటిశవం, నీటిచర్మం, ఆవేశంచెట్టు లాంటి పదచిత్రాలు పాఠకుడిలో కొత్త అనుభూతిని కలిగిస్తాయి.

*"మూర్తీభవించిన పసితనంలా*
*అమాయకంగా వినయంగా*
*చేతులు కట్టుకుని*
*నదీతీరాన నిల్చుంది చెట్టు" (రక్తస్పర్శ -35)*

వినయంగ ఉండడం, చేతులు కట్టుకోవడం లాంటి మానవ లక్షణాలను చెట్టుకు ఆపాదించడం "పర్సోనిఫికేషన్" ఇలాంటి కవిత్వనిర్మాణం ద్వారా ఒక అద్భుతమైన చిత్రాన్ని గీయగల్గిండు కవి.

ఏ కవిప్రభావం లేకుండా రక్తస్పర్శ నుండే గొంతెత్తడం, తనదైన శైలిని నిర్మించుకోవడం అఫ్సర్ ప్రత్యేకత.

*"ఎండిపోయిన ఏ చెట్టుకో*
*వీపాన్చుకొని కూలబడ్తుంది బతుకు విసుగ్గా"*

ఇలాంటి ఎన్నో దృశ్యాల సమ్మేళనం రక్తస్పర్శ. చెట్టు, నది, రాత్రి, ఆకాశం మొదలైన వాటితో సంభాషణలాగ తోస్తుంది రక్తస్పర్శలోని కవిత్వం. ఇంటివైపుకు వచ్చేవరకు అది ఆత్మసంభాషణగా మారుతుంది.

రక్తస్పర్శలోని కవితలు వ్యక్తిగతంగా అనిపించినా వాటిలో సామాజికత కనబడుతుంది.

*"యాసిడ్ వెకిలినవ్వులు పలకరించినా*
*తుపాకుల వికటాట్టహాసం మోహరించినా*
*కత్తుల క్రూరవ్యూహంలో చిక్కుకుపోయినా*
*కనురెప్పనై పహారా కాయాలి" (రక్తస్పర్శ-పే.12)*

స్త్రీలమీద జరుగుతున్న దాడులను, బూటకపు ఎన్ కౌంటర్లను స్పృశించాడు. అయితే సామాజిక విషయాలకన్న అంతర్ సంఘర్షణే రక్తస్పర్శలో అధికం. తాను అనుభవిస్తున్న సంఘర్షణ ఇది అని స్పష్టంగా చెప్పకుండా ఒక చీకటి వాతావరణంలోకి కవి తీసుకెలుతాడు. ఈ సంపుటిలో ఎక్కువగా కనబడే నిశ్శబ్దం, చీకటి, స్వప్నం లాంటి పదాలు కవి మానసికస్థితిని తెలియజేస్తాయి .

♦

రక్తస్పర్శతో పోలిస్తే తరవాతి సంపుటాల్లోనే సామాజిక చింతన ఎక్కువ కనబడుతుంది.

అఫ్సర్ తాను రాసినప్పటి కాలం కంటే కూడా వాటి ప్రయోజనం ఇప్పుడు ఎక్కువుందేమో అనిపిస్తుంది. వి.వి, కాశీం, ప్రొ.సాయిబాబా లాంటి మేధావులను రాజ్యం నిర్బంధంలోకి తీసుకున్న కాలం ఇది. ***"మేధావి ఆలోచనల మీద పేలుతున్న తుపాకి శబ్దాలు వినిపిస్తాయి"*** అన్న అప్పటి వాక్యం ఇప్పటి రాజ్యం తీరును చూపిస్తుంది

*"కాషాయాన్ని చూస్తే నాకు కారంచేదు గుర్తొస్తుంది*
*పచ్చటిపొలాల్లో చిమ్మిన రక్తంధారలు కనిపిస్తాయి*
*ఎడారి భూమ్మీద ఎండుడొక్కల్ని ఆరేస్తున్న*
*రైతు కనిపిస్తాడు (ఇవాళ-135)*

1986-1991మధ్యకాలంలో రాసిన "ఇదే నా జాతీయగీతం" కవిత ఇప్పటి కాలానికి ప్రతిబింబం. కాషాయరాజకీయాలు, రైతు దీనస్థితిని తెలియజేస్తున్న అఫ్సర్ వాక్యాలను చదివినపుడు ఇంకా ఈ సమాజంలో ఎటువంటి మార్పులు రాలేదనే అనిపిస్తుంది. ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు ప్రజల జీవనవిధానంలో ఎటువంటి మార్పులూ జరగకపోవడం, రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోవడం బాధాకరం.

రక్తస్పర్శ, ఇవాళ సంపుటాల నుండి వలస,ఊరిచివరకు వచ్చేసరికి అఫ్సర్ స్వరం మారుతుంది. అభివ్యక్తి మారుతుంది. రక్తస్పర్శలో ఉన్న సంక్లిష్టఛాయలు కొంత మాయమై స్పష్టంగ ఒక లక్ష్యం కోసం కవితనెత్తుకోవడం చూస్తాం.

రక్తమంటిన అక్షరం "ఇవాళ"లో కనబడుతుంది.

దేవుడి పేరుతో సాధారణ జనాన్ని మోసం చేస్తున్న వారిపట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేసే ఒక సామాన్యుడు కనిపిస్తాడు.

ప్రతీసంపుటిలోనూ బాధ, నిశ్శబ్దం వెంటాడుతూనే ఉంటుంది.

కవితను కొన్ని యూనిట్లుగా విభజించుకొని అంకెలు సూచించే ఆధునిక కవితారూపం అఫ్సర్ కవితల్లో ఎక్కువ. ఇది ఇవాళ సంపుటిలోనే "గాంధీగారి రెండో చెంప" కవితతో మొదలు కావడం చూస్తాము.

అఫ్సర్ కవితాప్రయాణంలో దేనికది భిన్నమైనదే అయినా "ఇవాళ" సంపుటి ఎంతో ప్రత్యేకత కలిగింది. జీవితాన్ని విడమర్చి చెప్పే ఒక తాత్వికుడు ఇవాళలో కనిపిస్తాడు.

*"ఎవరికీ ఎవరూ పూచీకాదు*
*ఎవరికీ ఎవరూ సాక్ష్యమూకాదు*
*ఇక్కడేముంది చెప్పు*
*కనీసం చావు కూడా"*
*" పెదాలమీది మాటలు*
*రూపాయి చప్పుడు చేస్తాయి"*

మానవసంబంధాలను బాగా అర్థంచేసుకున్న తీరు,మనుషుల స్వభావం పట్ల లోతైన అవగాహన కలిగిన కవిగ అఫ్సర్ "ఇవాళ"లో కనిపిస్తాడు.

♦

అనేక శబ్దాలను దాచుకున్న నిశ్శబ్దంగా మొదలైన అఫ్సర్ కవిత్వపాయకు రాజకీయాలను అర్థం చేసుకొని ప్రతిఘటించడం అనే మరొక పాయ తోడౌతుంది "వలస, ఊరిచివర" కవిత్వానికి వచ్చేసరికి.

అభద్రతా జీవితం గడుపుతున్న ముస్లిం జీవితాల చిత్రణ వీటిల్లో కనిపిస్తుంది. అజా, ఫాతెహా, నహీమాలుమ్, సున్ మేరే బంధూ, ఇఫ్తార్ సైరన్ లాంటి ఉర్దూపదాలతో కూడిన శీర్షికలు పెట్టడం ''వలస'' నుండి ప్రారంభమై కొనసాగుతుంటుంది. ముస్లింజీవితం నుండి తీసుకున్న పదాలు, ప్రతీకలు ఎక్కువగా కనబడుతాయి.

*"వందేమాతరంలో నా తరం లేదు*
*జనగణమనలో నా జనం లేరు" (వలస-180)*
*"తురకల ఇంట్ల పుట్టడం గొప్పకాదులే*
*అవునూ నువ్వు యెన్నో నంబరూ?*
*యెవరో వెటకారంగా నవ్వుతున్నారు గాలిలో"*
*(ఊరిచివర-351)*

ఈ వాక్యాలలో అస్తిత్వం కోసం పడుతున్న వేదన కనబడుతుంది. బయట ఏ విధంగా అవమానానికి గురౌతున్నారో తెలుస్తుంది.

పౌరసత్వాన్ని నిరూపించుకోవలసిన ఇప్పటి కాలంలో ఎడారి నుంచి కాస్త తడి, యింకో ద్వేషభక్తి గీతం లాంటిఅఫ్సర్ కవితలు గుర్తుకురావడం సహజం. అప్పటి వరకు ఉన్న కవితలాగ కాకుండా ఇవి నినాదాలస్థాయినందుకోవడం అఫ్సర్ కవిత్వంలో గొప్ప పరిణామం.

వలసలో కేవలం ముస్లిం జీవితాల్లోని విషాదాన్నేగాక ఊరవతలి దళితుల దుఃఖాన్ని తలకెత్తుకున్నాడు.

**"క్షమించు దొరా**
**కవిత్వం నీ బాంచ కాదు**
**అది శిరసెత్తిన నాగలి**
**కవిత్వం నీ వెన్నెల్లో ఆడపిల్ల కాదు**
**అది చీకట్లో నల్లపులి" (వలస-251)**

1985జూలై 17రోజున ప్రకాశం జిల్లాలో కారంచేదు దళితుల హత్య తరువాత రాసిన కవిత "ఊరవతలి దుఃఖం". దళితుల పక్షాన నిలబడి మాట్లాడడం ఈ కవితలలో చూస్తాము. కారంచేడు, చుండూరు ఘటనలను గుర్తుకుతెస్తాయి. దళితులపై దాడిని నిరసిస్తూ, వాళ్ళలో చైతన్యం కలిగించే దిశగా దళితవాదఉద్యమానికి సంబంధించి కవితలు రాశాడు. తెలంగాణ 2002, ఊరవతలి దుఃఖం మొదలైనవి ఇటువంటివే. మలేరియా జ్వరాలతో, కలరా రోగాలతో ఊరిచివర ఎన్ని ఇబ్బందులో పడుతున్నరో తన కవితల్లో చూపిస్తాడు.

"అన్ని పల్లెటూళ్ళు అందంగా ఉండవని" ఎరుకగల కవి అఫ్సర్. ఊర్లలో ఉండే అంటరానితనం, కులహత్యలు, అగ్రవర్ణ కులస్తుల పెత్తనం మొదలగునవి చూసిన వాడిగా అఫ్సర్ ఈ మాటంటాడు.

♦

అఫ్సర్ కవిత్వంలో మొదటినుంచి సూఫీతత్వం అంతర్లీనంగా ప్రవహిస్తుంటుంది. వాడ్రేవు చినవీరభద్రుడు గారు అఫ్సర్ని "మనకాలపు సూఫీ" అన్నాడు. ఇంతకూ సూఫీతత్వం ఏం చెబుతుంది? ఇస్లాం మతంలోని ఒక ఆధ్యాత్మికమార్గం సూఫీతత్వం. దేవుడిని ప్రేమించినట్టుగానే ఈ సమస్త లోకాన్ని ప్రేమించడం, నిరాడంబరంగా జీవించడం, సత్యాన్వేషణ చేస్తూ ఆత్మసాక్ష్యాత్కారం వైపుగా అడుగులు వేయడం సూఫీతత్వంలోని భాగం.

అఫ్సర్ "దుఃఖమే మనిషి చిరునామా" అంటాడు. "ఒక దుఃఖమే/మనల్ని కలిపి కుట్టె దారం" అంటాడు. జీవితాన్ని ఇంత సమగ్రంగ అర్థం చేసుకున్న వాడిగా, వెంటాడే దుఃఖాన్ని కవితావాక్యాల నడుమ పొదిగిన ఒక సూఫీకవిగా ఈ మాటంటాడు. ఎం.నారాయణ శర్మ గారు అఫ్సర్ కవితను విశ్లేషిస్తు "భౌతికంగా భావించే అంశాలన్నింటినీ ఆత్మకాంతితో కవితామయం చేశాయి" అంటారు.

## కవిత

# చైతన్య ధాతువు



కరోనా కవిత

- ఆర్.వి. రాఘవరావు
9440232760

*మృత్యు ఘోషలు, మరిగే శవాల దిబ్బలు*
*హననాలు ఖననాలు*
*స్మశానాలుగా మారిన మహా నగరాలు*
*మచ్చుకైనా కనబడని హననాలు జీవన హరితాలు*
*ఓదార్పులు కోరుతున్న అస్వస్థులను*
*కోరకనే వరిస్తున్న అనుమానాలు, అస్పృశ్యతలు..*
*మనిషికి మృత్యుదాడులు నిత్యతాకిళ్లు కొత్తేం కాదు*
*నిలువుగా చీల్చబడిన ప్రతిసారీ*
*విత్తై, మొక్కై, తలెత్తిన వటవృక్షమై*
*నింగిని నిటారుగ తాకే మనిషి అలవాటుకు*
*మరణ శాసనాలన్నీ మకిలి నీటిమీది చేతి రాతలే*
*సునామీల సుళ్లను శిరసావహిస్తూనే*
*అదమరిచిన తరంగాల తురంగాలపై*
*సాగించిన సాహసయానం జ్ఞాపకాలకు*
*ఈ క్రిముల కిచకిచ రావాలు*
*పిల్లకాలువ బారులు పిపీలిక సమానాలు*
*అయినా...*
*మనిషిని పరుగులెత్తించానని*
*నిర్జనవీధుల్లో నిండుగర్భంతో కదిలే వైరస్‌కు తెలియనిది*
*మనిషి పారిపోవటమంటే రహస్యంగ పొంచి ఉండటమని*
*దాగి ఉండటమంటే*
*వేటు వేసేందుకు పులిలా మాటు వేయటమని...*
*నిత్య సంచారిని కలుగుల్లో కుక్కానని*
*విరుచుకుంటున్న తన రొమ్ము*
*మనిషి చేతిలో వ్రయ్యలు అవుతున్న వేళ*
*వైరస్‌కు తెలిసివచ్చే మరొక అంశం*
*కలుగులే మనిషి గాయాలకు సంజీవనీ లేపనాలని*
*కలుగులే గెలుపును సహజజన్యువుగా నిలిపిన*
*నిత్యచైతన్య ధాతువులని...*

◆

---

ఇంటివైపులోని చాలా కవితలు ఇలాంటివే. లోలోపలి చీకట్లను పరిచయం చేస్తుంది. బయటకు కనిపించే వస్తువులను అనుభూతితో, ఆత్మకాంతితో వ్యక్తీకరించడం ఇంటివైపులో చూస్తాము.

మిగతాకవితల్లో ఇక్కడినేలతో తనకున్న అపారప్రేమను తెలిపేవి. వానలో తడుస్తున్నట్టుగా ఉంటాయి గానీ అది కేవలం వాన కాదు జ్ఞాపకాల వాన.

***"ఏ అన్నాల వేళో***
***మిమ్మల్నందరినీ విడిచేసి వచ్చాను***
***అది మధ్యాహ్నమో, రాత్రో గుర్తు లేదిప్పుడు***
***నేను సగంలోనే వచ్చాక***
***మిగిలిన అన్నం మీరు తిన్నారా?***
***పళ్ళెంలోనే చేతులు కడుక్కుని దిగ్గున లేచారా?"***

ఏ అన్నాల వేళనో చింతకాని (ఖమ్మం) నుంచి నడక మొదలై విజయవాడ మీదుగా అటునుంచి అనంతపురం వైపుగా వెళ్ళి అమెరికా నేల మీద నిలబడ్డాడు అఫ్సర్. నిజానికి తాను అక్కడున్నా తన మనసంతా పుట్టిన ఇక్కడి నేల మీద. ఇల్లు, దేశం గుర్తొచ్చినపుడు ఎంతలా కరిగిపోతాడో ప్రతీ కవితలో కనబడుతుంది.

ఊరిని పలువరిస్తూ, ఊరితో, ఇక్కడి మనుషులతో వున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సజీవంగ బ్రతుకుతున్నాడు. కొండపల్లి ఖిల్లాను, ఈతగొట్టిన చెరువును, రేగుపళ్ళిచ్చిన పొలాన్ని, ఎన్నో జ్ఞాపకాలు తడితడిగా నడిపిస్తాయి. ఎంతో మార్మికత గల వాక్యం అఫ్సర్ ది. ఏదో తెలియని ఒంటరితనాన్ని మోస్తున్న వేదన, ఇంటివైపు వచ్చి మనుషులతో మమేకం కావాలనుకునే మనిషితనం ప్రతీవాక్యంలోనూ కనిపిస్తుంది.

అఫ్సర్ ఓ ముస్లిం కవిగానో, ఓ సూఫీకవిగానో, ఓ మార్మికుడిగానో, ఓ కాందిశీకుడిగానో ఇలా ఎన్ని రకాలుగా కనబడ్డా నిజానికి తానొక రేగుపళ్ళ వాసనగల్గిన వాక్యం.

◆

## కొత్తదారులు కావాలి

- కొండా శిరీష
6300396530



అవును
వాళ్ళకి ఇప్పుడు కొత్తదారులు కావాలి
కళ్ళ పొలంలో ఎన్నో కలల విత్తనాలను నాటుకుని
గుండెలపై గుదిబండను మోసుకుతిరుగుతున్న
ఆ పాదాలకు ఇప్పుడొక కొత్తదారులు కావాలి
రేయి పగలును ఒకటిగా చేసి
బద్ధకంగా కదులుతున్న దూరాల్ని పాదాలకు వదిలి
బాధల్ని పంటి బిగువున పాతిపెట్టి
పేగులు చేస్తున్న కీచురాళ్ల ధ్వనిని భరిస్తూ
అనునిత్యం అంతరాయాల ముళ్ల కంచెలు
వీపుకు రాచుకుంటున్నా
గాజుపెంకులై విలవిలమంటున్న
ఆశల మోసులపై కాలు మోపుతూ
దిగులు సంచుల్ని నెత్తికెత్తుకుని
ముందుకు సాగుతున్న ఆ ఎముకలగూళ్లకు
ఇప్పుడొక కొత్తదారులు కావాలి
దారి పొడవునా రోడ్లన్నీ
అగ్గిజ్వాలలతోటి కాళ్ళను కడుగుతున్నా
శ్వాసలన్నీ మరణం అంచున వేలాడుతున్నా
పాతదారులతో పోరాడి
ఆకలితో అస్తమిస్తూ
విశ్రమించకుండా ఉదయిస్తున్న
ఆ కర్షక సూర్యులందరికి
ఇప్పుడొక కొత్తదారులు కావాలి

అలుపెరుగక చేస్తున్న ఆ తెరువరుల పాదయాత్రలో
ప్రవహిస్తున్న కన్నీళ్ల కొలనులో
ఆకలి అలలు వెంబడిస్తున్నా
వలస నావపై ఇంటి తీరాన్ని చేరాలని తపిస్తున్న
ఆ ఊపిరున్న శవాలకు ఇప్పుడొక కొత్తదారులు కావాలి

ఆకలనే చిరునామా లేని దిక్కుకు దారిచూపి
నోరు తెరచి రక్తం కక్కుతున్న ఆ పాదాల బీళ్ళకిప్పుడు
ఆకుపచ్చని తివాచీని పరిచే కొత్తదారులు కావాలి ♦

---

## టెక్నాలజీ - బొమ్మ - బొరుసు

- ఆర్. లక్ష్మి

ఉపగ్రహ సమాచార వ్యవస్థ ఊపందుకున్నాక
ప్రపంచం మొత్తం ఒక కుగ్రామం అయిపోయింది
నిజమే
దశాబ్దాలుగా సుప్తచేతనావస్థలో ఉన్న
సంబంధాలన్నీ పునరుజ్జీవనాన్ని పొందాయి నిజమే
అనాదిగా మనిషి కలగంటూ వచ్చిన –
విశ్వమానవ సౌభ్రాతృత్వం మాట ఎలా ఉన్నా
విశ్వమానవ సమాజమైతే ఏర్పడింది
సంతోషించవలసిందే
కాని భూ ఉపరితల కమ్యూనికేషన్ సంగతి?
ఎర్తర్న్ లింక్స్ అన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయే!
మనిషి ఎదురుపడితే మాటే దొరకటం లేదు!
మహత్తరమైన 'మాట' సంవేదన స్థానంలో
మనకు తెలియకుండానే–
మహాశూన్యం ఆవరించిపోయిందే! ♦

కథ



# వసంత రాగాలు

- ఎం. ఆర్. అరుణకుమారి

"ఆంటీ! అమ్మను చూడాలని ఉంది"

"అమ్మనా?!? మీరా?!?"

"అవునాంటీ..."

"....."

"ఆంటీ ప్లీజ్!"

"నేను నమ్మలేకుండా ఉన్నాను"

"ఎందుకాంటీ? బిడ్డలు తల్లిని చూడాలనుకోవడంలో వింత ఏముంది?"

"వింత కాదా శోభా! తల్లే వద్దని వెళ్ళిపోయిన మీరు ఇన్నేళ్ళ తర్వాత ఆమెను చూడాలనుకోవడం?"

"ఆంటీ! మీరన్నా మమ్మల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి"

"ఏమని అర్థం చేసుకోవాలి శోభా? మీ అమ్మ అప్పుడు పడ్డ నరకయాతన చూసిన దాన్ని. ఎంత ఏడ్చిందో... తిండి తిప్పలు లేవు. దాదాపు పిచ్చిదై పోయింది. చచ్చి పోవాల్సిందే! ఆయుస్సు గట్టిదో... దేవుని దయో గానీ... బతికి బట్ట కట్టిందిగా! ఆ రోజే ఆమె చచ్చిపోయుంటే... ఇన్నేండ్ల తర్వాత మీరు వెతుక్కుంటూ ఎక్కడ కెళ్ళి చూసేవారు మీ అమ్మను?"

"నిజమే ఆంటీ! కానీ..."

చూడు శోభా! మంచో చెడో... మీకు తెలిసో తెలియకో... చిన్నతనంలోనే మీరు ఒక నిర్ణయం తీసుకొన్నారు. ఎవరి బతుకులు వారు బతుకుతున్నారు. ఇప్పుడు కొత్తగా.. మళ్ళీ పాత అనుబంధాలు ఎందుకు?"

"తల్లీ బిడ్డల సంబంధం ఆజన్మాంత అనుబంధం కాదా ఆంటీ?"

"దాన్ని మీరే తెంచుకున్నారు కదా!"

"అని అందరూ అనుకొన్నారు"

"ఉన్న దాన్ని అనుకోవడమేమిటి శోభా?"

"అది చెప్పాలనే నా తాపత్రయం కూడా. కానీ... అమ్మ... మమ్మల్ని కలవడానికి ఇష్టపడ్డం లేదు. మీరు చెప్పండి ఆంటీ! మీ మాట కాదనదు– ప్లీజ్!"

"కాదనదని కానిపని చెయ్యమని నేను మాత్రం ఎలా చెప్పగలను?"

"ఆంటీ..."

"తల్లి బిడ్డలు... కలుసుకోవడం 'కానిపని' అని ఎలా అనగలుగుతున్నారు?"

"సారీ శోభా! నిన్ను బాధపెట్టాలని అన్లేదు. అమ్మను బాధపెట్టలేనని అన్నా. నిజంగా అన్నీ మరచిపోయిందో... లేక అంతా గుండెల్లో దాచుకొని పైకి గాంభీర్యంగా ఉందో... అలా ఉండనీ తనను. నిజానికి నువ్వు ఫోన్ చేసినట్లు అమ్మ నాతో చెప్పింది. మళ్ళీ మీ జీవితాల్లోకి ప్రవేశించి...మళ్ళీ లేనిపోని బాధలు, అశాంతి.. తనకు మీకూ కూడా సృష్టించుకోవడం ఎందుకని కూడా అంది."

"గత జల సేతు బంధనం వద్దని చెప్పండి"

"మరి నువ్విప్పుడు కావాలంటున్నది అదే కదా!"

"ఐ మీన్... ఆ బాధలు కాదనీ! ఎదిగి వచ్చిన బిడ్డలు

ఏమి చెప్పాలనుకొంటున్నారో... కనీసం వినమని చెప్పండి. తర్వాత ఆమె మమ్మల్ని తన బిడ్డలుగా స్వీకరించినా సరే... వద్దన్నా సరే!"

"నీ బాధ నాకర్థమవుతోంది శోభా! కానీ అమ్మ అనుభవించిన దుర్భర వేదన ప్రత్యక్షంగా చూసిన దాన్ని. మళ్ళీ తన బాధ చూడ్లేను. తను అమితంగా ప్రేమించిన బిడ్డలు... తనను వద్దని మొహాన్నే చెప్పడం కన్నా వేరే శిక్ష ఏముంటుంది తల్లికి? తను చెయ్యని నేరానికీ కఠినశిక్ష పడింది. అనుభవించింది. ఇప్పుడు మిమ్మల్ని చూస్తే అదంతా తుడుచుపెట్టుకు పోతుందా? ఐనా అదంతా మళ్ళీ తిరగతోడుకోవడమెందుకు? అసలింతకూ మీరు అమ్మ నుండి ఏమాశిస్తున్నారు?"

"ప్రేమ ఆంటీ! పన్నెండేళ్ళుగా మేము పోగొట్టుకున్న ప్రేమ... మా అంతట మేము వద్దని చెప్పిన అమ్మ ప్రేమ కావాలి...'

"శోభా... ప్లీజ్! ఏడ్వొద్దు. నేను అమ్మతో మాట్లాడుతాను. కంట్రోల్ యువర్ సెల్ఫ్.. ప్లీజ్!"

◆◆◆

"తల్లితండ్రుల్ని కాదని అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాను. అతన్ని నమ్మి ఇద్దరు బిడ్డల తల్లినయ్యాను. అష్టకష్టాలు పడ్డాను. అతని తిట్టుడు, కొట్టుడు, తాగుడు, తిరుగుడు... అన్నీ భరించాను. పచ్చిగా చెప్పాలంటే... మా మధ్య ప్రేమకో... సుఖానికో... పుట్టిన బిడ్డలు అన్యాయం కాకూడదని... అత్తింట ఎంతో చిత్రహింస ఓర్చుకొన్నాను. చివరకు ఆ బిడ్డలే నన్ను వద్దనీ... నాన్నే కావాలనీ వెళ్ళిపోయారు. నాకిప్పటికీ ఆశ్చర్యమే! నాన్నంటే భయపడే పిల్లలు... నాన్నతో ఉంటామని చెప్పడం. నేనస్సలు నమ్మలేకపోయాను. ఆ దిగ్భ్రాంతి నుండి తేరుకొన్నాక అసలు నరకం మొదలైంది. పిల్లలు ఎలా ఉన్నారో... టయానికి తిండన్నా పెడ్తున్నారో లేదో... కొడ్తున్నారేమో... బిడ్డలెంత కష్టపడ్తున్నారో.. అనుకొంటే చాలు... గుండె పగిలి కళ్ళు జీవనదులయ్యేవి. బతుకే రోత పుట్టింది. ఎవరికోసం బతకాలన్న ఆలోచన... చావు తెగింపు నిచ్చింది... నువ్వు రావడం..."

"వసు! తెగింపు బతకడానికి కావాలని చెప్పాను కాదూ... ఆ రోజు. చచ్చి ఏమి సాధిస్తారు ఎవరైనా? చావు ఏ సమస్యకూ పరిష్కారం కానే కాదు. కారణం లేకుండా ఏదీ జరగదు వసూ! ఏదో పరమార్థం ఉండే... నువ్వు బతికావు. పోనీ... మళ్ళీ పిల్లల్ని కలుసుకోవడం కోసమే అనుకో!"

"కానీ..."

"తల్లిగా కాకపోయినా... ఒక మనిషిగా వాళ్ళేం చెబుతారో విను. మీ ఆశ్రమంలో వృద్ధులు, బళ్ళో పిల్లలూ చెప్పేది వినడం లేదూ రోజూ! అలాగే ఆ పిల్లలు చెప్పేదీ విను. తర్వాతి సంగతి తర్వాత ఆలోచిద్దాం!"

"అంతేనంటావా?"

"ముమ్మాటికీనూ!"

"సరే ఐతే ! కానీ..."

"వసూ! సందేహాలు, ఆలోచనలు వద్దు. ప్రశాంతంగా ఉండు. రేపు ఉదయాన్నే ఇంటికొచ్చెయ్. పిల్లల్నీ రమ్మంటాను. ఇక్కడే మాట్లాడుకొందాం. నిజం చెప్పొద్దూ! ఎప్పుడో చిన్నప్పుడు చూశాను వాళ్ళను. చూడాలని నాకే ఆత్రంగా ఉంది. తల్లివి. నీకుండదూ! ఐనా వసూ! శోభ నీలాగే పట్టుదల మనిషిలా ఉంది. నీ అడ్రసు, ఫోన్ నెంబరూ సంపాదించిందా! నువ్వు రావద్దన్నావని... నా ఫోన్ నెంబరు కనుక్కొని... మాట్లాడి...'

"నిన్ను బుట్టలో పడేసింది"

"ప్రేమ బుట్టలో ఎంత కఠినాత్ములైనా పడాల్సిందే కదా!"

"అదీ నిజమేలే?"

◆◆◆

"అమ్మా! నీకు మాపైన కోపంగా ఉండొచ్చు. నేను, తమ్ముడు కోర్టులో జడ్జి గారు అడిగినప్పుడు నాన్నతోనే ఉంటామని చెప్పినప్పుడు మన కుటుంబం గురించి తెలిసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపడి ఉండొచ్చు. నిజానికి నాన్న, నాన్నమ్మ, అత్త కూడా ఆశ్చర్యపోయారు. ఇంకా చెప్పాలంటే బాధపడ్డారు కూడా!"

"ఎందుకూ? వాళ్ళే కదా అలా చెప్పమని మిమ్మల్ని బెదిరించింది?!?"

"హుఁ! అలా ఎలా అనుకొన్నావమ్మా! నువ్వున్నప్పుడే మమ్మల్ని ప్రేమగా చూడని వాళ్ళు... నువ్వు లేకపోతే ఎలా చూస్తారనుకొన్నావు?"

"అయ్యో! నిజమా! మరి మీరు ఎందుకలా చెప్పారు?'

"నీ కోసమే!"

"నా కోసమా! బిడ్డలో బిడ్డలో అని కంటికి కడివెడుగా ఏడ్వడానికా? తిండీ, నిద్రా లేకుండా తపించడానికా? బతుకు చీకట్లో ఒక్క ఆశాకిరణమూ కానరాక... అలమటించడానికా?

చివరకు మృత్యువంచుదాకా వెళ్ళానే..."

"అమ్మా! అంత ఆలోచించే శక్తి అప్పటి మా పసి వయస్సుకు, మేధస్సుకూ ఉంటుందా?"

"మరి... ఎందుకు అమ్మను వద్దన్నారు? తల్లి చస్తే తండ్రి దాయాదంటారు"

"కానీ.. తండ్రి లేకపోయినా... తల్లి ఎన్ని బాధలు, కష్టాలు పడైనా... తన బిడ్డల్ని సాకుతుంది..."

"ఆ! అవునాంటీ! అప్పుడు మాకు ఈ సామెతలు తెలీవు కానీ...."

"కానీ...?"

"ఆంటీ అన్నట్లు ఎలాంటి బాధలు, కష్టాలు నీకు ఉండొద్దనుకొన్నామమ్మా!"

"శోభా?!?"

"అవును మా! నువ్వు కావాలని అస్తమానూ ఏడ్చే నాతో అక్క చెప్పింది...'మనం అమ్మ దగ్గరకు వెళితే అమ్మకు ఇంకా ఎక్కువ కష్టాలు వస్తాయి. నాన్న దగ్గరే ఉందామ'ని."

"అయ్యో సాయి! శోభా ఎందుకలా చెప్పావూ?"

"అమ్మా! నాన్న నిన్ను కొట్టి అర్ధరాత్రి...వర్షంలోనే... నిన్ను ఇంట్లోంచి గెంటేశారు కదా! నువ్వు మళ్ళీ మాకు కనబడింది కోర్టులోనే కదా! నాన్న, అత్త, నాన్నమ్మ మమ్మల్ని ... నిన్ను చూడనివ్వలేదు... నువ్వు ఇంటికొచ్చినా! అసలు నిన్ను ఇంట్లోకే రానివ్వలేదు కదా! ఆ గొడవలు...ఎంత భయపడ్డామొ! నువ్వు వెళ్ళిపోయాక నాన్న పగలు కూడా తాగేవారు. నాన్నమ్మ, అత్త... మేము ఉ.. ఆ.. అన్నా చితక బాదేవారు. నాన్న మమ్మల్ని కొట్టలేదు గానీ... అస్సలు పట్టించుకోలేదు. నీకు తెలుసుగా... ముందు... నాన్నంటేనే మాకు చాలా భయం! ఇక మేము మా బాధ ఎవరికి చెప్పుకొనేది?"

"అయ్యో! నాకు తెలుసు. వింటున్నావా శారదా! నేను చెప్పాను కాదూ!"

"వసూ! ప్లీజ్! కంట్రోల్! ఏండ్ల తరబడీ గుండెల్లో ఘనీభవించిన బిడ్డల బాధ కూడా కరగనీ! వినూ..."

"మీ పొగరు, మీ అమ్మ కొవ్వూ.. అంతా అణుగుతుంది. పైసాకు ఠికానా లేదు. పుట్టింటి అండ లేదు. ఎవరో... స్నేహితురాలింట్లో పడి ఉంది. మీ ఇద్దర్నీ ఎట్లా సాకుతుందో... చదివిస్తుందో చూస్తాము అని అంటూ మమ్మల్ని తిట్టేవారు. సాయి అమ్మ కావాలని, అన్నం తిననని ఏడుస్తుంటే 'పోన్లే పసిబిడ్డలని ధర్మానికి పెడ్తున్నాం. మీ అమ్మ దగ్గరకు పోతే పస్తులుండి చస్తారు చూడు' అంటూ ఏవేవో పెద్ద పెద్ద మాటలు... చెడ్డ మాటలూ అంటుండేవారు. అప్పుడు కాదు గానీ... ఇప్పటి మాకు అర్థం కాని విషయం ఒకటే. నిన్ను ప్రేమించి పెళ్ళి చేసుకొన్న నాన్నకు నీ మీద ఎందుకు నమ్మకం లేకపోయిందోనని!" అత్త, నాన్నమ్మ చెప్పే చాడీలు ఎలా నమ్మాడని?"

"అంతా నా ప్రారబ్దం!"

"హూ! నీ ప్రారబ్దాన్ని కొంచెమైనా మార్చాలన్న ఆలోచన! మేము నీ దగ్గరకు వస్తే... నువ్వు చాలా కష్టపడతావని... నువ్వు కోరుకున్నట్లు మమ్మల్ని పెద్ద చదువులు చదివించలేవనీ..."

"అయ్యో దేవుడా! పసి మనసుల్లో ఎంత పెద్ద ఆలోచన కల్గించావయ్యా! పెద్ద చదువు, ఉద్యోగం లేకపోబట్టే నేనీ నరకంలో ఉండాల్సొస్తోంది. లేకపోతే బిడ్డల్ని తీసుకొని వెళ్ళిపోయుండేదాన్ని కాదూ!' అని నువ్వు అప్పుడప్పుడూ ఏడ్చేదీ నాకు గుర్తుకొచ్చేది పదే పదే!"

"శోభా!"

"ఆ! అవునమ్మా! అందుకే సాయికి చాలా నచ్చ చెప్పాను. వాడు ససేమిరా అనేవాడు. 'నాన్న వద్దక్కా! అమ్మ కావాలి. అమ్మ దగ్గరకే వెళ్ళిపోదాం' అని ఏడ్చేవాడు. అత్తగానీ, నాన్నమ్మ గానీ చూస్తే కొడతారని ఇద్దరమూ నోరు గట్టిగా చేతుల్తో మూసుకొని ఎక్కిళ్ళు పెట్టేవాళ్ళం."

"ఒక దరిద్రం వదిలింది. ఇహ రేపట్తో ఈ ఏడుపుగొట్టు మొహాలూ వదుల్తారు. ఇదో! ఇవాళ.. లాస్ట్... కడుపునిండా మెక్కండి. రేపట్నుండీ పస్తులేగా... ఈసడింపుగా నవ్వుతూ అన్నం కంచం మా ముందు పడేశారు ముందురోజు. 'అమ్మ మనకు ఎంచక్కా కలిపి ముద్దలు తినిపిస్తుంది. వెళ్ళిపోదామక్కా' అని మళ్ళీ సాయి ఏడ్పు. 'అమ్మలా...నేను తినిపిస్తాగా' అంటూ నేను అన్నం కలిపితే... ఇద్దరమూ అన్నం ముద్దలు, కన్నీళ్ళూ కలిపి మింగి..."

"ఇంక చాలు. నేను విన్లేను. శోభా...సాయీ...ఇలా రండి. మిమ్మల్ని అపార్థం చేసుకొన్నా. నన్ను క్షమిం..."

"అమ్మా ప్లీజ్! అలా అనొద్దు. ఈ కౌగిలి కోసం.. ఈ ప్రేమ కోసం.. మేము పన్నెండేళ్ళు తపస్సు చేశామమ్మా! అత్త, నాన్నమ్మల పోరు పడ్లేక నాన్న మమ్మల్ని సంక్షేమ హాస్టల్లో వేశారు. అక్కడా ఎన్నో కష్టాలు... బాధలు... ఎవరికి

**కవిత**

## ఎరుకలం

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201



*ఔను
అడవి మా పుట్టిల్లు
మాకూ మైదానానికి పడదు*

*మేమల్లుకు పోయింది అడవి
తీగలతో
వేట మా జీవనాధారం
వెదురుని వంచిందే మేము
విల్లు సృష్టికర్తలం మేము
ఎక్కుపెడితే పడాల్సిందే ఏదైనా
మా పొట్ట నిండేదే
మా బతుకుపై ఆంక్షల వెల్లువతో
మైదానాలకి తరిమిన తెల్లోళ్లు*

*మాపై దొంగల రాజముద్ర
యాడ దొమ్మి జరిగినా మాపై రచ్చ
కీలుకీలు ఇరగగొట్టు
మా అంటరాని దేహాలు రాసక్రీడల ప్రయోగశాలలు
మా పేటల్లో పెనుగులాటల వర్షం నిత్యం*

*మా భాష లిపి లేకున్నా
మా నాలుకలపై కురవంజి నృత్యం
మా దువ్వెనలు ఈర్పెనలు మీ తలలు దువ్వుతుండ
మా పందుల వార్లు తిని బలిసిన మెదళ్లు
మా సంస్కృతిపై విధ్వంస గీతా రచన
మా ఆడాళ్ళ అంగాంగ వర్ణనలో ఛందస్సులు
తృప్తి చెందే రసికవులు
మా వెతలు వెలికి తేలేని కుకవులు*

*నాడు అటవీ రక్షణ మా చేతుల్లో
నేడు అటవీ భక్షణ మీ పంజాల్లో
నిక్షేపాల గూడు చెదిరి పోయే
మా బతుకుల కాష్టాల్లో చలికాగుతుండే
జాతి రక్షణలో మేమే నయం కాదంటారా!
మేం ఎరుకలం!!!* ◆

చెప్పుకోము? శెలవుల్లో కూడా మాకోసం వచ్చే వాళ్ళు లేరు. నేను బాయ్స్ హాస్టల్ కెళ్ళి... సాయితో మాట్లాడేదాన్ని. మంచిగా చూసుకొమ్మని వాడి రూమ్మేట్సును, వార్డెన్‌నూ బతిమాలాడేదాన్ని..."

"అయిన వాళ్ళంతా ఉండీ... అనాధల్లా బతికారు.. నా బిడ్డలు..."


"వసూ.... ప్లీజ్! బిడ్డల్ని ఓదార్చకుండా నువ్వు ఏడిస్తే ఎలా? ఐనా వసూ! నువ్వు ఎంత అదృష్టవంతురాలవో చూడు. నిన్ను కష్టపెట్టకూడదని... నీకు దూరమై... తాము ఎన్ని బాధలు పడ్డారో... చివరకు ప్రయోజకులై... నిన్ను వెతుక్కుంటూ వచ్చారు. నీ బిడ్డలు. ఇంతవరకూ మనం పిల్లల కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాలు విన్నాం. చూడూ... నీ పిల్లలు... నీ కోసం... చిన్నప్పుడే ఎంత పెద్ద మనసుతో ఆలోచించారో... వాళ్ళకు తెలీకుండానే తను బాల్య సుఖసంతోషాలను త్యాగం చేశారో...! రియల్లీ గ్రేట్!

"కానీ... ఈ రోజు వరకు.... నా ప్రతి అడుగుకూ తోడు నిలిచిన నువ్వు ఇంకా గ్రేట్!"

"అవును ఆంటీ! మీకు వేనవేల కృతజ్ఞతాభివందనాలు మా ఇద్దరి తరపునా!"

"అయ్య బాబోయ్! పెద్ద పెద్ద మాటలతో నన్ను దూరం పెట్టెయ్యకండి. మీ ప్రేమానుబంధమే మిమ్మల్ని కలిపింది. మళ్ళీ! అనూహ్యమైనదే జీవితం. ఆటుపోట్లు తట్టుకొంటూ సాగేవే జీవనగమనం. లేవండి. భోంచేద్దామిక!" ◆

విశ్లేషణ




# బాధల సంతకమే ఈ కవిత్వం..!

- కెంగార మోహన్
9000730403

ఇప్పుడు అనివార్యంగా ఇటువంటి కవిత్వం రావాల్సిందే. కారణాలనేకం ఉన్నాయి. యావత్తు సమాజమంతా సంక్లిష్ట స్థితిలో ఉంది. దేశంలో అసమానతలు, వైరుధ్యాలు, సాంఘికంపై అసాంఘిక శక్తులదురాగతలు, ప్రశ్నించే గొంతుకల్ని గొంతునులిపే ప్రయత్నాలు... ఈ పరిస్థితుల్లో ఒక కవిగా స్పందించాల్సిందే. అదీ కవిత్వాన్ని ఆసరాగా చేసుకుని రణన్నినాదం చేయాల్సిందే ఆ పనే ఈ కవి చేశాడు. వర్తమాన ప్రపంచం దశ దిశలేకుండా సంచరిస్తున్న సంధికాలమనిపిస్తుంది. ఈ కవిత్వం పురుడుబోసుకోడానికి ఎంత యాతన పడ్డాడో, ఇంతటి భావావేశం పెల్లుబికేందుకు ఎంత క్షోభ అనుభవించాడో ఈ మొలకెత్తిన పిడికిళ్ళు కవిత్వం చదివాక మనలో అనేక ప్రశ్నలు మొలకెత్తుతాయి. సమాజం పట్ల బాధ్యతున్న కవులే ఇలాంటి అభివ్యక్తి ప్రదర్శిస్తారు. చాలా మంది కవులు కవిత్వమంటే అదని..కవిత్వం ఇలా ఉండాలని చెబుతున్నప్పుడు జనంనాడి తెలిసిన కవులేది రాసినా అది కవిత్వమై సమాజంలో బతుకుతుందనిపిస్తుంది. ప్రగతిశీల భావజాలమున్న కవులకు వస్తువులకు కొదువ లేదు. కవి పేదలపక్షమైనప్పుడు ఆ పేదల కన్నీళ్ళే..ఆ సామాన్యుల ఆక్రందనలే..బడుగు బలహీన వర్గాల బాధలే కవిత్వంగా బాధల సంతకం చేస్తాయి..

*కన్నీటి కట్టలు పోగైన చోటు*
*ప్రతి నోటు ప్రతి నాణెంపై*
*పేదోడి బాధల సంతకం..*

ఈ కవి పేదల పక్షపాతి..రాజకీయ రాబందులు మనుషుల్ని..జీవితాల్ని పొడుచుకు తినడం వంటి దృశ్యాల్ని కుంచెను కన్నీళ్ళలో ముంచి చిత్రిస్తారు. ఊరికే ఏదో ఒకటి రాసి వదేసి కవిననిపించుకోవాలని చూస్తున్న వర్తమానకాలంలో అనుక్షణం కాలాన్ని కాల గమనాన్ని పరిశీలిస్తూ అక్షరీకరిస్తాడు. అందుకేనేమో "ఈ సమాజాన్ని చూస్తుంటే ఈ మనుషులను చూస్తుంటే బాధలు, కష్టాలు, కన్నీళ్ళను చూస్తుంటే ఏడ్వాలనిపిస్తుంది..వెక్కి వెక్కి ఏడ్వాలనిపిస్తుంది.దు:ఖం తన్నుకు వస్తుంది.!" ఏడ్వడమంటే నీళ్ళలో ఈదే చేపకు కన్నీళ్ళు కనబడవు. చౌశా కన్నీళ్ళు బహుశా ఇలాంటివే కాబోలు.

మొదటిసారిగా నా ఆత్మీయ కవిమిత్రుడు వేస్తున్న కవిత్వ పిడికిళ్ళకు మద్దతుగా నాలుగైదు ఆప్తవాక్యాలు రాసి గురజాడ గారన్నట్లు తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి అన్నట్లు ముగిద్దామనుకున్నా..కానీ కవిత్వం చదువుతుంటే అనేకానేక ప్రశ్నలు..సంఘర్షణలు మది గర్భంలో పొడుచుకొస్తున్నాయి. అవి ఎంత పదునుగా ఉన్నాయంటే.. ***ఆత్మహత్యలు ఆగాలంటే/ రైతుకు విలువ పెరగాలంటే / పంటకు మద్దతు రావాలంటే/ సంతోషంగా బతకాలంటే /సువ్వాక వీరుడు కావాలి/అల్లూరికి వారసుడవ్వాలి!*** ఆశ్చర్యం వేస్తుంది. కవికున్న పోరాట దార్శనికత అంతా ఇంతా కాదు. ఈ కవి సాహిత్యలోకంలో నిలబడ్డాడన్న భరోసా ఇవ్వాలనిపిస్తుంది. మట్టిమీద మట్టిని నమ్ముకున్న రైతు మీద ఎంత ప్రేమ..మోసపోయిన ఈ సీమ

మట్టిలో పుట్టినవాడు కదా..ఆ మాత్రమైనా ఉండదా..? రైతు మౌనంగా దిగమింగే కన్నీళ్ళను ఎంత ఆవేశంగా వ్యాఖ్యానిస్తాడు.

ఈ కవి చెప్పినట్లు మన రైతులు అల్లూరిలా స్వతంత్ర్యదేశంలో మరో స్వరాజ్యపోరాటం నిజంగా ఇప్పుడు చేస్తున్నారు. కొంతమంది పురుగుల మందుకో ఉరికొయ్యకో వేలాడితే ఈ కవి రైతన్నలకు ధైర్యం నింపుతాడు. ఆత్మస్థైర్యం నూరిపోస్తాడు. బతకాలంటాడు. అల్లూరి వారసులవ్వాలంటాడు. ఇది కవిత్వం..వర్తమాన కాలానికి అవసరమైన కవిత్వం..రాజకీయ వ్యంగ్యాస్త్రాలతో సాగిపోతున్న యుద్ధమైదానం. కవితలు గొప్ప ఎత్తుగడలతో ఆరంభమౌతాయి..ఆలోచింపజేస్తాయి..మనుషులు శిరస్సులను మోస్తున్నారు. "అనాదిగా అనవసరంగా విలువైన మేధస్సును పుర్రెలో దాచుకుని నడుస్తున్నారు భయం భయంగా సొంత ఆలోచన లేని ఆలోచించలేని రెండు కాళ్ళ జంతువుల్లా.." ఇంతకంటే కవిత్వం ఏం కావాలి..కవిత్వంలో ఏం వెతకాలి..కవిత్వంలో ఇంతకంటే ఏం ఆశిస్తాం..సంఘర్షించబడిన అక్షరాలు తూటాలై పేలుతున్న కవిత్వమిది..కవి తనకు తానుగా తనకు తెలియకుండా ఒక కోణాన్ని ఆవిష్కరించాడు. బహుశా తనకు తెలుసని అనుకోను.మానవ మూలాలను వెతికే క్రమంలో.. సమాజ గతుల్ని గమనిస్తున్న సందర్భంలో వర్తమాన ప్రపంచంలో సంచరిస్తూనే చరిత్ర పొరల్లో దాగిన నిజాల్ని తవ్వి మరీ మనోవైజ్ఞానిక కోణంలో ఆవిష్కరిస్తాడు. మనిషిలో నుంచి మనిషిని వేరు చేసి ఇద్దరికీ వేర్వేరు రూపాలు సృష్టించి ఆ రూపాల్లోని మనస్తత్వాలను అంచనా వేసే ప్రయత్నమూ చేస్తాడు.

మిత్రుడు చౌశా దార్శనికత గలవాడనిపిస్తుంది. చాలా కవితల్లో ఏకరూపకత కలిగిన వస్తువులే కనబడ్డాయి. అక్షరీకరించే సందర్భంలో కవితా వ్యాక్యాలుగా నిర్మించే సమయంలో గుండె బరువెక్కి గుక్కపట్టి ఉబికి వచ్చే ధారల్ని అదిమిపట్టుకుని కవిత్వమై పరచుకుంటాడు. ఈ కవి కవిత్వం ఉత్సాహంగా ఉరకలేస్తున్న స్రవంతిలా సాగిపోదు. అడుగడుగున మనసుకు ఆనకట్ట వేస్తుంది. కవిత్వం చదువుతుంటే పిడికిలి బిగించి యుద్ధం చేయాలనిపిస్తుంది. అన్యాయాలపై తిరగబడాలనిపిస్తుంది. పరశురాముడి గొండ్రగొడ్డలవ్వాలనిపిస్తుంది. కదనరంగంలో ఆయుధమున్నా లేక పోయినా పోరాటం చేయాలనిపిస్తుంది. వీరత్వం సునామిలా విరచుకుపడుతుంది. అందుకేనా ఈ పిడికిళ్ళు కూడా ఇలా తిరుగుబాటు చేస్తాయి.

***ముఖాన్ని కడగలేను/లేదు కాబట్టి/శిరస్త్రాణం ధరించలేను/శిరస్సు లేదు కాబట్టి/దేన్నీ స్పర్శించలేను /చర్మం లేదు కాబట్టి/తలలేని మొండెంతో/మనసులేని మెదడుతో/ చర్మంలేని శరీరంతో/పనిచేస్తున్నాం!/యంత్రంలా, మరమనిషిలా/మట్టి ముద్దలా..!*** ఆధునిక మనిషి అస్తిత్వాన్ని ఇలా చూపడమేమిటి అన్న సందేహం, సంశయం ఈ కవితలో కనబడ్డాయి. నిస్సందేహంగా ఈ కవిత్వం భావాల ప్రయాణం. బడబాగ్ని జ్వాలల సమాహారం. అభ్యుదయ కవిగా సమసమాజాన్ని కలలుగంటున్న కవిగా సమాజాన్ని వర్గదృష్టితో చూస్తాడు. ఆ దృక్పథంతోనే ఈ సమాజాన్ని వేలుపట్టుకుని పురోగమనం వైపు నడిపించాలని తాపత్రయ పడ్డాడు. అక్కడ మరో ప్రపంచం అనివార్యమని భావించి ఆ దిశగానే కలం పట్టుకున్న యోధుడిలా ఈ కవిత్వ పిడికిళ్ళు నాటుతాడు. అవి కవితా ఉద్యమాలకు ఆయువుపోసే పిడికిళ్ళవుతాయి.

పేదలు కష్టాల్లో కూరుకుపోయినపుడు, శ్రామికుల చెమటచుక్కకు విలువే లేనప్పుడు ఆవేదన చెంది నవీనసమాజం ఆవిష్కరించాలని ఆర్థిక అసమానతలు లేని సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలని కలలు కంటాడు. ఈ కవితల్లో సమాజ రుగ్మతలన్నీ ఇతివృత్తాలుగా పరచుకున్నాయి. కవిత్వం బాగుందనో..బాలేదనో చెప్పటానికంటే సగటు సామాన్య సాహిత్య పాఠకునికి అవసరమైన సరళ భాష, సంక్షిప్త పదాలు కవితలుగా అల్లుకుంటాయి. కొన్ని కవితలు మనిషిని..కాదు కాదు మస్తిష్కాన్ని మధిస్తున్న మనసున్న మనిషిని లోతుల్లోకి సంచరించేలా చేస్తాయి. చాలా సందర్భాల్లో ఆవేశం పొదుచుకుని పాలకుల మీద నిప్పులు చెరుగుతాడు..మరికొన్ని సందర్భాల్లో వైరాగ్యం నిరాశ నిస్పృహలకు లోనే తనకు తానే సముదాయించుకుని దురాగతాల్ని ప్రశ్నించుకుంటూ ముందుకెళ్తాడు.

***మనుషులను పశువులుగా లెక్కించి/కులాలు, మతాలు, ప్రాంతాలు,/భాషలు, యాసలు/పార్టీలుగా విభజించి/ఇంకా విభజించి మనిషిని అంధకారం వైపు నడిపిస్తూ/లాభాలార్జిస్తున్న/ ఈ వ్యవస్థను చూసి విలపిస్తోంది!/కాలం విలపిస్తుంది..*** ఇంతకంటే ఏం కావాలి. సామాజిక సమస్యల్ని గుర్తించే నేర్పు,

# వాన - జ్ఞాపకం

- సునీత పేరిచర్ల
8309420900

*చూరు కింద కూర్చుని*
*చిటపటలాడుతూ పడుతున్న*
*చిరు చినుకులను చూస్తూ*
*చిందులేసిన బాల్యం..*

*చెంగు చెంగున దూకుతూ*
*చినుకు సవ్వడికి*
*తాళమేసిన పాదాలు*
*జారిపడితే తగిలిన గాయాలు..*

*నిశ్శబ్ద నీరవంలో*
*ఉన్నట్టుండి*
*ఆకాశం ఒళ్లువిరిచి చేసే*
*ఉరుముల ఉత్సవానికి*
*ఉలిక్కిపడి లేచిన రాత్రులు..*

*నిరర్థకమైన కాగితానికి*
*నిండైన రూపం ఇస్తూ*
*ప్రవాహంలో జారవిడిచిన*
*కాగితపు పడవలు..*



*వేకువ జామునో, సంధ్య వేళో*
*కిటికీ బయట నుండి*
*ఆడుకుందాం రమ్మని*
*పిలిచే నీటి తుంపరలు*

*బాల్యాన్ని దాటి వచ్చేసినా*
*మనసును తడిపే*
*మధురమైన జ్ఞాపకాలు..* ♦

---

కవిత్వీకరించే నైపుణ్యం, అభ్యుదయ భావజాలం గల కవులకు మాత్రమే సాధ్యం. ఆ కవి మాత్రమే విశ్లేషించి చెప్పగలడు. మనిషిని మనిషి జీవితాన్ని ఆ మనిషిలోని జీవనదృశ్యాల్ని, జీవన ముఖచిత్రాల్ని వర్తమాన సమాజానికి కవితలుగా అందిస్తున్న ఈ కవిని సాహిత్యలోకం స్వాగతిస్తూ ఆత్మీయాలింగనం చేసుకుంటుంది. ఈ సంపుటిలో కవి చౌశా లేవనెత్తిన అనేకానేక ప్రశ్నలు, వాటికి సమాధానాలు ఈ దుర్నీతి పాలకులు చెప్పాల్సిందే. అందరూ ఎవరికి వారు సమాజమంటే ఏమీ తెలియనట్లు, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్న నవనాగరిక మనుషుల మనో విశ్లేషణల్ని కవి తన కవితల్లో ఈ కవితా సంపుటిలో పొందుపరిచాడు.

సాధారణంగా కవులు ఏదో ఒక కవితని ఇతివృత్తంగా తీసుకోవడమో, ఒక వస్తువును గుర్తించి శిల్పంగా మలిచి కవిత్వంగా మలచడమో చేస్తే చౌశా నిర్మాణరహస్యాల జోలికి వెళ్ళ కుండా సమస్యను వస్తువుగా మలచి ఆ సమస్యకు ఆవేశపూరిత సమాధానమిస్తూనే పరిష్కారం చూపిస్తారు. ఇలాంటి కవితనొక దాన్ని చూస్తే... ***యురేనియం తవ్వకాల పేరుతో/మనుషులు, జంతువులు/వృక్షాలు, నదులు/ సెలయేళ్లను నాశనం చేసేందుకు/ఏ చట్టాలు ఒప్పుకున్నాయ్?/ ఇంతకీ తవ్వకాల వెనకాల/మీ ఉద్దేశ్యం ఏమిటి?/అణు విద్యుత్తా?/లేక/అణ్వాయుధాల తయారీనా?/సాధారణ ప్రజల కోసమా? లేక/సామ్రాజ్యవాదుల కోసమా?/మీరు యురేనియం తవ్వకముందే/మాలో చైతన్యం వేల్కొంది/మీరు బాంబులుతయారు చేయకముందే/మేం అణుబాంబులవుతాం!/ అల్లూరి స్ఫూర్తితో/అడవి బిడ్డల అండతో/నల్లమలను కాపాడుకుంటాం!/ప్రకృతిని రక్షించుకుందాం..!*** ఇలాంటి పరిష్కార కవితలు అక్కడక్కడా కనబడ్తాయి. ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని రగిలించి ఉద్యమానికి పిడికిలి బిగించేలా చేస్తాయి. కవికి సమాజం పట్ల అమితమైన ప్రేమ. ప్రజల బాధలు కష్టాలు చూసి చలించిపోయే మనస్తత్వం. సమాజాన్ని, ఈ వ్యవస్థను అపసవ్యదిశలో అస్తవ్యస్తంగా నడిపిస్తున్న కుహనా రాజకీయనాయకుల మీద, దుర్నీతి పాలకుల మీద కట్టలు తెంచుకున్న ఆవేశం పొరలు పొరలుగా విస్తరించి కవిత్వమైంది.

నిరంతరం సమాజంలో జరిగే ఘటనలే కవిత్వమై మనల్ని పలకరిస్తాయి. చదువుతున్నంత సేపూ పాఠకుల్లో కవితాశక్తినే కాదు..మరో కొత్త కవిత్వానికి శ్రీకారం చుట్టే తొలికవితావాక్యమై నిలుస్తాయి. కవి చౌశాకు తన గమనం, గమ్యం స్పష్టంగా తెలుసు..నిర్దిష్ట గమ్యంలోనే లక్ష్యసాధన దిశలోనే పయనిస్తూ సరికొత్త చైతన్యవంతమైన ప్రపంచాన్ని కోరుకుంటున్నాడు. పేదలు సృష్టించిన సంపద పాములపాలైనప్పుడు చీమలు తిరగబడాలని చరిత్ర బోధించిందని చెబుతాడు. అతని కవిత్వం అక్షరసత్యమవ్వాలని మనం కోరుకోవాలి. పేదలకు దారిద్ర్యాన్ని బహుమానంగా ఇచ్చిన పాలకుల పతనం ఆరంభవమ్వాలన్న కవి కాంక్ష నెరవేరాలి. ఎక్కడో చదివిన కవితావాక్యాలు "వామపక్ష కవిది విశ్వజనీన దృష్టి. సమసమాజం వామపక్షకవి కనే కల. అసమానతలు నిర్మూలించి సమసమాజ స్థాపన కోసం అక్షర యుద్ధ చేస్తారు వామపక్ష కవులు" ఈ ఆశయ సాధనలో నిరంతరం పయనిస్తున్న కవి చౌశాకు ఈ మొలకెత్తిన పిడికిళ్ళ సాక్షిగా అభినందనలు.. ♦

## కవిత

## ఆత్మీయతల ఆరబోత

- కళ్యాణదుర్గం స్వర్ణలత
98486 26114

వెల వెల పోతున్న విలువలతో
సందేహ బాధితుల
సంక్షోభాలతో
పొలమారిన గొంతుకలతో
నేలరాలిన ఆకులను
చూసిన విషాదంతో
చిగురునే కాదు
చెట్టును కూడా గుర్తించలేని
సమూహాల మధ్య...



వాన కురిసినప్పటి
పువ్వుల నవ్వులా
వాన వెలిసాక తంతిమీది
పిచుకల పాటలా
పింఛాన్ని విదిల్చిన నెమలి అడుగుల్లో
ఆదమరచి పెరిగిన అడవిలా..
జల్లు జల్లుగా పడి ప్రవాహం అయ్యే
నీ ఆలోచనల ఆరబోతలో.. 'నేనే'

నులివెచ్చని సూర్య కిరణాలను వెంట తెచ్చుకొన్న
ఉషోదయపు వెలుగులా

మొక్క దాహాన్ని తీర్చే మబ్బు ముక్క ఆర్తిలా

అంచనాలకు అందని అపారమైన
నీ ఆత్మీయతల ఆరబోతలో మళ్ళీ.. 'నేనే'

హరితస్పర్శతో ఆకుపచ్చని పారాణితో
నీ తలపుల పుప్పొడి పసుపు ముద్దనై మళ్ళీ 'నేనే'

మొగ్గకు మెలకువ వచ్చి పువ్వు అయి విచ్చుకున్నట్టు..
నీ ప్రతి నవ్వుకు
విచ్చుకున్న పువ్వును అయ్యేది మళ్ళీ . 'నేనే' ♦

---


## కడలికెరటం

- కోడే యామినీ దేవి
9492806520

అల.. అల..
అల వెంట అల.. అల వెంట అల
తీరం చేరేలోగా.. ఊపిరి పీల్చేలోగా
ఒకటి తర్వాత మరొకటి
తేరుకునే సమయముండదు
ఆదమరచే వీలూ ఉండదు

ఒకో అలా ఒకో అడుగు
తీరం చేరాలనే తపనే తోడు
కడలి జీవితంలో
కల్లోల సంఘటనలు
అలుపెరగక సాగుతున్నా
ఊహించని ఉప్పెనలై
ముంచే సుడిగుండాలు

వర్షించే మేఘాలు
హర్షించే నయనాలైనాక
చెలియలికట్టకు హద్దులు గీస్తూంటే



కుదుర్లేని అలజడి
అస్తమానూ అల్లుకుంటూంటే
కుదుటపడాలనేదే
సంఘర్షణ కావచ్చు

ఒక అల తేజమై
ఇంకొకటి స్థబ్దమై
మరొకటి నిశ్శబ్దమై
ఆ వెంట నిస్తేజమై
వెనువెంట నిరాశక్తమై
ఆ తర్వాత ఆశే జీవమై

పునర్జీవమై సాగుతూ
అల
అల వెంట అల
అలా..
అలవాటుగా వస్తుంది

శ్వాస నింపేందుకు
చిరునవ్వుని చేర్చేందుకు
అంతులేని పయనమై
అలుపెరుగని గమ్యమై
కడలి నురగలతో
తీరం పాదాన్ని తాకుతూ
చివరికంటా వెంట
పుట్టి గిట్టడానికి
నడుమ కాలంలా... అల ♦

వర్తమానం



# బాబ్రీ విధ్వంసంపై తీర్పు-వివేకానికే సవాలు

- తెలకపల్లి రవి

28 సంవత్సరాలు, అత్యున్నత పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో 600 పైగా సాక్ష్యాధారాలు, 351 మంది సాక్షులు, 500 పేజీ లిఖిత వాదనలు, 2300 పేజీ తీర్పు, ఏడాది కిందటే రిటైర్ కావలసిన న్యాయమూర్తికి పొడగింపు, అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యలు, జోక్యాలు, ఉన్నత న్యాయస్థానం, ఒకటికి రెండు కోర్టులలో విచారణ, మధ్యలో ఒక కమిషన్, దేశమంతా చూసిన దృశ్యాలు, వందలు వేల్లో మీడియా నివేదికలు ఎన్ని వుంటేనేం? లక్నోలో విచారణ ముగించిన సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సురేంద్ర కుమార్ యాదవ్‌కు ఈ సాక్ష్యాలేవీ సంతృప్తి కలిగించ లేకపోయాయి.

1992 డిసెంబరు ఆరవ తేదీన బాబ్రీ మసీదు విధ్వంసం వెనక కుట్ర కోణం వుందనడానికి సరైన సాక్ష్యాలు లేవంటూ అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ఉమా భారతి, కళ్యాణ్ సింగ్‌తో సహా 32 మందిని గుండు గుత్తగా వదిలి పెట్టేశారు. ఆ మూడు గుమ్మటాల కింద రాముల వారి విగ్రహాలు వున్నాయి గనక భక్తులైన వారెలా కూల్చివేస్తారని ఆయన ఆధ్యాత్మిక సందేహాలు తీసుకొచ్చారు. ఈ కారణంగానే విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడైన అశోక్ సింఘాల్ కట్టడాన్ని కాపాడేందుకు ప్రయత్నించారని కూడా కితాబునిచ్చారు. దేశ చరిత్రలో ఎరుగని మత తత్వ రాజకీయ వ్యాప్తికి, ఘర్షణకు, వందలాది మంది మరణించడానికి కారణమై, దశాబ్దాల పాటు కొనసాగిన ఈ విధ్వంస కాండపై న్యాయమూర్తి అయిదు నిముషాల్లో కీలక భాగాలు చదివేశారు.

ఆయన తీర్పు చదువుతుండగానే అక్కడ జై శ్రీరాం నినాదాలు మార్మోగిపోయాయట. గత నవంబరులో సుప్రీం కోర్టు అయోధ్యలో వివాదాస్పద స్థలాన్ని హిందువులకు అప్పగిస్తూ తీర్పు ఇచ్చిన ఏడాదిలోపే నాటి విధ్వంసం కేసు కూడా కొట్టి వేయబడింది. అదే తీర్పులో సుప్రీం కోర్టు రామమందిర నిర్మాణానికి ట్రస్టు ఏర్పాటు చేయమని చెప్పడం ఆ ట్రస్టు ఆధ్వర్యంలో మందిర నిర్మాణం భూమిపూజలో ప్రధాని మోడీ పాల్గొనడం కూడా జరిగిపోయాయి. అయితే అదే తీర్పులో సుప్రీం కోర్టు బాబ్రీ విధ్వంసం అత్యంత దుర్మార్గమైన చర్య అని చట్ట ఉల్లంఘన అని విమర్శించింది. విహెచ్‌పిని ముందుంచి సాధు సంతు పిలుపు పై కరసేన అంటూ బిజెపి అగ్రనేతలు అక్కడకు తరలిపోవడం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని దేశమంతా భావించింది.

అప్పటి ప్రధాని పివి నరసింహారావు ఏ చర్యయినా తీసుకోవడానికి ప్రతిపక్షాలు కూడా ఎన్ఐసి సమావేశంలో అధికారమిచ్చాయి. అయోధ్య ఫైజాబాద్‌కు ప్రత్యేక దళాలు పెద్ద ఎత్తున తరలించబడ్డాయి. అయినా సరే జరగాల్సింది జరిగిపోయింది. దేశం అట్టుడికిపోవడమే గాక అంతర్జాతీయంగానూ విమర్శలు వచ్చాయి. అద్వానీ వంచించారని పివి అన్నారు గాని ఆయన కావాలనే ఉపేక్షించారని అప్పటి హోం మంత్రి ఎస్‌బి చవాన్ తమ జ్ఞాపకాలలో రాశారు. కూల్చివేత తర్వాత ఆలస్యంగా కళ్యాణ్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి ఎన్నికకు వెళితే ప్రజలు ఓడించారు. ఈ విధ్వంసానికి సంబంధించి గుర్తు తెలియని లక్షలాది కరసేవకులపై ఒక కేసు, బిజెపి, ఆరెస్సెస్, విహెచ్‌పి

హేమాహేమీలపై మరో కేసు సిబిఐ నమోదు చేసింది. తర్వాత వాటిని ఒకటిగా జత చేశారు.

మొత్తం 48 మందిపై అభియోగాలు చేయగా 16 మంది ఈ మధ్యలోనే మరణించారు. తమకు ఇచ్చిన మాట తప్పి కరసేవ శాంతి యుతంగా జరుగుతుందని చేసిన వాగ్దానం భంగపరచిందని యుపి మాజీ ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్‌కు కోర్టు హాలులోనే అంతకు ముందే ఒకరోజు శిక్ష విధించింది. కాని తర్వాత క్రమేణా బిజెపి పెరుగుదలకు అది కారణమై వాజ్‌పేయి మూడోప్రభుత్వం పాలన కొనసాగించింది. అద్వానీ హెూం మంత్రిగా అదే సిబిఐకి మార్గదర్శి అవడం ఒక చారిత్రిక విచిత్రం. ఆ దశలో ఆయనను మినహాయిస్తూ సిబిఐ ఒక అడుగు వేస్తే మరో మంత్రిగా వున్న మురళీ మనోహర్ జోషి రాజీనామా చేస్తానంటూ కలకలం రేపారు.

మరో దశలో కూల్చివేసిన కరసేవలను ఏమీ చేయ లేనప్పుడు ఈ ప్రముఖులకే శిక్ష వేయడం సరికాదని కోర్టు కొట్టి వేస్తే హైకోర్టు కూడా దాన్ని బలపరిస్తే సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని 2017లో వాటిని మళ్లీ పునరుద్ధరించేలా చేసింది. అయోధ్య తీర్పులో కూడా కూల్చివేతలను తీవ్ర పరిభాషలో ఖండించింది. అయితే ఈ తీర్పుతో అదంతా వృథా అయిపోయినట్టయింది. కుట్ర జరిగిందనడానికి సిబిఐ బలమైన ఆధారాలు సమర్పించ లేక పోయిందని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి అది దాఖలు చేసిన వీడియోలు స్పష్టంగా లేవని కొట్టి పారేశారు. కూల్చివేతకు తాము గర్వ పడుతున్నామని ఈ నాయకులంతా ప్రకటించిన వాస్తవం కూడా కోర్టు పట్టించు కోలేదు, మీడియా కథనాలపై ఆధారపడలేమన్నారు. మొత్తంపైన గజం మిథ్య పలాయనం మిథ్య అని తేల్చేశారు. దీనిపై తదుపరి అప్పీలుకు వెళ్లే విషయం చెప్పలేనని సిబిఐ న్యాయవాది లిత్ కుమార్ చెప్పడం యాదృచ్చికం కాదు. బహుశా అది సందేహాస్పదమే.

సహజంగానే ఈ తీర్పులను అద్వానీ స్వాగతించారు, జై శ్రీరాం అంటూ తన రామమందిర ఉద్యమం పట్ల తన విశ్వాసాన్ని ఇది బలోపేతం చేసిందన్నారు. ఈ తీర్పు రాగానే న్యాయశాఖామంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆయన నివాసానికి వెళ్లి మరీ అభినందించి వచ్చారు. మోడీ హయాంలో గ్రహణం పట్టిన అద్వానీకి ఇలా మళ్లీ ప్రచార యోగం పట్టిందన్న మాట, ఆరెస్సెస్ విహెచ్‌పి వంటి హిందూత్వ సంస్థలన్నీ ఘనంగా స్వాగతించాయి. ఇది సుప్రీం కోర్టు వైఖరికి భిన్నంగా వుంది గనక సిబిఐ ప్రభుత్వం పై కోర్టులో పిటిషన్ వేయాని కాంగ్రెస్ కోరింది. న్యాయాన్ని వమ్ము చేయడమే గాక భారత దేశ లౌకిక ప్రతిష్టకు భంగకరంగా వుందని సిపిఎం విమర్శించింది.

ముస్లిం సంస్థ నాయకుల్లో ఒకరిద్దరు హర్షం వెలిబుచ్చినా పై కోర్టులో అప్పీలు చేస్తామని ఎక్కువ మంది ప్రకటించారు. ఈ లోగా శాంతి భద్రత పరిరక్షణ కోసం కట్టుదిట్టం చేశారు. గత అనుభవాల రీత్యా రాజకీయపక్షాలు ప్రభుత్వాలు సంయమనం పాటించడం కీలకం. మరీ ముఖ్యంగా మత తత్వ సంస్థలు, ప్రయత్నాలు, కదలికల పట్ల అప్రమత్తంగా వుండాలి. కేసు ఓడిపోయిన సిబిఐ మరింత బలమైన వాదనతో ప్రత్యేక న్యాయస్థానం తీర్పులను సవాలు చేసి న్యాయం కోసం పోరాటం కొనసాగించాలి. ఉన్నత న్యాయవ్యవస్థ కూడా ఈ పరిణామాల మీద దృష్టి సారించాలి. ♦

## కవిత

# పాపం, రామా కనవేమిరా!

**- తెలకపల్లి రవి**

*ఈ దేశపు న్యాయ గుమ్మటం*
*దానికదే కూలిపోయింది*
*ఎవరూ కూల్చలేదు పాపం*

*ఈ జాతి లౌకిక తత్వం*
*దానికదే పేలిపోయింది*
*ఎవరూ మందుగుండు పెట్టలేదు పాపం*

*ఇక్కడి యుగయుగాల ధర్మం*
*దానికదే ధ్వంసమైంది*
*ఎవరూ పడగొట్టలేదు పాపం*

*ఈ శతాబ్ది మహా కుట్ర*
*దానికదే అమలైంది*
*ఎవరూ పథకం వేయలేదు పాపం*

*తరతరాల దేవుడు*
*కొత్తచోటా వుండలేక వెళ్లిపోతున్నాడు*
*ఎవరూ ఆపలేరు పాపం* ♦



# తెలుగు సాహిత్యంలో - ముస్లిం మైనారిటీ కవుల ప్రస్థానం

- డా. షేక్. ఇబ్రహీం
9533336227

గత రెండున్నర దశాబ్దాలుగా ముస్లింలు అనుభవిస్తున్న కష్టాలు, కన్నీళ్లు, సమస్యలు, ఆకలి, బాధలు మొదలైన వాటి నుండి విముక్తి కోరుతూ ముస్లిం కవులు పూర్తిగా తమదైన గొంతుకతో ముస్లిం మైనారిటీ వాద సాహిత్యాన్ని తెలుగులో బలంగా వ్యక్తపరిచారు. ముస్లిం మైనారిటీ వాద సాహిత్యం అంటే ముస్లిం జీవితంలోని విభిన్న పార్శ్వాలను వ్యక్తపరచడం. ఆ పార్శ్వాలు ముస్లింల బాహ్యమైన ప్రపంచానికి సంబంధించినవి కావొచ్చు.., అంతర్గతమైన ప్రపంచానికి సంబంధించినవి కావొచ్చు.

ప్రాచీన కాలంలోని ముస్లిం సాహితీ పరులు తెలుగు సంస్కృతితో, హిందూ జీవితంతో, పురాణాలతో మమేకమై ఉన్నారు. వారిలో షేక్ దావూద్, బుడన్ సాహెబ్, ఉమర్ అలీషా, ఖాసిం ఖాన్, అచుకట్ల చిన్న దస్తగిరి మొదలైనవారు రామాయణ మహాభారత కథలను పద్యకావ్యాలుగా రచించారు. అయితే వీళ్లలో కొందరిని తెలుగు సాహిత్య చరిత్ర గుర్తించింది. మరికొందరిని గుర్తించక అలానే మరుగున పడేసింది. అయితే 1992కు ముందే తెలుగు సాహిత్యానికి పరిచయమైన ప్రముఖ ముస్లిం కవులు, రచయితలు ముస్లింల జీవితాల్ని కవిత్వీకరించిన వారు లేకపోలేదు. వారిలో సుగమ్ బాబు, దేవిప్రియ, ఇక్బాల్ చంద్, ఇస్మాయిల్, వజీర్ రెహ్మాన్, స్మైల్, కౌముది, ఖాదర్ మొహియిద్దీన్, అఫ్సర్, యాకూబ్ మొదలైన వారు సాహిత్య సృజన చేశారు. అయితే ముస్లిం మైనారిటీవాద గొంతుక వినిపించింది మాత్రం 1992 తర్వాతనే. తెలుగు సాహిత్యంలో అడుగు పెట్టి సుమారు పాతిక సంవత్సరాల మైలురాయిని సొంతం చేసుకుంది.

తెలుగు సాహిత్యంలో ముస్లిం మైనార్టీ సాహిత్య ఆవిర్భావానికి కొన్ని ప్రధానమైన కారణాలను చెప్పవచ్చును.

- 1947 భారత్ పాకిస్తాన్ విభజన లోనే బీజాలు పడ్డాయి
- 1961 నుంచి 1989 వరకు దేశంలో పలుచోట్ల ముస్లిములపై జరిగిన దాడులు
- 1992 బాబ్రీ మసీదు సంఘటన
- 2002 గుజరాత్ సంఘటన
- 1994 కర్ణాటక వార్తల పై నిషేధం
- ఎం.ఎఫ్.హుస్సేన్ పై హిందుత్వ దాడులు
- తస్లీమా నస్రీన్‌పై ముస్లిం మత ఛాందసవాదుల ఆంక్షలు

అయితే 1947 నుంచి 1989 వరకు ముస్లింల పైన జరిగిన దాడుల గురించి ప్రతిస్పందనగా ప్రభుత్వాలు, సాహిత్యవేత్తలు పెద్దగా పట్టించుకోలేదు. 1992లో బాబ్రీ మసీదును కూల్చివేయడం ద్వారా దేశంలో మత విద్వేషాలను పురిగొల్పి ముస్లింల ఊచకోతకు నాంది పలికారు మత ఛాందసం కలిగిన హిందూ మత వాదులు. దేశవ్యాప్తంగా అప్పటి దాకా మాట్లాడని ముస్లిం మేధావులు, రచయితలంతా వారి ఐడెంటిటీతో ముస్లింలుగా మాట్లాడాల్సిన అవసరాన్ని గుర్తించారు. తెలుగు సాహిత్యంలోనూ అదే జరిగింది. అప్పుడే ముస్లిం మైనారిటీ వాద కవిత్వానికి బలమైన గొంతుక ఏర్పడింది. 2002 గుజరాత్‌లో ముస్లింల జాతి హత్యాకాండ జరిగింది. వేల మంది ముస్లింల ఊచకోత మళ్ళీ కొనసాగింది.

దానికి హిందుత్వ సంస్థలు, పార్టీలు నాయకత్వం వహించాయని మీడియా, పత్రికలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, రిపోర్టులు, పుస్తకాలు, కవిత్వం, కథలు, వ్యాసాల ద్వారా నమోదు చేశారు. ఈ విధంగా అప్పటి నుంచి తెలుగు సాహిత్యంలో ముస్లిం మైనారిటీ వాదం మరింత బలంగా విస్తరిల్లింది.

ముస్లిం మైనారిటీ వాదం తెలుగు సాహిత్యంలో బలంగా స్థిరపడడానికి 1992 నాటి ముస్లిం యువ కవులు తీవ్రమైన సాహిత్య కృషి చేశారు. అయితే వీరు తొలి రోజుల్లో దళితవాద కవులతో కలిసి కవిత్వాన్ని ప్రకటించారు. దళితవాద కవులు ప్రచురించిన చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట, విడి ఆకాశం, బహువచనం మొదలైన కవితా సంకలనాలలో ముస్లిం మైనారిటీవాద కవిత్వం కూడా చోటు చేసుకుంది. అంతేగానీ దళిత వాద కవిత్వంలో భాగంగా ముస్లిం మైనారిటీ వాద కవిత్వం, సాహిత్యం ఆవిర్భవించ లేదు. వీరిలో 1992 మునుపు తరానికి సంబంధించిన కవులు కూడా లేకపోలేదు.

ముస్లింవాద కవిత్వాన్ని రాసే కవుల్లో మరొక చీలిక ఏర్పడి ముస్లింవాదం, ఇస్లాం వాదం అనే రెండు పాయలుగా విడిపోయాయి. ఈ రెండుగా విడిపోయిన ముస్లిం, ఇస్లాంవాద ఇరువర్గాల ముస్లిం కవులు వారి ఆలోచన విధానం ఒకటే. కానీ ఒక్క మత ప్రతిపాదక విషయాల దగ్గర మాత్రమే విభేధాలున్నాయి. అయితే ప్రజల అస్తిత్వ విషయంలోనూ, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మూలాల అన్వేషణ, పరాయికరణ, అభద్రత మొదలైన భిన్నవిషయాల్లోనూ ఈ రెండు వర్గాలు ఏకాభిప్రాయంతో ఉన్నవారే. అయితే ఇస్లాం వాద కవులు సంప్రదాయకంగా వస్తున్న కొన్ని మతపరమైన విశ్వాసాలను ఆచారాలను సమర్థించడానికి ప్రయత్నించగా, ముస్లింవాద కవులు వాటిని కూడా సమీక్షించే ప్రయత్నం చేశారు.

తెలుగు సాహిత్యంలో మైనార్టీ కవుల ప్రస్థానం గురించి కొన్ని విషయాలు. ముస్లిం మైనార్టీ కవిత్వ సృష్టికి శంఖం పూరించిన తొలి ముస్లిం ఆదికవి ఖాదర్ మొహియిద్దీన్. కోట్లాది మంది భారత ముస్లింలలో దాగిన బాధను, గుక్క పట్టిన దుఃఖాన్ని 1991లో పుట్టుమచ్చ అనే దీర్ఘ కవిత రూపంలో వెల్లడించారు. ఆక్స్‌ఫర్డ్, విస్కాన్సిన్ విశ్వవిద్యాలయాలు ప్రచురించిన తెలుగు కవితా సంపుటాల్లో కూడా "పుట్టుమచ్చ" స్థానం సంపాదించింది. తెలుగు సాహిత్యం విస్మరించడానికి వీలులేని ఒక ప్రత్యేకమైన పేరు ఖాదర్ మొహియుద్దీన్. ఇండియాటుడే, తానా సంస్థలు వెయ్యేళ్ల తెలుగు కవిత్వంలో ఎంపిక చేసిన 100 ఉత్తమ రచనల్లో పుట్టుమచ్చ ఒకటి కావడం విశేషం. ఈయన 'భారత ముస్లింల ముఖచిత్రం' అనే మరొక రచనను కూడా ప్రచురించారు.

ఒక్క మైనార్టీ కవిత్వానికి మాత్రమే కాక తెలుగు సాహిత్యానికి సుపరిచితమైన పేరు అఫ్సర్. అఫ్సర్ చెప్పే అక్షరాల వెంట కళ్ళు కాదు మనసు పరిగెడుతున్నట్లు ఉంటుంది. అఫ్సర్ 'రక్తస్పర్శ', 'వలస', 'ఊరి చివర' అనే కవితా సంపుటాలను మరియు 'అనేక' కవితా సంకలనాన్ని కూడా ప్రచురించారు. అఫ్సర్ రాసిన నాకే జన్మభూమి లేదు, ఆజా, ముట్టడి మొదలైన కవితలు ముస్లింల అస్తిత్వాన్ని చాటిచెప్పాయి. 2019లో అఫ్సర్ 'సాహిల్ వస్తాడు' అనే రచనను వెలువరించారు. అలాంటి మరొక కవి, కవి సంగమ వారధి యాకూబ్. ఈయన రచించిన ఏ కవితని తీసుకున్నా ఆ కవితల్లో తాజాదనం ఉంటుంది. తొలితరం ముస్లిం కవి, గజల్ సాహిత్యాభిమాని, సూఫీ కవి యాకూబ్. 1992 లో ప్రవహించే జ్ఞాపకం, 2002లో సరిహద్దురేఖ, 2010లో ఎడతెగని ప్రయాణం మొదలైన కవితా సంపుటాలను వెలువరించారు. 2002లో గుజరాత్ గాయం పేరుతో 200 మంది కవులతో కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఈయన కవిత్వం ఇంగ్లీషు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడం భాషల్లోకి అనువాదమైంది. యాకూబ్ కవిత్వాన్ని కొన్ని విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టి అధ్యయనం చేస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో షేక్ కరీముల్లా 'సాయిబు' అనే దీర్ఘ కవితను 2004లో ప్రచురించారు. ఇదే ఇస్లాంవాద కవిత్వంగా రూపుదిద్దబడింది. ఈ ఇస్లాంవాద కవిత్వానికి ఆద్యుడు షేక్ కరిముల్లా. అయితే తర్వాతి కాలంలో ఈ ఇస్లాం వాదం ప్రగతిశీల ముస్లిం కవిత్వంగా రూపుదిద్దబడింది. అనతి కాలంలోనే అనేక మంది కవుల్ని సమీకరించుకుంది. ఈయన గాయ సముద్రం (1999), ఆయుధాలు మొలుస్తున్నాయి (2000), నా రక్తం కారు చౌక, ఘా (2002), ఈద్ ముబారక్ (2008), ఈద్ ముబారక్ (2016) అనే కవితా సంపుటాలను వెలువరించారు. ఖిబ్లా (2006), కవాతు(2008) అనే కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించారు. ఆ క్రమంలోనే సయ్యద్ సాబిర్ హుస్సేన్ నిప్పు, జంగ్, ఒక దేశద్రోహి ప్రేమకథ అనే కవితా సంపుటాలను ప్రచురించారు. ఈయన కవిత్వం అన్ని రకాల మత ఛాందస వాదాల్ని, మత

తీవ్రవాదాల్ని, మతోన్మాదాల్ని వ్యతిరేకిస్తూ మత సామరస్యాన్ని కోరుకుంటుంది.

ముస్లిం వాదానికి ఒక బలమైన గొంతుక స్కైబాబ. తెలుగు సాహిత్యంలో గత రెండు దశాబ్దాలుగా వినిపిస్తున్న పేరు. ముస్లిం వాదం అనే ఒక ఎజెండాను పట్టుకున్న వ్యక్తి. ముస్లింలు ఏ ఏ విషయాల మీద స్పందించాలో ఆయా విషయాల మీద స్పందించిన వ్యక్తి స్కైబాబ. ఈయన జల్ జలా(1998) సంకలనం నుంచి స్కైబాబ తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. ఈయన అజాఉ (2002), జగ్ నేకీ రాత్ (2005), అలావా (2006), రజ్మియా(2012), జఖ్మీ అవాజ్ (2012), ముఖామి(2018) మొదలైన కవితా సంకలనాలు, సంపుటాలు వెలువరించారు.

ముస్లింవాద కవిత్వంలో నికార్సయిన గొంతుకను వినిపించిన వారిలో కవి డా.ఖాజా మొదటి వరుసలో ఉంటారు. ఈయన 1998లో 'ఫత్వా' అనే మొదటి ముస్లింవాద కవితా సంపుటిని ప్రచురించారు. ముస్లిం తాత్విక అంశాలకు సంబంధించిన దాదాపు అన్ని అంశాలను వస్తువులుగా పరిచయం చేసి వెలువడిన మొదటి కవితాసంపుటిగా 'ఫత్వా'ను చెప్పవచ్చును. ఫత్వా ముస్లింల జీవితాలకు సంబంధించిన ఒడిదుడుకులనే కాక అంతర్గతమైన లోపాలను కూడా బయటపెట్టింది. ముస్లిం స్త్రీవాదానికి సంబంధించిన పలు కవితలు మొదటగా ఈ ఫత్వా కవితా సంపుటిలోనే వెలువడ్డాయి. మొదట ముస్లిం స్త్రీవాద గొంతుకను ఫత్వాలోనే చూడవచ్చు. వివిధ పత్రికలలో ఈ పుస్తకంపై సుదీర్ఘకాలం చర్చ జరిగింది. దాదాపు వందకు పైగా ఫత్వా పై విమర్శనాత్మక చర్చల రూపంలో వ్యాసాలు వచ్చాయి. ఈయన 'మూసి ఆవాజ్' అనే దీర్ఘ కవితను కూడా రాసారు. సంచలనాత్మకమైన తొలితరం ముస్లింవాద కథలకు రూపం ఇచ్చిన వ్యక్తి కవి ఖాజా. ఈయన రచించిన కవిత్వం ఈయనే తను చదువుకునే రోజుల్లో M.A సిలబస్‌లో తానే చదువుకున్నాడు. ఇది చాలా అరుదైన ఘటన.

అట్టడుగు ముస్లిం జీవితాలను కవిత్వంలో యధాతథంగా చిత్రించిన మరొక కవి అలీ. ఈయన పాన్ మరక, జఖమ్, తమన్నా, గర్జన అనే కవితా సంపుటాలను వెలువరించారు. ఈయన 'హరేక్ మాల్' అనే కథా సంపుటిని కూడా ప్రచురించారు. ఈయన అసలు పేరు మహమ్మద్ హనీఫ్. తెలుగు సాహిత్యంలో అలీ పేరు చెప్పగానే ప్రతీ ఒక్కరికి గుర్తుకు వచ్చేది 'పాన్ మరక' కవిత. ఇది ఇంగ్లీషు, హిందీ భాషల్లోకి కూడా తర్జుమా అయింది. ఈ మధ్యనే గుండెపోటుతో ఈ కవి సాహితీ లోకాన్ని విడిచారు.

ముస్లీం మైనారిటీవాద కవిత్వంలో మరొక ప్రధాన కవి ఇక్బాల్ చంద్. ఖాదర్ మొహియుద్దీన్ పుట్టుమచ్చ కవితా ఖండిక ద్వారా సాహితీలోకానికి ఎలా సుపరిచితులో, ఇక్బాల్ చంద్ ఆరోవర్ణం కవితా సంపుటి ద్వారా అంత సుపరిచితమయ్యారు. దీనిని 2001లో ప్రచురించారు. బ్లాక్ వాయిస్, చూస్తుండు అనే కవితలు కూడా రాశారు. ఇక్బాల్‌చంద్ కవితల్లో ముస్లింల అస్తిత్వ, మూలాలకు సంబంధించిన కోణాలే ఎక్కువగా ఉన్నాయి. మరొక పిడికిలి బిగువులాంటి కవి అన్వర్. ఈయన తలవంచని ఆరణ్యం, ముర్తీ అనే కవితా సంపుటాలను ప్రచురించారు. ఈయన బక్రీ అనే కథా సంపుటిని కూడా వెలువరించారు. బక్రీ అనగా మేకపిల్ల అని అర్థం. ఇందులో ముఖ్యంగా మతాల మధ్యనున్న అసమానతలు తొలగించి మనుషుల మధ్యనున్న ముళ్లకంచెలను తొలగించి మత సామరస్యం కోసం ఆరాటపడే తత్వం ఈ కథల్లో చూడవచ్చును. ఈ సంపుటికి శశిశ్రీ పురస్కారం కూడా లభించింది. ప్రగతిశీల ముస్లిం భావజాలంతో పదునుగా కవిత్వాన్ని రాసే మరో యువకవి పఠాన్ రసూల్ ఖాన్. ప్రగతిశీల ముస్లిం అనే ఐడియాలజీతో కవిత్వాన్ని రాసే యువకెరటం ఈ రసూల్ ఖాన్.

మరొక బలమైన గొంతుకను కలిగిన కవి బారహంతుల్లా. ఈయన 2007లో "పీపల్ మే నీమ్" అనే కవితా సంపుటిని ప్రచురించారు. పీపల్ అంటే రావి, నీమ్ అంటే వేప అని అర్థం. రావి, వేప అనే రెండు చెట్లను రెండు మతాలకు ప్రతీకలుగా చేసి ఆ రెండు చెట్ల పేర్లనే శీర్షికగా మలిచి ఈ సంపుటికి "పీపల్ మే నీమ్" అని పేరు పెట్టి తనలో దాగిన వ్యక్తిత్వాన్ని, భిన్నత్వాన్ని చాటిన కవి బారహంతుల్లా. ఈ కవితా సంపుటి ద్వారా హిందూ, ముస్లిం ఐక్యతను, ప్రేమను సాధించడానికి కృషి చేశాడు. ఈ కవితా సంపుటిలోని పీపల్ మే నీమ్ అనే కవితకు అమెరికా భారతి కవితా పోటీలలో ద్వితీయ బహుమతి లభించింది. ఈ రావి, వేపలను హిందూ–ముస్లిం భాయి భాయి అనే విధంగా మలిచిన గొప్ప అభివ్యక్తి ఉన్న కవి.

తెలుగు సాహిత్యంలో గొప్ప రచనలు రాసిన వ్యక్తి దిలావర్. ఈయన ముస్లింల, దూదేకుల జీవితాలకు సంబంధించిన కొన్ని కవితలే రాసినా, రాసినవన్ని బలమైన కవితలే. బలమైన కవితా వస్తువులే.. త్రిశూలనొప్పి, నాకుచెప్పొస్తలేదు, ఖసాబ్, న ఘర్ కా నఘాట్ కా, పీర్లపెట్టె

అనే కవితలను రాసిన వ్యక్తి, సౌమ్య స్వభావం కలిగిన కవి దిలావర్. గొప్ప చిత్రకారుడు అక్బర్. ఈయన ఎన్నో రచనలకు, ఎన్నో పత్రికలకు ఆ వస్తువుకు తగ్గ గొప్ప చిత్రాల్ని గీసిన వ్యక్తి. తెలుగు సాహితీలోకంలో అక్బర్ బొమ్మలకు ఒక క్రేజ్ఉంది. ఈయన గునాహ్, చచ్చిన మిత్రునికోపత్తరం, వొకటికానీ ఓటికుండలు మొదలగు కవితలు ముస్లిం జీవన స్థితిగతులకు అద్దం పడుతాయి.

తెలుగు సాహిత్య విమర్శను, కవులు రాసిన కవిత్వాన్ని, ఇతర రచనలను ఎల్లప్పుడూ సామాజిక మాధ్యమాల్లో పరిచయం చేసే నిత్య విమర్శకుడు ఎ.రాజా హుస్సేన్ గారు. ఈయన ఎంతోమంది యువకవులను ప్రోత్సహిస్తూ తెలుగు సాహిత్య లోకానికి పరిచయం చేశారు. రాజా హుస్సేన్ పేరులోని మొదటి పదం హిందూ మతానికి ప్రతీకగా, రెండవ పదం ఇస్లాం మతానికి ప్రతీకగా చెప్పవచ్చును. ఈ భిన్నత్వంలో నుంచే 2006లో "తిరంగా ముసల్మాన్" 14 కవితలతో కవితా సంపుటిని వెలువరించాడు. ఇందులోని ప్రతీ కవితా పాఠకునిలోని సహృదయతను వెలికితీస్తుంది.

తెలుగు సాహిత్యంలో కవిత్వ పరంగా ముస్లిం జీవన స్థితిగతులను చిత్రిస్తూ "మైనారిటీ కవిత్వం – తాత్విక నేపథ్యం" అనే పరిశోధన గ్రంధాన్ని రచించిన వ్యక్తి డా.షమీఉల్లా. ఈయన 2011లో సూర్యోదయానంతరం అనే కవితా సంపుటిని కూడా ప్రచురించారు. ఈ కవితా సంపుటికి స్పందన సాహితీ పీఠం వారి బెస్ట్ పోయెట్రీ అవార్డు కూడా లభించింది. సామాజిక నేపథ్యంలో సుభాషిత ప్రభాసం అనే సంస్కృత వ్యాఖ్యానాన్ని కూడా రాయడం జరిగింది. అత్తరు వాసన, అత్తరు సాయిబు, విశ్వాస ప్రశ్న, వాంగ్మూలం వంటి కవితలు షమీఉల్లా పేరు చెప్పగానే గుర్తుకొస్తాయి.

నిబద్ధతకు నిలువుటద్దమైన కవి మహమూద్. పూర్తి పేరు షేక్. పీర్లా మహమూద్. ఇప్పటి వరకు ప్రస్తావించిన కవులకు, ఈయనకు చాలా తేడా కన్పిస్తుంది. కవితా సంపుటాలు, కవితా సంకలనాలు ప్రచురించిన కవుల కంటే కూడా ఎక్కువగా కవిత్వాన్ని రాసిన వ్యక్తి. ఈయన దాదాపుగా 300కు పైగా కవితలు రాశారు. ఈయన రాసిన కవితలు చాలా వరకు అరుణతార, సారంగ, ఆంధ్రజ్యోతి మాస, దిన పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఈయన రాసిన కవిత్వంలో డెబ్భైకి పైగా ముస్లిం జీవితాలను చిత్రించే కవితలున్నాయి. కవిత్వ రూపంలో పుస్తకమై ప్రచురణలో ఉన్న కవులకు ఏ మాత్రం తీసిపోని కవి మహమూద్. ఈయన పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే కవితలు సూఫీ చందమామ, ఏక్ మాసుమ్ ఖత్, జనాజా, నెత్తుటి బిడ్డలు అనే కవితలను చెప్పవచ్చును. ఈయన మైనారిటీ జీవితాలను గురించి రాసిన కవితలన్నీ పుస్తక రూపంలో వస్తే మరింత ముస్లిం మైనారిటీ సాహిత్యం తెలుగు సాహిత్యంలో రికార్డు అవుతుంది.

కడపజిల్లా పోరుమామిళ్ల ప్రాంతానికి చెంది కవి, సామాజిక ఉద్యమకారుడు షేక్.సికిందర్. ఈయన దాదాపుగా వందకు పైగా కవితలు రాశారు. సికిందర్ కవిత్వమంతా ప్రధానంగా మానవతావాదం, చైతన్యవాదంతో సామాజిక రుగ్మతలను రూపుమాపే విధమైన తత్వం కనబడుతుంది. అదే పనిగా మైనారిటీ జీవితాలను రాయలేదు. సామాజిక బాధ్యతో అవసరమైనప్పుడు ఏ వర్గమైన అన్యాయానికి గురవుతున్నప్పుడు రాసిన కవితలను పరిశీలిస్తే ముస్లిం మైనారిటీల వస్తువు ఉన్న కవితలు మనకు కొన్ని కన్పిస్తాయి. అవి దేవుళ్ళు మీకో దండం, ఎవడ్రా నువ్వు, సమైక్యంగా కదలండి, మను విధ్వంసాలయాలు అనే కవితల్లో మైనారిటీవాద ఛాయలు కన్పిస్తాయి. సికిందర్ ఈ మధ్య కాలంలో "షహనాయి" అనే ఒక కొత్త సాహిత్య ప్రక్రియతో ప్రేమను వస్తువుగా తీసుకుని వందకుపైగా షహనాయిలు రాసారు.

అయితే ఇప్పటి వరకు కేవలం కవితా సంపుటాలు, సంకలనాలు వెలువరించిన కవుల గురించి మాత్రమే ప్రస్తావించాము. కేవలం కవితా సంకలనాల్లో, మాస పత్రికల్లో రచనలు వెలువరించిన వారికన్నా బలమైన కవిత్వాన్ని రాసి ఒక స్థిరమైన రచన రూపంలో నోచుకోని కవుల గురించి కూడా తెలుసుకుంటే సబబుగా ఉంటుంది. గౌస్ మొహియుద్దీన్ ఖౌమి, ట్రిగ్గర్ మరియు కాషాయము జరూరతె రిష్త, మాదర్చోది, జల్వా, కాష్టం మొదలైన కవితలను వెలువరించారు. ఈ కవితల్లో ముఖ్యంగా అధిపత్య హిందూత్వ దాడులను తిప్పికొట్టిన విధానం ఆవిష్కరించబడింది. అదురు బెదురులేని కవిత్వాన్ని ప్రకటించిన వారిలో గౌస్ మొహియుద్దీన్ ఒకరు. మరొక కవి ఖదీర్. ఈయన పిశాని, కరీంభాయ్ అనే కవితల్లో ముస్లింల ఆర్థిక జీవితాన్ని చిత్రించాడు. హనీఫ్ అనే మరో కవి వందేళ్ల కాపురాలు కావాలి, చందమామ పోవే, తెగిన ఎక్ తార, ముస్లిం, మెహర్ మొదలగు కవితల్లో స్త్రీ అభ్యున్నతిని ఎక్కువగా కాంక్షిస్తూ వాస్తవాల్ని కవిత్వీకరించాడు. ముస్లిం జీవితాలను బలంగా వ్యక్తీకరించిన మరొక కవి నబి.కె.ఖాన్ చౌరస్తాలో ఛోటే సాహెబ్, అమ్మిజాన్ అల్ విదా అనే కవితలను రాశారు. మొదటి కవితలో ఆర్థిక జీవితాన్ని

ప్రస్తావిస్తే, రెండవ కవితలో మక్కా మసీదులో బాంబు పేలుళ్లలో 6మంది, కాల్పుల్లో 9మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఖండిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు. నబికెఖాన్ నిషిద్ధాక్షరాలు, వేకువకోసం అనే రెండు కవితా సంపుటాలను వెలువరించారు. ఈయన గత రెండు దశాబ్దాల నుండి ముస్లిం జీవితాలను కవిత్వీకరిస్తునే ఉన్నాడు. ఈయన చాలా కవితలు కన్నడంలోకి కూడా అనువాదమయ్యాయి.

మరొక ముస్లిం కవి నేనే సాయిబును, ఇంతెజార్, మద్దెల ముందు రోలు అనే కవితలను వేంపల్లె షరీఫ్ రాశారు. ఈయన రచించిన జుమ్మా అనే కథా సంపుటికి కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. మరోక కవి టి.యం.డి రఫీ. ఈయన నేను ఓ.సి నెట్లయితినే, అమ్మీజాన్ చద్దర్, ఫిర్ మిలింగే లాంటి కవితల్లో ముస్లిం జీవితాలను చిత్రించాడు. రఫీ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వేంపల్లె షరీఫ్ కథలపై ఎం.ఫిల్, పిహెచ్‌డి చేసారు. మక్కా మీనార్ పై ఎండుటాకు, వాన పాముల్నే పట్టాలి అనే కవితలను సికిందర్ రాశారు. ఈ కవితలు ప్రధానంగా మతాన్ని సంస్కరిస్తూ వచ్చినవి. ఆడవారికి కూడా మసీదుల్లో ప్రార్థన చేసే సమాన హక్కు ఉందంటూ రాసిన మొదటి ముస్లిం కవి సికిందర్.

రెవల్యూషన్ భావజాలంతో కవితలను రాసిన వ్యక్తి సయ్యద్ గఫార్. ఈయన గ్యాన్ చౌసర్, అంగట్లో దొరికే కుంకుమ కాదు దేశభక్తి, మోమిన్ భాయియో, జనన వాంగ్మూలం, సూర్యుని కవచంలా చుట్టుకొని మొదలైన కవితలు వివిధ మైనారిటీ కవితా సంకలనాలలో ప్రచురితమయ్యాయి. ఈయన కవిత్వంలో ఆక్రోశం ఎక్కువ. సాధారణంగా ఎక్కడైనా దాదాపుగా కవిత్వాన్ని రాసేకవులలో ఆక్రోశం ఎక్కువైనప్పుడు ఆలోచన తగ్గుతుంది. కానీ గఫార్ కవిత్వంలో ఆక్రోశం పెరిగేకొద్ది వాస్తవాలు సమాజం ముందు ఆవిష్కరించబడుతాయి.

ముస్లింల జీవితాలను బలంగా వ్యక్తీకరించి మరొక కవి అబ్బాస్. ఈయన నిప్పుల గుండం, నెత్తుటి అంకం, అత్తరు కంపు, బహిరంగ ప్రకటన, కలోసియం అనే కవితలు రాశారు. ముస్లింల అస్తిత్వాన్ని సయ్యద్ ఖర్షీద్ 'వతన్' అనే కవితలో బలంగా వ్యక్త పరిచాడు. ఈయన సవాల్ అనే మరొక కవితను కూడా రాశారు. మంచి మనసున్న కవి ఖాదర్ షరీఫ్. ఈయన మేరీదునియా, తలుపు తట్టబడే చప్పుడు కోసం, బిస్మిల్లా, నా శవాన్ని నేనే భుజాన మోస్కుంటా అనే కవితలు రాసిన కవి ఖాదర్ షరీఫ్.

ప్రస్తుతం ముస్లింల జీవితాలను రాస్తున్న యువకవి డా.షేక్. ఇబ్రహీం. ఈయన రాసిన కవితలన్నిటిని "నేను మనిషిని" అనే శీర్షికతో కవితా సంపుటిని త్వరలో రానుంది. ఈయన హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ కవి ఖాజా ఫత్వా కవితా సంపుటిపై " ఖాజా ఫత్వా ముస్లింవాద దృక్పథం" అనే అంశంపై పరిశోధన చేసి 2012లో ఎంఫిల్ పట్టా పొందారు. ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ పర్యవేక్షణలో "ముస్లిం మైనారిటీవాద కవిత్వం వస్తు, శిల్ప సమాలోచన" అనే అంశంపై పరిశోధన చేసి 2017లో పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథంలో ముస్లిం, ఇస్లాం వాద కవులు వెలువరించిన కవిత్వాన్ని సంపూర్ణంగా పరిశోధించడం జరిగింది. ఈయనకు పేరు తెచ్చిన కవితలు బతుకు ప్రయాణం, నిజం చేద్దామా, పదునైన ద్రావిడ గుండె, ఆనవాలు మొదలైన కవితలు చెప్పవచ్చును.

ఒకటి, రెండు కవితలు రాసిన కొంతమంది కవులు రాసిన కవిత్వం అక్కడక్కడా కొన్ని కవితా సంకలనాలలో చోటుచేసుకుంది. ఆల్ ఫతా – నేనే మూలవాసిని, నాదిద్రావిడజాతి, అఫ్రీన్–చమన్, ఎన్నెస్ ఖలందర్ – సంతకం, చార్ దిన్ కీ దుల్హన్, దీవారే మొదలగు కవితల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాల్లో ముస్లింజీవితాలను చిత్రించారు. బాజి– అనాధ, మిలాద్ అనే కవితలు, షేక్ పీరా ఉ – మై బోరేవాలా, అక్కంపేట ఇబ్రహీం– హిందూత్వం అంటే ఏందీ సామి, ముచ్చర్ల ఇబ్రహీం– మత వ్యాపారం, రహంతుల్లా కాఅలం, జనోసైడ్, భాయిభాయి యస్.ఏ అజీద్ – నేను ముస్లింనే, శతాబ్దాల సాక్షిగా, అద్దెబతుకు మొదలగు కవితలు కూడా మైనారిటీ సంకలనాలలో చోటు చేసుకున్నాయి.

ముస్లిం స్త్రీవాదం కవిత్వం పేరు చెప్పగానే సాహిత్య లోకంలో ప్రతీ నోటా వినబడే పేరు డా.షాజహానా. తొలిరోజుల్లో ముస్లిం స్త్రీవాద కవిత్వం పురుష గొంతులో విన్పించినప్పటికీ, ముస్లిం స్త్రీవాద కవిత్వానికి ప్రతినిధిగా షాజహానానే చెప్పాలి. ఎందుకంటే ఎక్కువ భాగం ముస్లిం స్త్రీలు పడుతున్న సమస్యలపై ప్రతి స్పందించడమే కాకుండా వారి సమస్యలను, వారి దీన గాథలను బయటి ప్రపంచానికి తెలియజేసింది. అంతర్గతంగా, బహిర్గతంగా ముస్లిం స్త్రీలకు సంబంధించిన ప్రతి విషయాన్ని కూడా బట్టబయలు చేసి మత ఛాందసవాదుల డొల్లతనాన్ని బద్దలుకొట్టింది. ముస్లిం స్త్రీవాద కవిత్వానికి ఒక వేగు చుక్కగా షాజహానాను

## కవిత

# ఖాళీలను పూరించడానికి...

- దిలీప్. వి
8464030808

కవిత్వం చిటికెలు, చప్పట్లు చరిపించుకోవడానికి కాదు
సాహిత్యం సత్కారాలు సన్మానాల కోసం కాదు

అంటరాని బ్రతుకుల ఆవేదనను
అణగారిన వర్గాల ఆక్రోశాన్ని
పేద వారి వెతలను
బడుగు బలహీన వర్గాల బాధలను
'సిరా' సుక్కలుగా మార్చి
కళ్ళు మూసినట్టుగా నటించే నాయకుల
కనుల ముందు వాస్తవాల వెలుగులు పరుచడానికి
ఆకలి దప్పులు లేవని
జాతి మత కుల లింగ వివక్షలు లేవని

పుచ్చు మాటలు పలికే చచ్చు మూకల పై
అక్ష"రాళ్ళెత్తి" దండ యాత్రలు చేయడానికి

కవిత్వం, సాహిత్యం
సమత, సౌభ్రాతృత్వం
స్వేచ్ఛా, స్వాతంత్రం సాధించడానికి
జీవితంలో ఖాళీలను పూరించడానికి ♦

చెప్పవచ్చును. 2005వ సంవత్సరంలో "నఖాబ్" అనే కవితా సంపుటిని వెలువరించింది. ఈ నఖాబ్ కవితా సంపుటి ముస్లిం సమాజంలోని స్త్రీలకు జరుగుతున్న అణిచివేతలను పలు కోణాల్లో ప్రశ్నించింది. ఆ తర్వాత 2012లో "దర్దీ" అనే మరొక కవితా సంపుటిని కూడా ప్రచురించింది. ఈమె పేరు చెప్పగానే గుర్తుకొచ్చే కవిత పర్దా హటాకే దేఖో.

మరొక ముస్లిం స్త్రీవాద కవయిత్రి షంషాద్ బేగం. ఈమె 2014లో " ఈ కిటికీ తెరుచుకునేది ఊహల్లోకే" అనే కవితా సంపుటిని వెలువరించింది. ఇందులోని ప్రతీ కవిత ముస్లిం స్త్రీల ఆశలకు వెలుగులా ప్రకాశిస్తాయి. మతం ముసుగులో పురుషాధిపత్యం చూపే ఆగడాలను నిలదీసింది. షంషాద్ బేగం పేరు చెప్పగానే గుర్తుకొచ్చేకవిత 'పర్సనల్ లా'. ఈ కవిత ముస్లిం మత ఆచారాలను బద్దలు కొట్టింది. ప్రస్తుతం ముస్లిం స్త్రీవాద కవిత్వాన్ని చురుగ్గా రాసే కవయిత్రి నస్రీన్ ఖాన్. ఈమె 2014 నుండి 2019వరకు రాసిన కవితల్లో 56 కవితలతో "జఖ్మీ" అనే కవితా సంపుటిని ప్రచురించింది. సిల్ సిలా, మూలవాసీ చెట్టు, మౌలీ సాబ్, తాలీమ్ మొదలగు కవితలు నస్రీన్ ఖాన్‌కి బాగా ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టాయి.

పైన ప్రస్తావించిన ముగ్గురు కవయిత్రులే పుస్తక రూపంలో కవిత్వాన్ని వెలువరించింది. కొంతమంది కవయిత్రులు కవితా సంకలనాలలో ముస్లిం జీవితాలను ప్రజంట్ చేస్తూ ఒకటో, రెండో కవితలు రాసినవారు లేకపోలేదు. వారిలో షెహనాజ్ – బట్టెబాజ్, వాజిదా ఖాతున్ – పర్దా, షెహనాజ్ ఫాతిమా – ఔరత్, జవేరియా – ముస్లిం వనిత, మున్వరున్నిసా – గుడియా, ఆసిఫా కౌసర్ – రాజ్యవృక్షం, మహెజబీన్ – యుద్ధం, ఖిల్వత్, ఖాలిదా పర్వీన్ – స్వేచ్ఛ ముసుగులో, షరీఫా – కౌన్ రే వో, నాకో చిన్న అనుమానం, షహనాజ్ – ఉగ్రవాదం నశించాలి, ఇప్పుడు నెనొక్కత్తినే, రుబినా పర్వీన్ – భయం గుప్పిట్లో, షాహీన్ బేగం – శాంతి నినాదం, బేగం గౌసియా రహిమూన్ – దువా మొదలగు కవితల్లో ముస్లిం కవయిత్రులు ముస్లిం స్త్రీల అణచివేతను, వివక్షను ప్రశ్నిస్తూ ముస్లిం స్త్రీల అభ్యున్నతికి మార్గం చూపేలా కవిత్వీకరించారు.

కేవలం కవిత్వ పరంగా మాత్రమే గాక సత్యాగ్ని, శశిశ్రీ, సయ్యద్ సలీం, బారహంతుల్లా, డానీ, మహమ్మద్ ఖదీర్‌బాబు, వేంపల్లె షరీఫ్, షెహనాజ్, దిలావర్, షాజహానా, స్కైబాబ మొదలగువారు ముస్లిం జీవితాలను కథలుగా మలిచారు. 1987లో ఉదయం పత్రికలో డానీ 'సాహిత్యంలో మతతత్వం' అనే విమర్శనాత్మక వ్యాసం వచ్చింది. ప్రొఫెసర్ షేక్ మస్తాన్ వలి తెలుగు సాహిత్యంలో ముస్లింలసేవ అనే తొలిపరిశోధనా గ్రంథాన్ని వెలువరించారు. ఈ గ్రంథం ముస్లిం సాహిత్యానికి ఒక మైలురాయి వంటిదని చెప్పవచ్చు.

ఈ వ్యాసంలో కేవలం ముస్లిం మైనారిటీ కవిత్వాన్ని వెలువరించిన కవులను, కవయిత్రులను మాత్రమే ప్రస్తావించాను. ♦

## కవిత

# ముసురు

- ప్రొ. బొంతా విద్యాధర్
9542010230



నులక మంచాల ముసుగుని
దుప్పటి ముసుగులో తన్ని
కిర్రు చప్పుళ్లతో
ముసలవ్వల బోసి ముఖాన
నర్మగర్భ పూలు
నవ్వులుగా పూయించిన
కొత్తజంటల
ముసురు ... ముసుగుదన్నేదెపుడో !
తడిసిన కుంపట్లతో
వాన గుంతలాడుతున్న పిడకలతో
ఉసూరు మంటున్న
కూలి బతుకు గంపలతో
నీరోడుతున్న పసికడుపుల
చూపులతో
మూల్గుతున్న కుక్కి మంచపు ఆశలతో
గుడిసెలనేలుతున్న ఓటికుండ రక్కసి
గాన భజంత్రులతో మురిసిపోతున్న
ముసురు ... ముసుగుదన్నేదెపుడో !
తొలి చినుకు తెచ్చిన
తొలకరి వలపు గాలి
ధరణీ పుత్రుల మేనుపై
చక్కలి గింతల దుక్కిచేసి
విత్తకయే పండుటాకులను
తనువెల్ల మొలిపించి మురిపించెను,
గానీ ...
కన్నీటి కాల్వల గండి
చెట్లను చెరువులను
పుట్లను గట్లను ఏకంచేసి
కడుపుకోతను పొలం గట్లతో కోసి
ఇసుకమేటను పెరటి గాదెలలో నింపి
మరో మిత్తిని
హలధరుల నెత్తిమీద కెత్తిన
ముసురు ... ముసుగుదన్నేదెపుడో !

# తీగెల మీది జీవితం

- మహమూద్
9441027462



తూకం ఎంత సరిగ్గా ఉండాలో?
అడుగు ఎంత జాగ్రత్తగా పడాలో?
లోతుల్లోకి తొంగి చూస్తూ
అగ్నితీగెల మీద నడుస్తూ
అగాధాలను దాటే పాదాలవి
ప్రాణాలు జారిపడే లోతుల గురించసలు
పట్టింపులేని జీవితాలివి
పట్టుకోసం ఒకరి చేయి ఇంకొకరికి తప్ప
ఆధారం శూన్యం
ఒకరి వెనుక ఒకరు నడుస్తున్నారన్న జ్ఞానం తోడుగా
పాదానికి కంటికి మధ్య చూపొక వారధి
నడకకు చూపే సారథి
దొమ్ముధైర్యమే కష్టజీవి కదలికకు బలం
నిజానికి ప్రతి ఘడియవాడికో పరీక్ష
బతికి బట్టకట్టే ఉత్తీర్ణత ఎంత?
పనిలోకి దిగడానికీ
పని ముగింపు సమయానికి మధ్య
విస్తారంగా పరుచుకున్న ప్రమాదాల మధ్య
ప్రాణసంకట క్షణాలను ఊరడిస్తూ
ఉగ్గబట్టుకొన్న ఊపిర్లని
ఇంటిదాకా తిరిగి మోసుకురావడం గొప్ప కార్యం
ఆయుధం పట్టి ప్రత్యక్ష యుద్ధంలో
పాల్గొనడం కంటే బలీయం
పొలంలో పన్జేస్తున్నపుడు కూలీలపై విరిగిపడే
మెరుపుతీగెల గురించి ఎవరికి తెలుసు?
ఫ్యాక్టరీల యంత్రాల మధ్య పడి
నలిగే దేహాల గురించెవరికి తెలుసు?
గొట్టాల్లోంచి పొగలాగా ఆవిరౌతున్నది
ఏ కార్మికుడి ఊపిరో ఎవరికి తెలుసు?
మేన్ హోల్‌లో పేరుకున్న మన అశుద్ధాన్ని
శుభ్రపరచే దళిత బతుకుతెరువుకు
దుర్వాసనే శ్వాసనిశ్వాసని గుర్తెరగని చరిత్ర మనది
ఈ దేహాలు కత్తులను రెక్కలుగా తొడిగే దాకా
మార్మిక తీగెల మీద సాగుతున్న
ఈ బతుకుకు భరోసా లేదు...
రూపసారాల్లేని మరణానికి
చిరునామాలుగా మెలగడం
కాదు...
మరణాన్ని దరిదాపుల నుంచి
తరమడానికి సంఘటితం కావాలిపుడు..

విశ్లేషణ

# ధర్మాగ్రహ సాహిత్య రూపం - నాగులకట్ట సుద్దులు



డా॥ శాంతినారాయణ



- డా॥ లిఖిత్
9441139652

లక్షమంది సైన్యానికి భయపడను గాని ఒక్క వార్తకు కంపించి పోతానని వెనకటికి జగజ్జేత అలెగ్జాండర్ అన్నాడట. ప్రచురించిన వార్త బయటికెళ్ళి పోయిందంటేచాలు పలువిధాలయిన ప్రకంపనలు అది సృష్టిస్తుంది. రిజాయిండర్ (సవరణ వార్త) వచ్చినా ప్రజలు నమ్మరు. వచ్చిన రిజాయిండర్‌పై కూడా పలువిధాలైన పరస్పర వ్యతిరేకమైన చర్చలు కొనసాగుతాయి. అంటే వార్తకు సమాజంలో వుండిన ప్రాధాన్యత విశేషమైనది, విశిష్టమైనది కూడా.

రాజకీయ నాయకులకు, వారి అనుయాయులకు డా॥ శాంతినారాయణ గారి నాగలకట్ట సుద్దులు కింగ్ కోబ్రా లాగా కాటేయాలి కాని వారివి మొద్దుబారిన మనసులు, కర్కశ హృదయులు. వారికీ మాటలు మహాబదిర శంఖారావమే. ఆలోచించే వారికి మాత్రం విలువలు బతికి బట్టకడతాయని భరోసానిచ్చే రచనలు ఇవి. పత్రికా రంగానికి రాజ్యాంగమిచ్చిన గౌరవాన్ని నిలబెట్టే యాజమాన్యం, సంపాదక వర్గం వుందని నాగలకట్ట సుద్దుల వల్ల తెలుస్తుంది.

నాగలకట్ట సుద్దులు వ్యాసాల్ని సాంఘిక విమర్శపరంగాను, సాహిత్య విలువల పరంగాను పరిశీలించాలి. ఈ వ్యాసాలు 2003 నుంచి 2016 వరకు వార్తా దినపత్రికలో వారానికొకసారి, తరువాత రెండు వారాలకొకసారి ప్రచురితమయినాయి. ఈ కాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఒక పార్టీ ఓడిపోయి మరోపార్టీ గెలిచినా ప్రభుత్వ విధానాలు రైతులకు, శ్రామిక ప్రజలకు అనుకూలంగా లేవని సంపుటాలలోని 282 వ్యాసాలు చదివితే అర్థమవుతుంది. ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాలు గ్రామీణ ప్రజలకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ వ్యాసాలున్నాయని ఈ రెండు సంపుటాలకు రాసిన ముందుమాటల్లో ఎ.బి.కె. ప్రసాద్, కేతు విశ్వనాథరెడ్డి, ఎ.కె. ప్రభాకర్, కత్తి పద్మారావు వంటి పెద్దలు లోతుగానూ, స్పష్టంగానూ విశ్లేషించారు. ఈ వ్యాసాల విశిష్టతనూ ఆ వ్యాసాలు వివరిస్తాయి.

సాహిత్యకారుడు రాజకీయ, సాంఘిక విమర్శకు పూనుకుంటే ఆ ప్రక్రియలోని చురుకుదనం పాఠకున్ని గొప్పగా ప్రభావితం చేస్తుంది. నాగులకట్ట సుద్దులు వంటి వ్యాసాలు గతంలో పానుగంటివారు 'సాక్షి' వ్యాసాల పేరిట రాశారు. అప్పటికి అక్షరాస్యతా శాతం తక్కువగా వున్నా చదువుకున్న వారు ఆ వ్యాసాల ప్రభావం వల్ల నిలకడగా ఆలోచించే స్వభావాన్ని అలవరచుకున్నారు. సాక్షి వ్యాసాలలో పాశ్చాత్య ప్రభావం వల్ల మన సంస్కృతి ఎలా పాడవుతుందో హెచ్చరించారు. నాగులకట్ట సుద్దుల వ్యాసాలు గ్రామీణ సమాజం ఆయా ప్రభుత్వ విధానాలను గురించి ఏమనుకుంటుందో వివరిస్తాయి.

అనంతపురం జిల్లా ఆర్ట్స్ కళాశాల నుంచి వెలువడిన 'వదరుబోతు' వ్యాసాలు రాజకీయ, సాంఘిక విమర్శ చేశాయి. ఆడిసన్ అనే ఇంగ్లీషు రచయిత 'టాట్లర్' పేరిట ఒక దినపత్రికలో వ్యాసాలు రాశారు. ఆ సాంప్రదాయాన్ని కొనసాగించారు శాంతినారాయణ.

సాక్షి వ్యాసాలలోని కల్పిత సంఘం సభ్యులు ఇంచుమించు అందరూ చదువుకున్న వారే. అందుకని వారి భాష కూడా గ్రాంధికమే. ఇంచుమించు వదరుబోతు వ్యాసాలు అటువంటివే. నాగులకట్ట సుద్దులులోని కల్పిత సంఘం సభ్యులు గంపన్న, ఓబిలేసు, కొమ్మోడు, మల్లయ్యలు నిరక్షరాస్యులే. వీరి సభాస్థలం గ్రామంలోని నాగులకట్టలే. సాక్షి సంఘంలో ప్రతిరోజూ ఒకరు ప్రసంగిస్తూ వుంటారు. నాగులకట్ట సుద్దులులో వక్త వుండడు. అవి అట్లని కథలూకాదు, నాటికలు కావు, ఎంతటి తీవ్రవాదోపవాదాలు వీరి మధ్య జరిగినా ఎవ్వరికీ కోపం రాదు. ఓబులేసుకూ, కొమ్మోనికి జరిగే చర్చంతా 'రాస్సేకర్రెడ్డి' గొప్పవాడంటే కాదుకాదు 'సెంద్రబాబు నాయుడే' గొప్ప అని ఇద్దరి మధ్య సంవాదం జరుగుతుంది.

ఈ సంవాదాన్ని చల్లబరచడానికి గంపన్న అనే పెద్ద మనిషి వున్నాడు. తరచూ మల్లయ్య నాటికలోకి / కథనాల్లోకి వస్తూ వుంటాడు. కేవలం ఆ యిద్దరు నాయకుల రాజకీయ విధానాలే కాదు, నక్సలైట్లతో చర్చలు, పరగోడు ఆనకట్ట, రాజోళి బండమళ్ళింపు కాలువ సమస్య, కర్నూలు జిల్లాలో పెండేకల్లు దగ్గిరి రైలు ప్రమాదము, బాబ్రీ మసీదు సమస్య, జ్యోతిష్యము వంటి అశాస్త్రీయ విషయాలపై వ్యంగ్యంగా దెప్పిపొడవడాలు, కంచి స్వామిని మహబూబ్ నగరంలో నిర్బంధించడం వంటి అనేక సమస్యలపై వ్యంగ్యబాణాలు, ప్రజాస్వామిక చర్చతో ముగింపులూ వున్నాయి.

ఈ వ్యాసాలు చదువుతూ వుంటే గ్రామాల్లో ప్రజల మధ్య వుండే రాజకీయ వైరుధ్యాలు మండలస్థాయి, జిల్లా స్థాయి నాయకుల నుంచి దిగుమతి అయినవే ననిపిస్తుంది. రాజకీయాలు వ్యాపారమైన తరువాత, వ్యవసాయం జూదమై సామాన్య ప్రజలు ఈ వ్యాపారం వైపు మొగ్గుచూపుతున్నట్లు అర్థమవుతుంది. నిజానికి రాజకీయాలు ప్రజలకు ఉదాత్తమైన విలువల్ని నేర్పాలి. ప్రజాస్వామిక ఆలోచనా విధానాల్నందించాలి. ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందనేవి కాదు ముఖ్యం. ఏ ప్రభుత్వం ప్రజలకు గౌరవప్రదమైన జీవన వనరుల్ని సమకూర్చిందనేది ముఖ్యం. స్థిర జీవితం లేక గొప్ప అలజడికి గురయిన అనంత గ్రామీణ సమాజం ఈ కథనాల్లో / నాటికల్లో కనిపిస్తుంది.

అత్యంత తీవ్రమయిన సమస్యల్ని అత్యంత తీవ్రంగా చురుకైన భాషలో ప్రజాస్వామికంగా చెప్పడానికి శాంతినారాయణ ఎన్నుకున్న మార్గం అత్యంత సరళమైంది. జానపదులు చదువుకుంటే వారి భాషలోనే అందుబాటులో వుండే భావనల్లోనే ప్రజాస్వామిక భావాల్నందిస్తారు. చదువుకున్న వాళ్ళకు, వ్యంగ్య హాస్య ధోరణిలో మాండలికంలో సమస్యను చర్చకు మన ముందుంచడం వల్ల ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాల్ని కాదనలేని స్థితికొస్తారు. సమాజంలోని అన్ని వర్గాలవారు నాగులకట్ట సుద్దులకు పాఠకులే / ప్రేక్షకులే!

ఏ రాజకీయ పార్టీ పట్ల రచయితకు అభిమానమున్నట్లు లేదు. అట్లని శాంతినారాయణ తటస్థుడా? కాదు. ప్రజాస్వామిక విలువల్నే ప్రతిపాదిస్తాడు. ఆ విలవలు లేకపోవడమే నేటి రాజకీయ పార్టీల దౌర్భాగ్యం. వాటిపట్ల ధర్మాగ్రహ సాహిత్యరూపమే ఈ నాగులకట్ట సుద్దులు. మాటల ద్వారానే / పాత్రల రూపుకట్టిస్తాడు – వారి స్వభావాన్ని చెబుతాడు. వయో బేధాలరీత్యా ఎవరికి చెందవలసిన గౌరవ మర్యాదలు వారికి చెందేట్లుగా చూస్తాడు. రచయిత తగు నిర్మాణ జాగ్రతలు తీసుకున్నారు.

ఇవీ ఇందులో మనకు కనిపించే విశిష్ట లక్షణాలు. ఈ భావాన్నే సాహిత్యంలో బ్యాంటర్ అని వ్యవహరిస్తారు. స్నేహపూర్వకంగా గేలిచేయడమన్నమాట. ఎదుటి వ్యక్తికి ఎటువంటి మనోగాయాన్ని కలిగించకుండా దెప్పిపొడవడం. ఇటువంటి సఖ్యత వ్యక్తీకరణ శ్రామిక వర్గంలోనే చూడగలం. ఈ వ్యక్తీకరణలో ఆకర్షణీత వుంటుంది. గ్రామీణ సమాజంతో శాంతినారాయణకు సజీవ సంబంధమే కాదు, వారితో తాదాత్మ్యం చెందకపోతే ఇటువంటి వ్యక్తీకరణ సాధ్యం కాదు. కన్యాశుల్కంలోని హాస్యాన్ని గురించి నర్దేశాయ్ తిరుమలరావుగారు కన్యాశుల్కం నాటకకళ అనే గ్రంథంలో విట్‌ను గురించి వివరించారు. ఎదుటి వ్యక్తి హృదయాన్ని గాయపరచకుండా గేలిచేస్తూ గొప్ప నీతిబోధ చేయాన్ని విట్ అంటారని అందులో ఆయనంటారు. నీతిబోధ చేసే పెద్దమనిషి నాగులకట్ట సుద్దులులో గంపన్న, మల్లయ్యలుండారు.

నాగులకట్ట సుద్దుల్లోని పాత్రల మనోభావాల్ని పిండితే

జీవిత రిరంస కనిపిస్తుంది. గౌరవంగా జీవించాలనే తపన కనిపిస్తుంది. గౌరవంగా బ్రతకడానికి అడ్డొచ్చే శక్తులపై ధర్మాగ్రహం కనిపిస్తుంది. ఇది శాంతినారాయణ రాసిన సాహిత్యమంతా ఒక ఎత్తైతే నాగులకట్ట సుద్దులు ఒక ఎత్తు. శప్త భూమి నవలలోని రాజ్యకాంక్ష ప్రక్కన బెడితే మిగిలేవి నాగులకట్ట సుద్దులే. అనంత గ్రామీణ సజీవ ముఖచిత్రం నాగులకట్ట సుద్దులు.

తనకు తెలిసిన జీవితాల్నే రాస్తానుగాని తెలియని జీవితాల్ని గురించి రాయలేనని వెనుకటికి కొడవటిగంటి కుటుంబరావు అననే అన్నాడు. రచయితకు తెలిసిన జీవితం సమకాలికమే అయివుంటుంది. ఆ సమకాలిక జీవితాలే ఆయా ప్రక్రియల్లో చిత్రితమై వుంటాయి.

అదీగాక అక్టోబరు విప్లవం తరువాత సాహితీవేత్తల సాహిత్య దృక్పథాలు మారిపోయాయి. కళ కళకోసం కాదన్న అభిప్రాయాలు క్రమంగా బలపడుతూ వచ్చినాయి. తెలుగు సాహిత్యంలో స్వాతంత్ర్యోద్యమకాలం నుంచి ఆలంకారికత నుంచి సామాజికత వైపు రచయితల దృష్టి మళ్ళింది. కథ, నవల, వ్యాసం, వచన కవితా రూపాలు ముందుకొచ్చాయి. రచయితలు సాహిత్య ప్రయోజనాన్ని కాంక్షించారు. పాఠకులకు కొత్త దృష్టిని అందించాలనే ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో పై ప్రక్రియలకు అనువైన వస్తువు సమాజ జీవితమే. వీరేశలింగం పంతులు గారి నుంచి నేటి వరకు రచయితల దృష్టి ఏదైనా సమకాలీన జీవితమే ఆయా ప్రక్రియల్లో ప్రతిఫలిస్తూ వుంది.

రామాయణంలో దశరథుని పుత్రవాత్సల్యం స్వభావవర్ణన, కైకేయి ఈర్ష్యా స్వభావం, భారతంలోని వినత కద్రువల పందేల వర్ణన, పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నంలోని సుగాత్రీశాలీనుల తోట పనుల వర్ణనలు సమకాలీన జీవిత ప్రతిఫలనాలే. రచయిత సమకాలీన జీవితాన్నే తన దృష్టితో వివరించినపుడు మనకు వైవిధ్యాలు గోచరిస్తాయి.

కాలానుగుణంగా సాహితీ ప్రక్రియలు మారుతూవస్తాయి. వార్తాపత్రికలు రావడం ప్రారంభమయిందంటే సమాజంలో పాఠకులు, విద్యావంతులు పెరిగినారని అర్థం. వీరి అవసరార్థం పత్రికల్లో కొత్త శీర్షికలు అవసరమైనాయి. విద్వాన్ విశ్వం మాణిక్యవీణ, తిరుమల రామచంద్ర సాహితీ సుగతుని స్వగతం వంటి శీర్షికలు పాఠకులను గొప్పగా ఆకట్టుకున్నాయి. ఇటీవల తెలుగు పత్రికల సంఖ్య పెరిగి పోవడంతో, పాఠకుల్ని ఆకట్టుకుని గ్రామస్థాయి పాఠకుల వరకు తమ పత్రికలు చేరాలంటే వారి భాషలోనే వారి వ్యక్తీకరణ రూపంలోనే కథలో, కథనాలో వుండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ అవసరాన్ని గుర్తించిన విప్లవ రచయితల సంఘం మాండలిక రచనల్ని బాగా ప్రోత్సహించింది. సృజన ఆధునిక సాహిత్య వేదిక ఎంతోమంది మాండలిక రచయితల్ని ప్రోత్సహించింది. మాండలికంలో రాస్తే తప్ప ఆధునిక రచయిత కాడన్నంత వరకు మాండలిక రచనా వ్యామోహం పెరిగింది. ఈ వెల్లువలో కొంత సారం కూడా లేకపోలేదు. ఇటీవల 'కొత్తపలుకు' శీర్షిక తెలంగాణా మాండలికంలో తెలిదేవర భానుమూర్తి రాసింది పాఠకుల్ని బాగా ఆకట్టుకుంది. శాంతినారాయణ అనంతపురం జిల్లా మాండలికంలో 2003-2006 సంవత్సరం వార్త దినపత్రికలో "నాగులకట్ట సుద్దులు" శీర్షికన దాదాపు రెండు వందలకుపైగా సమకాలీన సామాజిక సమస్యలపై వ్యంగ్య కథనాలు రాశారు.

ఈ వ్యాసాలు కథనాలు, కథలు కావు. వీటిలో సమకాలీన రాజకీయ సమస్యలపై రచయిత ప్రజాస్వామిక భావాల్ని పాత్రల ద్వారా పలికిస్తారు. వివిధ ప్రభుత్వ పథకాలలోని డొల్లతనాన్ని, రాష్ట్రంలోనూ దేశంలోనూ జరిగిన సంఘటనలపై ప్రజాస్వామికంగా ఆయా పాత్రల ద్వారా రచయిత తన అభిప్రాయాల్ని వెల్లడిస్తాడు.

అభిప్రాయాలు వెలువరించే సమయంలో జనజీవిత చిత్రణకు ఎక్కడ అవకాశముంటుందనే ప్రశ్నించడానికి అవకాశముంది. ఇక్కడే శాంతినారాయణ ప్రతిభను చూడాలి.

భాషలో మౌఖిక రాత సంప్రదాయాలున్నాయి. రాత సంప్రదాయంలో శాంతినారాయణ మౌఖిక సాంప్రదాయాన్ని అనుసరించారు. మౌఖిక సంప్రదాయంలో వక్త శ్రోత మధ్య ప్రత్యక్ష సంబంధం వుంటుంది. శాంతినారాయణొకటి రెండు మాటల్లోనే పాత్రల రూపుకట్టిస్తాడు. అదీ ఆయన ప్రతిభ. సాక్షి వ్యాసాల్లో లాగా నాగులకట్ట సుద్దులు ఒక కల్పిత సంఘం. ఇందులో ఓబిలేసు తెలుగుదేశం పార్టీ అభిమాని, కొమ్మోడు కాంగ్రెసు అభిమాని. వీరిద్దరికి వచ్చే తగువులకు గంపన్న తరచుగా మల్లన్న తీర్పులు చెబుతూ వుంటారు. ఈ తగవులు ఏనాడూ ఘర్షణ రూపాన్ని తీసుకోవు. తమాషాగా 'కుశాలిగా'నే ఈ తగవులుంటాయి.

నాగులకట్ట మీద కూర్చొని మాట్లాడే సందర్భంలో వారివారి రూప విశేషాలు, వయో వృత్తి విశేషాలు, స్వభావాల్ని

వ్యక్తీకరించడంలో శాంతినారాయణ ప్రతిభ దాగుంది. జీవిత వాస్తవికతను మాండలిక భాషలో కళాత్మకంగా వ్యక్తీకరిస్తారు.

నాగులకట్టను వేదికగా ఎంచుకోవడమే అనంతపురం జిల్లా జనజీవన చిత్రణలోని ప్రత్యేకత కనిపిస్తుంది. శాంతినారాయణ స్వగ్రామ ప్రాంతంలోని ఓ గ్రామంలో దళితుల ఆలయప్రవేశ సమస్యపై పెద్ద ఘర్షణ జరిగింది. జిల్లాస్థాయి పాలనా యంత్రాంగం జోక్యంతో సద్దుమణిగింది. కులవివక్ష సమస్య పెద్దఎత్తున కొనసాగుతూ వుంది. కాబట్టి దళిత బహుజనులైన నాగులకట్ట 'న్యాత్తులు' ఆలయ ప్రాంతంలోని చెట్టుకింద కాకుండా నాగులకట్టను తమ సంభాషణా వేదికగా ఎంచుకున్నారు. నాగులకట్ట దగ్గరున్న 'నాగప్పల్ని' పూజించడానికి ప్రత్యేకంగా పూజారులుండరు. అన్ని కులాల స్త్రీలు తామే 'నాగప్పల్ని' స్వయంగా అభిషేకించి పూజించుకోవచ్చును. ఈ అనుకూల విధానాలే నాగులకట్ట సుద్దులకు ఆ వేదికగా ఏర్పాటు చేసుకున్నారు. ఇది రాయలసీమ ప్రత్యేకత.

రాయలసీమలో అనంతపురం జిల్లా తక్కువ వర్షపాతంతోనూ, సేద్యపు నీటి వనరులు లేని ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. కేవలం వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో మూడు నాలుగు నెలల కాలమే పనులుంటాయి. మిగతా సమయంలో బెంగళూరు, బళ్ళారి ప్రాంతాలకు వలసపోతుంటారు. వలస పోలేనివారు, కొంత వెసులుబాటు వున్నవారు గ్రామాల్లోనే నిలిచిపోతారు. ఇటువంటి వారిని రాజకీయ కూలీలుగా వాడుకునే రాజకీయవర్గాలు బయలుదేరాయి. ఇటువంటివారు మండల స్థాయిలో పైరవీలు చేస్తూ బ్రతుకీడుస్తుంటారు. మిగతా జనం నాగులకట్ట దగ్గర కూడుకొని కాలక్షేపానికి కబుర్లు చెప్పుకుంటారు. ఇది అనంతపురం జిల్లా గ్రామీణ దృశ్యం. ఈ తీరిక వర్గాన్ని శాంతినారాయణ సామాజిక విమర్శకు సాధనంగా వాడుకున్నారు.

ఇదే జిల్లా నుంచి గతంలో వెలుడిన 'వదరుబోతు' వ్యాసాలుగాని, రాజమండ్రి ప్రాంతం నుంచి వెలువడిన సాక్షి వ్యాసాలుగాని ఇందుకు భిన్నమైనవి. అవి గ్రాంథిక భాషలో వున్న కారణంగానూ ఇతర కారణాల వల్లనూ వాటికి కొన్ని పరిమితులేర్పడినాయి.


'నాగులకట్ట సుద్దులు' మాండలిక వ్యక్తీకరణే ప్రాంతీయత. మాటల వ్యక్తీకరణే జన జీవితం. అటువంటి వ్యక్తీకరణ మరో ప్రాంతంలో లేదు. నాగులకట్ట మొదటి సంపుటంలోని పద్నాల్గవ కథనంలో కథకుడు, గంపన్న ఉగాది నాటి ఒకనాటి సంబరాలు లేవని బాధపడే సందర్భంలో గంపన్న ఓబిలేసుతో గారమిద్దెలకంతా సున్నంగొట్టాల్సిందే! మట్టి మిద్దెలకూ కొట్టాలకు కొత్త అసులు మెత్తి, యెరమన్నూ పేడా కలిపిన కలక పూయాల్సిందే..... ఉగాదొచ్చిందంటే అనంతపురంలో వారం దినాలు సంత జరిగేదప్పా.... వొగగరు పదీ పద్దెదు టెంకాయలు పురికోసకు కట్టుకొని బరువుగా జెనం వూర్లేకి వొత్తావుండే బాలె సంబురంగవుండేది. ఆడోల్లు గుండ్లకింద పూర్నం రుబ్బి ..... మొగోల్లు తానాలు జేసి మొదట గాడిపాడు దగ్గెర టెంకాయలు గొట్టేవారు అని కుటుంబం అంతా కలసి సంబరం ఎలా జరుపుకునేవారో వివరిస్తారు. భూస్వామ్య సాంస్కృతిక అవశేషాలు ఇందులో కనిపిస్తాయి. ఇంకా పదిహేడవ కథనంలో దళితులకు సామూహిక భోజనాలు మొలకల పున్నమినాడు పెట్టి ఆ పంక్తిలోని దళితుల్ని "వాళ్ళు బంతిలో కూచ్చోని బోంచేత్తావుంటే ఆసాములోచ్చి, ఇదిగో తిప్పారెడ్డి, ఈ తిమ్ముగాని దెగ్గెర నుంచి ఆ మల్లుగాని దెగ్గెరి వరకు నీకూ, అగో, రామిరెడ్డీ, ఈ కుల్లాయి గాని దెగ్గెర్నుంచి ఆమల్లుగాని దెగ్గెరి వరకు నీకూ" అని దళితుల్ని పనులకు పంచుకుంటారట. ఇదీ అనంత గ్రామీణ భూస్వామ్య సంప్రదాయం.

ఇక్కడి గ్రామాలు ఈ సంబంధాలను దాటి ముందుకు ఇంకా అడుగు పెట్టలేదు. గ్రామీణ ప్రాంతంలో దళిత బహుజనులు ఈనాటికీ పొట్టగడిస్తే చాలనుకునే వారున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన సమయంలో గంట మ్రోగగానే విద్యార్థులు ప్లేట్లు పటుకుని అన్నం వడ్డించే క్యూలోకి ఎంత ఆతురతగా పరిగెడుతారో! తిండికి మొహం వాచిన బ్రతుకులు వారివి. ఇదే మొదటి సంపుటంలోని ఇరవై ఆరవ కథనంలో కరవు కాలంలో గంజి కేంద్రాలు ఎలా నడుస్తాయో శాంతినారాయణ వివరిస్తాడు. ధాత కరవులోని అగచాట్లను గుత్తి రామకృష్ణ అనే పాత్రికేయుడు 'గంజినీళ్ళు' అనే కథ రాశాడు. శాంతినారాయణ 'గంజికిల్యా, యిత్తనాలు కొనల్లంట! అనే కథనంలో కొమ్మోదు" అయ్యో గంజి కేంద్రాలు పెట్టేకి, గవుర్మెంటు దెగ్గెర గంజి వుంటేగదా మామా? వుంటే గంజంతా రాజకీయ నాయకుల బట్టలకు గంజి పెట్టేకే సరిపోతావుంది. యింగ పసలకు గెడ్డయినా యిత్తారనుకుంటే ..... నాయకుల బొమ్మల్ని చేసి కాల్చేకే సరిపోతాంది. యింగ

## కవిత

# సాంగత్యం

- సడ్లపల్లె
9440073636



భాష మనం తయారు చేసుకొన్నదే
వెలుగుల విద్యుత్తుల ప్రసారాలకు
లోహపు తీగల వారధిలాగా
ఒకర్నొకరు కలుపుకోవడానికని!!
లోపలి విలువల తత్వాలను
కొలవడానికీ
ఖాళీలు.....
సరికొత్త సత్యాలతో నింపుకోవడానికే!!
అయినా...
తీగల ముడులు సరిపడక రాపిడై
తీవ్ర అంతరాయాలతో ఎగిసిపడే
చిటపట మంటల్లాగా
ఏమిటీ వైరుధ్యాల మధ్య గోల??
ప్రతి మాటనూ
మతంలోనో కులంలోనో
మరో అసహన ద్రావకంలోనో ముంచి
తుపాకీ నోటి తూటాగా పేర్చి
గుండెల మీదనో గూడు మీదనో
గురి చూసి పేల్చే విధంగా
ఎందుకు రగిలి పోతున్నాం!!
మనది ఒకే భూగోళం కదా!!
ప్రకృతి నియమాలతో
కొన్నాళ్ల మజిలీ కోసం ఇక్కడ
ఊపిరి నాళాలై కదిలే
మానవ రూపాలయ్యాం కదా!!
ఈ మట్టిలో మొలిచిన ప్రతి మొక్కా
గుప్పెడు ధాన్యం కంకిగా పండి
అన్నం ముద్దగా మారి తరిస్తుంటే
మనం మాత్రం ఎలా ముగుస్తున్నాం?
ఎన్ని కాలాల నుంచో
ఎదురెదురుగా నిలబడి
గతాల్ని తవ్వుకొంటూ....
ఉన్నది పాతాళంలో అని గ్రహించక
ఎక్కి వచ్చే ఎత్తుగడల్ని నేర్వక
ఇంకా కిందికి
కూరుకు పోతూనే ఉన్నాం!!
గాడిదల్ని గుర్రాలనీ
ఏనుగుల్ని ఎలుకలనీ
ప్రచారాల పండుగలు చేసి
ఆత్మద్రోహం లౌతున్నాం!!
కళ్లెదుట రూపుగట్టిన కాలజ్ఞానాన్ని
చదవక
గత కాలాల గొంతుల ఘోషలతోనే
అరుస్తున్నాం కరుస్తున్నాం.
భాషల వినియోగాల విశేషాల్ని
మరుస్తున్నాం.
ముందుకు నడవడానికని
కాళ్ళుంటే...
చచ్చిన పిశాచాల సాంగత్యంతో
వెనక్కు మళ్లడం అలవాటు
చేసుకొంటున్నాం. ◆

గవర్మెంటు యాగంజిపోత్తాది యాగెడ్డి యిత్తాది! అని యెత్తగొట్టె కొమ్మోడు! అందరం పగలబడి నవ్వుకుంటిమి! అని గ్రామీణ దయనీయ స్థితిని వివరిస్తారు. మనుషులకు గంజి కేంద్రాలు, పశువులకు గడ్డి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయంటే గ్రామాల్లో జనజీవితం ఎంతగా కునారిల్లి పోతోందో ఊహించుకోవాలి.

అనంతపురం జిల్లా జనజీవితం నిత్యం కరవులు, వర్షాభావం, కక్ష్యలతో కుతకుతలాడుతూ వుంటుంది. వీటి రూపాలు మార్చుకొని కొనసాగుతూనే వున్నాయి. శాంతినారాయణగారు అట్టుడుకుతున్న గ్రామీణ సమాజంలో వ్యక్తుల మధ్య, రైతు కూలీల మధ్య వుండిన రాజకీయ పార్టీల పట్లవున్న ప్రేమంతా వాళ్ళు జీవనమనుగడ కోసమేనంటారు. గ్రామంలోని భూమిలేని రైతాంగానికి రాజకీయ పార్టీలపై వున్న మమకారమంతా కులాల ఆధారంగా ఆర్థిక వనరులు సమకూర్చు కోవడానికేనంటారు. ఎక్కడా ద్రోహచింతన కన్పించదు. అది ఎక్కడైనా కనిపిస్తే పైనుండి దిగుమతైందే తప్ప గ్రామాల్లో పుట్టి పెరిగింది కాదని పాఠకునితో అనిపిస్తాడు.

ఈ వ్యాస కథనాలు మౌనంగా చదువుకుంటే వ్యక్తీకరణలోని సౌందర్యం కనుపించదు. ఒక నాటకీయ శైలిలో చదువుకుంటే పాత్రలు రూపుకడతాయి, స్వభావం అర్థమవుతుంది. భాషా మార్దవం తెలుస్తుంది.

కాలం గడిచేకొద్ది "నాగులకట్ట సుద్దులు" ప్రాధాన్యం పెరుగుతుంది. డా॥ తిరుమల రామచంద్ర నుడి – నానుడి అన్న రెండు చిన్న గ్రంథాల్లో తెలుగుపదాలు ఏర్పడేవిధానం, అవి ఉచ్చారణలో మారుతున్న తీరును, కొత్త అర్థాల్ని సంతరించుకున్న విధానాన్ని వివరించారు. ఆ పదాలు చాలా వరకు రచనాశైలికి సంబంధించినవి. శాంతినారాయణ రాసిన ఈ కథనాల్లోని మాండలిక పదాలు విలక్షణమైన వ్యక్తీకరణ కలిగినవి. ఈ వ్యాసాల్ని కత్తి పద్మారావుగారు మాండలిక భాషా నిఘంటువన్నారు. ప్రయోగంతోడి మాండలిక భాషా నిఘంటువు. ఒకనాటి అనంతపురం జిల్లా మాండలిక గ్రామీణ భాషారూపం తెలుసుకోవడానికి చారిత్రక ప్రాధాన్యతను ఈ కథనాలు సంతరించుకున్నాయి. అయితే మాండలికయాసకు అక్షర రూపమివ్వడం కష్టం. ◆

## కవిత

# సైకిల్

- యు. రమ్యజ్యోతి
9985516857

బాల్యంలో గంటలు క్షణాల్లా దొర్లేవి
అది నా తోడుంటే
పావలా ఇస్తే గంటపాటు
స్వర్గంలో వుండే వీలుండేది
దానితో ఉన్నప్పుడు ప్రపంచంలో
నేను మాత్రమే గొప్ప అనే భావన కలిగేది
విక్రమార్కుని సింహాసనం కాసేపు
అరువు తెచ్చుకున్నట్లు ఉండేది
నా కాళ్ళకు చక్రాలుగా
పక్కటెముకల్ని కడ్డీలుగా
నా చేతులను హ్యాండిల్‌గా
నా ప్రాణవాయువును దానికి శ్వాసగా
నా మాటను బెల్లుగా చేసి
నన్ను నేను తన రూపంలోకి
పరకాయ ప్రవేశం చేసేదాన్ని
తనతో చెలిమి కోసం అన్నయ్యతో
మూడో ప్రపంచయుద్ధం చేయాల్సివచ్చేది
తనతో విహరించేటప్పుడు
నా తోటి వారి కళ్ళన్నీ
నీకేం మహారాణివి అన్నట్టు ఈర్ష్యపడేవి
తను నాతో వుందంటే నా కాళ్ళూ, చేతులూ
అంతుతెలియని ఆనందంతో తాండవించేవి
మా నాన్న ముందు చెల్లిని వెనుక నన్ను



కూర్చోబెట్టుకుని జీవిత ప్రయాణానికి
మార్గాలను చెబుతూ ఉంటే
అప్పుడు అది కూడా
మా నాన్నతో పాటుగా మాకు మార్గదర్శకం చేసేది
జీవితంలో సమస్యలు
చక్రంలా తిరుగుతూనే వుంటాయనీ
అయినా మనం గమ్యం చేరే వరకు
జీవనయానం ఆపొద్దని
నిరంతరం తను నాకు బోధించేది
చెల్లి, నేనూ మైమరచి నాన్న మాటలతో
మమేకమయినప్పుడు
మేము శ్రద్ధగా వింటున్నామన్న
ఆనందంతో మమ్మల్ని ఉయ్యాలలూపేది
అది ఎన్నెన్నో దారులను
నా పాదాలకు పరిచయం చేసి
వాటిని నాకు గులాములుగా మార్చింది
తన ముందు పల్లకీ,
రోల్స్ రాయిస్ కారు కూడా దిగదుడుపే
తనతో నాకుండేది రక్త సంబంధం కాదు...
పాద సంబంధం ♦

---

# హైకులు

- దామరకుంట శంకరయ్య
9440876788

*వేసవి కాలం*
*సూర్యుడు పాడుతుండు*
*గ్రీష్మగీతం*

*నడిస్తే నడుస్తూ*
*ఆగితే ఆగుతుంది*
*చందమామ*

*నదిని చూశా*
*నీళ్ళలో కొట్టుకుపోతూ*
*చూపులు*



*ఎర్రని పాట*
*ఉదయపు పూట*
*తూర్పు కొండ నోట*

*జలపాతంలో*
*తలస్నానం చేస్తూ*
*శిలా సుందరి*

*ఇటుకలు*
*బట్టీలో కాలి*
*గోడలో నిద్రిస్తున్నవి*

*పాట*
*సంగీత దారానికి*
*సరిగమల పూలు*

*సుదూరాన*
*ముచ్చటాడుతూ*
*భూమ్యాకాశాలు*

*గుమ్మానికున్న లాంతరు*
*చీకటి ప్రియున్ని*
*పిలుస్తుంది*

*చెలిమె*
*ఎండిన నదిలో*
*అమృత కలశం* ♦

కథ

# నిర్ణయం




– మారుతి పౌరోహితం

9440205303


పార్వతమ్మ ఆశ్రమం తోటలో మల్లెపూలు కోస్తూ ఉంది . పూలను కోసి మాలగా కట్టి , ఆశ్రమంలో మల్లెపూలు పెట్టుకోవడం ఇష్టమున్న మహిళలకు కట్టిన పూలను ఇవ్వడం పార్వతమ్మకు ఇష్టమైన పని.

"అమ్మా పార్వతమ్మా!" ఆయమ్మ పిలుపు.

" ఏం ఆయమ్మా? " అని మల్లెతీగలను సర్దుతూ ఆయమ్మ వస్తున్న వైపు చూస్తూ అడిగింది పార్వతమ్మ.

" అమ్మా! జానకమ్మకు ఆయాసం ఎక్కువైంది. ఒకసారి రామ్మా!" అంటూ ఆందోళనగా పార్వతమ్మను అర్థించింది ఆయమ్మ.

వడి వడి అడుగులు వేసుకొంటూ జానకమ్మ ఉన్న డార్మెట్రీకి వెళ్ళింది పార్వతమ్మ.

మంచం పైన ఆయాసంగా రొప్పుతున్న జానకమ్మను చూసి " ఆయమ్మా! ఆ నెబ్యులైజర్ మిషన్ తీసుకురా" అని పురమాయిస్తూనే జానకమ్మ రాక్‌లో ఉన్న ఆస్తలిన్ మాత్రలను తీసింది. ఆయమ్మ తెచ్చిన నెబ్యులైసర్లో మాత్రను ఉంచి, మిషన్ స్విచ్ ఆన్ చేసి జానకమ్మ ముక్కును పూర్తిగా కప్పుతూ మాస్క్ ను పెట్టింది.

" ఆయమ్మా ! ఉదయమే నెబ్యులైజర్ పెట్టాలిగదా? నర్సు రాలేదా?" అంటూ మాస్కును మరో చేతిలోకి మార్చుకొంటూ అడిగింది పార్వతమ్మ .

"వచ్చిందమ్మా! జానకమ్మే టిఫిన్ తిన్నతరువాత మీరు పెడతారని వద్దంది" అంటూ సంజాయిషీ చెప్పుకొంది ఆయమ్మ. బెడ్‌పై పడుకొన్న జానకమ్మ కళ్ళనుండి కణతలమీదుగా కన్నీరు జారిపోతా ఉన్నాయి.

"అయ్యో పిచ్చిదానా! ఏమైందని ఆ కన్నీరు? ఆయాసానికే అంత భయపడితే ఎలా? నన్ను సూడు . ముప్పైఏండ్లనుండి ఏగడం లేదా? మామూలే! మనమే చలికాలం కొంచెం జాగ్రత్తగా ఉండాల. ఏంకాదులే! ధైర్యంగా ఉండు" అంటూ జానకమ్మ నుదురుపై చేయి ఆడిస్తూ ధైర్యం చెప్పింది పార్వతమ్మ !

పార్వతమ్మ చేతిని తన చేతిలోకి తీసుకొని , సున్నితంగా నొక్కుతూ "నీవుండగా నాకు భయమెందుకన్నట్లు" చూసింది జానకమ్మ.

•••

శ్రీ శాంతి వృద్ధాశ్రమం బళ్ళారికు ఐదు కిలోమీటర్ల దూరంలో సంగనకల్లు అనే గ్రామంలో ఉంటుంది. డాక్టర్లు అయిన భార్యా భర్తలు ఈ ఆశ్రమాన్ని ఆసుపత్రి సౌకర్యాలతో నెలకొల్పారు. దాదాపు ఓ వందమంది వృద్ధులు ఇందులో ఆశ్రయం పొంది ఉన్నారు. వైద్యసేవలు అవసరమైన

వృద్ధులకోసం వైద్య సహాయాన్ని అందించడం కోసం న్యాయమైన యూజర్ చార్జీలను వసూలు చేస్తారు. ఒక్కక్కరినుండి రీఫండబుల్ డిపాజిట్‌గా ఏభైవేలు తీసుకొంటారు. డార్మెట్రీలో వుంటే నెలకు మూడువేల ఐదొందలు, షేరింగ్ రూం అయితే ఐదువేలు, ప్రత్యేక రూం కావాలంటే పదివేలు చెల్లించాల్సి వుంటుంది. ఒంటరి వృద్ధులు, దంపతులైన భార్యా భర్తలు కూడా ఈ ఆశ్రమంలో ఉన్నారు. ఒకరికొకరు అన్నట్లు వీరు అందరూ అరమరికలు లేకుండా ఆత్మీయంగా ఉంటారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క విషాద గాథ. జబ్బుపడిన తమ తల్లిదండ్రులను వదిలించుకోవాలనుకునే ఉద్దేశ్యంతో తమ తల్లి దండ్రులను ఇక్కడ చేర్చిన వారే ఎక్కువ. జబ్బు బాగా ముదిరిన వారికి ఐ సీ యూ లో ఉంచి చికిత్స అందిస్తూ ఉంటారు. ఒక ఆసుపత్రిలో ఉండాల్సిన సౌకర్యాలు అన్నీ ఇక్కడున్నాయి.

♦♦♦

పార్వతమ్మ కొడుకు శరత్ అమెరికాలో ఉంటాడు. కోడలు హాసినీ కూడా సాఫ్ట్ వేర్ ఉద్యోగిణి. వారికి ఇద్దరు పిల్లలు. తను పనిచేస్తున్న ఆఫీసులోనే ఆ అమ్మాయికూడా పనిచేస్తుండేది. ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. పార్వతమ్మ తన కొడుకు నిర్ణయం మీద నమ్మకంతో అభ్యంతరం పెట్టలేదు. శరత్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు భర్త చంద్రశేఖర్ ఏభై అయిదు సంవత్సరాల వయసులో ఎమ్మిగనూరులో పనిచేస్తూ ఉన్నపుడు గుండెపోటుతో చనిపోయాడు. భర్త టీచరుగా పనిచేస్తుండడం వలన పార్వతమ్మకు ఫ్యామిలీ పెన్షన్ వచ్చేది. కొడుకుకు పద్దెనిమిదేళ్ళు నిండితే కారుణ్య నియామకం క్రింద జూనియర్ అసిస్టంట్ పోస్ట్ ఇస్తారనీ, అప్పుడు శరత్‌ను ఉద్యోగంలో చేర్చవచ్చని తన భర్తతో పాటు పనిచేసిన ఉపాధ్యాయులు చెబితే పార్వతమ్మ ఆమాటలు వినలేదు. శరత్‌కు సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పనిచేయాలనే ఆసక్తిని గమనించి పార్వతమ్మ అందులకు ఒప్పుకోలేదు. శరత్ కు కూడా అమ్మ మాటంటే వేదం. మంచి ప్రతిభ కలిగినవాడు. సెలవుల్లో వచ్చినపుడు ఇరుగు పొరుగు వారు పార్వతమ్మ పడుతున్న కష్టాలగురించి శరత్‌కు చెప్పేవారు.

“ నాయనా ఉద్యోగం వచ్చిండాదంట గదా! అదింత నెత్తిమీద ఇన్ని అచ్చింతలు ఏస్కొని మీయమ్మను నీకాడ పెట్టుకోప్పా ! ఆయమ్మ కష్టం సూడలేకుండాం “ అని వాళ్ళు చెబుతుంటే శరత్ కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి.

బాత్రూంలో కాలు జారి పడి మూడు నెలలు మంచం పైన ఉన్న విషయం కూడా హాస్టల్‌లో ఉన్న తనకు చెప్పలేదు. శరత్ కు కాలేజీలోనే క్యాంపస్ సెలక్షన్ రావడం, ప్రాజెక్ట్ పనికి అమెరికాకు వెళ్ళడం, అక్కడే ఉద్యోగరీత్యా ఉండిపోవలసిరావడం, పెళ్ళి అయిపోవడం చకచకా జరిగిపోయాయి. శరత్ పార్వతమ్మను అతికష్టం మీద ఒప్పించి అమెరికాకు తీసుకెళ్ళాడు. కోడలు హాసిని కూడా పార్వతమ్మను తల్లిలాగా చూసుకొనేది. అయితే పార్వతమ్మకు ఉన్న ఆస్థమా జబ్బు వలన అక్కడి వాతావరణం సరిపడక పోవడం వలన తప్పని సరి పరిస్థితుల్లో ఇండియాకు పంపవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒంటరిగా ఎమ్మిగనూరులోనే ఉంచితే టైం కాని టైంలో ఆయాసం వస్తే అమ్మకు ఎవరు దిక్కు అనే ఆలోచన శరత్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. స్నేహితుల ద్వారా సంగనకల్లు లోని శ్రీశాంతి వృద్ధాశ్రమం గురించి తెలిసింది. నెలరోజులు సెలవు పెట్టి ఇండియాకు పార్వతమ్మతో పాటు వచ్చి ఆశ్రమానికి వెళ్ళి అక్కడే వారం రోజులు తన తల్లితో పాటు ఉండి నమ్మకం కుదిరిన తరువాతే అక్కడ పార్వతమ్మను చేర్చడానికి నిర్ణయించుకొన్నాడు. వారం రోజుల్లోనే ఆశ్రమంలో చాలా మందితో శరత్‌కు అనుబంధం ఏర్పడింది. పార్వతమ్మకు కూడా ఆశ్రమం బాగా నచ్చింది. శరత్ ప్రత్యేకమైన ఏసీ రూం తీసుకుందామంటే పార్వతమ్మ ఒప్పుకోలేదు. మహిళలకు, పురుషులకూ డార్మెట్రీలు విడి విడిగా ఉన్నాయనీ, అందరితో కలసి ఉన్నట్లు ఉంటాదనీ, ఒంటరితనం అనిపించదనీ శరత్ ను సమాధాన పరిచింది. శరత్‌కు కూడా తల్లి వాదన సబబు అనిపించింది. ఆశ్రమం పార్వతమ్మకు బాగా నచ్చినప్పటికీ, శరత్‌కు తన తల్లిను అక్కడ వదలి వెళ్ళడం ఏదో ఒకమూల బాధగానే ఉండింది.

♦♦♦

పార్వతమ్మ ఆశ్రమానికొచ్చి నాల్గు సంవత్సరాలైంది. అందరితో ఆత్మీయ అనుబంధం ఏర్పడింది. పెన్షన్ వస్తూ ఉండడం, కొడుకు డబ్బు విషయంలో ఏరోజూ తక్కువ చేయకపోవడం వలన పార్వతమ్మ ఇప్పుడు ఒకరిని ఆదుకొనే స్థాయిలోనే ఉంది. పార్వతమ్మ పదివరకే చదువుకున్నా, పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం అని తెలిసి ఉన్న

శరత్ ఆశ్రమం యాజమాన్యంతో మాట్లాడి తనూ కొంత డొనేషన్ ఇచ్చి ఒక లైబ్రరీ తెరిపించాడు. పార్వతమ్మ ఒక టైం టేబుల్ ప్రకారం ఆశ్రమంలో తన పనులు నిర్వహించు కొనేది. కిచెన్లో వంటవారికి సహాయ పడడం, వైద్యం అందించే వార్డులో అనారోగ్యంగా ఉన్నవారికి సహాయ పడడం, గార్డెన్లో మొక్కలకు నీళ్ళు పెట్టడం, వాటికి పాదులు తీయడం, పూలు కోయడం , మందిరంలో ధ్యానం చేసుకోవడం, వంటి పనులు నిర్వహించుకొనేది. ఆశ్రమంలో ప్రతి ఒక్కరు తమకు చేతనైన పనులు చేసిపెట్టే వారు. శరత్ తోనూ, హాసిని తోనూ వారంలో రెండురోజులు స్కైప్లో మాట్లాడేది. పార్వతమ్మ పట్ల అభిమానంగా ఉన్న వారితో గూడా శరత్, హాసినీలు మాట్లాడేవారు. శరత్ పార్వతమ్మ పట్ల చూపే శ్రద్ధను చూసి కొంతమంది తమ పిల్లలు తమపట్ల చూపే నిర్లక్ష్య వైఖరిని తలుచుకొని బాధ పడేవారు.

ఆయమ్మ తోటలో మొక్కలకు పాదులు తీస్తున్న పార్వతమ్మ దగ్గరకు వచ్చి

" అమ్మా! శరత్ అయ్య కాల్ చేసినాడంట. మేనేజర్ సార్ పిలుసుక రమ్మానాడమ్మా!" అనుకుంటూ పార్వతమ్మవైపు వచ్చింది.

మట్టి అంటిన చేతులను కడుక్కొని, కొంగుతో చేతులు తూడ్చుకొంటూ మేనేజర్ గదికి వచ్చింది పార్వతమ్మ. మేనేజర్ సిస్టం ముందునుండి లేచి కుర్చీ ఖాళీ చేసి బయటకు వెళ్ళిపోయాడు. ఇయర్ ఫోన్స్ చెవులకు పెట్టుకొంటూ కుర్చీలో కూర్చొంది పార్వతమ్మ.

" మా బావున్నావా ?" అంటూ పలకరించాడు శరత్.

" బావున్నా రా " అంది పార్వతమ్మ తన కళ్ళ జోడును సవరించుకొంటూ.

" గార్డెన్లో ఉండావంట కదా ? మేనేజరు చెప్పాడు." అన్నడు శరత్.

" అవున్రా! పాదులుతీస్తా ఉంటి" అన్నది పార్వతమ్మ.

"మొక్కలన్న, బుక్కులన్నా నీకు శానా ఇష్టం కదా మా!" అని ప్రేమగా అన్నాడు శరత్. "ఏదో ఒక వ్యాపకం ఉండాల గదరా!" అని చిన్నగా నవ్వింది పార్వతమ్మ .

" మా! మొన్న మేము ఇండియా వొచ్చినపుడు నేను చదువుకున్న నందవరం హైస్కూల్ల పదోతరగతి బ్యాచొల్లు అందరం కల్సింటిమి అని నీకు సెప్పినాను కదమా" అన్నాడు శరత్.

" అవును కదా ! నాకే జ్వరం వచ్చింటే రాల్యాక పోతి. నాకు జ్వరం ఉండాదని హాసిని కూడా నీతో రాల్యా. మీ నాయన దగ్గర సదువుకున్నోళ్ళు నన్ని అడిగినారని సెప్తివికదా!" అని గుర్తు చేసింది పార్వతమ్మ.

" అవునుమా ! నీకి బాగా గుర్తుండాది" అని సపోర్ట్ చేస్తూ మాట్లాడాడు శరత్.

" మా! ఆరోజు స్కూలు దగ్గరకి మాకు లెక్కలు జెప్పిన రామయ్య సారు గూడా వొచ్చిండె" అని అన్నాడు శరత్.

" అవునులే! లెక్కల రామయ్య సారు కదా? నీకు లెక్కల గ్రూపు తీసుకొమ్మని ఆసారె గదా గట్టిగా సెప్పింది" అని గుర్తు చేసింది పార్వతమ్మ.

" అవునుమా ! తరువాత గూడా సారునాకు శానా ప్రోత్సాహం ఇస్తావుండె. ఇంజనీరింగుల కంప్యూటర్ బ్రాంచ్ తీసుకొమ్మని చెప్పింది కూడా ఆసారే మా!" అన్నాడు శరత్.

" మీ నాయనకి శానా కావలసినాయప్ప! నీవు కూడా లెక్కలు సెప్పిచ్చుకొనేకి ఆ సారు ఇంటికి పోతుంటివి కదా" అంటూ " బాగున్నాడా రామయ్య సారు" అని అడిగింది పార్వతమ్మ.

" పాపం మా! ఆ సారుకి పిల్లలు లేరు కదా! మేడం చనిపోయి మూడేండ్లు అయినాదంట. ఒక్కడే ఉన్నాడంట. సారు గూడా వాళ్ళ నాయనకు ఒక్కడే కొడుకు కదా ! పాపం ఒంటరితనంతో అన్నీ పనులు తానే చేసుకోలేక శానా ఇబ్బంది పడుతున్నాడంట మా!" అని సానుబూతిగా అన్నాడు శరత్.

" అవునులేరా ! భార్య తీరిపోయిన భర్తకు శానా కష్టం! మా అశ్రమంలో ఆరకంగా బాధ పడేటోళ్ళు ఉండారు. భార్య ఉంటే అవసరాలు టైం ప్రకారం తీరుస్తాది కదా!" అంటూ పార్వతమ్మ కూడా సానుబూతిగా మాట్లాడింది.

" నా పోన్ నంబరు సారుకు ఇచ్చింటి. రెండుమూడు సార్లుఫోను చేసిండె. హాసినితో గూడా శానా బాగా మాట్లాడినాడు మా! " అని ఉత్సాహంగా చెప్పాడు శరత్.

" హాసిని కూడా మాట్లాడిందా? వాళ్ళ అమ్మలేకపోవడం వలన వాళ్ళ నాయన కష్టం తెలిసిన పిల్ల కదా! ఈ సారుకూ పిల్లోల్లు లేరుకదా? దానికే ఆ అభిమానం ఉంటాది." అని అనింది పార్వతమ్మ.

" మా! నేను హాసినీ మొన్న ఒక విషయం

అనుకొనిండాము" అని నసిగాడు శరత్.

" ఏ విషయం రా? " అని ప్రశ్నించింది పార్వతమ్మ.

"మా ! నేను హాసినితో పెళ్ళికి సరే అని అంత తొందరపడి సెప్పలే. దాదాపు ఒక సంవత్సరం ఆమె ఆలోచనలు తెలుసుకొన్న తర్వాతనే ఊ అన్నాను. నిస్సహాయుల పట్ల ఆమె చూపే ప్రేమను గ్రహించినాకే సరే అన్నాను. ఒకరకంగా నిన్ను బాగా చూసుకొంటుందనే నమ్మకం కుదిరినాకనే నేను పెళ్ళి నిర్ణయం తీసుకున్నా". అన్నాడు శరత్.

" నేను అమాత్రం తెలుసుకోలేనారా ? నామీద నీకెంత ప్రేమో ఎంత చెప్పినా తక్కువే! హాసినమ్మ నా కోడలైనా కూతురుకన్న ఎక్కువ నాకు. మనిషి మనస్తత్వాన్ని గుర్తుపట్టేది ఎంత సేపు ?" అంటూ శరత్ ను సమర్థించింది పార్వతమ్మ.

" మా! నీ ముందు ఒక ఆలోచన పెడతాను. ఏమీ అనుకోవుగా !" అంటూ సంశయిస్తూ అడిగాడు శరత్.

" ఏమి అనుకునేడిది ఏమిరా ! అట్లా మాట్లాడతా ఉండావు. నీవేమైనా పరాయోడివా?" అంటూ ప్రశ్నించింది పార్వతమ్మ.

" కాదు మా ఈ రోజుల్లో సమాజంలో శానా మార్పులు వొచ్చిండాయి. ఒకరికొకరు తోడు లేకుండా ఒంటరిగా జీవించడం అసాధ్యమౌతోంది. ముఖ్యంగా ముసలితనంలో ! భర్తను కోల్పోయిన భార్యకు, భార్యను కోల్పోయిన భర్తకు ఒంటరితనం శాపంగా మారుతోంది. ఇలా ఒంటరిగా జీవిస్తున్న స్త్రీ పురుషులు తోడుకోసం, ఆసరా కోసం కలసి జీవించడం చేస్తూ ఉన్నారు. మా! పిల్లల నిరాదరణ కూడా ఈ నిర్ణయం వాళ్ళు తీసుకొనేందుకు ఒక కారణం. ఈ సహజీవనం శారీరకమైన అవసరాలకోసం కాకుండా, నాకు ఒకరు తోడున్నారనే ఒక భరోసాకోసమే మా!" అంటూ చెప్పుకొచ్చాడు శరత్.

" అవునులేరా ! ఆమధ్య ఏదో సినిమాలో కూడా సుహాసినీ, ఇంకో ఆయన అలానే ఉంటారులే! తప్పేముండాది? నాను మా ఆశ్రమంలో సూస్తుండాను గదా! అట్లాంటోళ్ళ అగచాట్లు" అని చెప్పింది పార్వతమ్మ.

" మా ! అందుకే నీ గురించి నేనూ, హాసినీ ఒక ఆలోచన చేసినాము"

" ఏమనిరా ?"

" మా! నీవు ఏమీ అనుకోనంటే చెబుతాను"

"అనుకోనులేరా"

" పుస్తకాలు బాగా చదువుతావు గదా ! ఆశ్రమంలో ఎంతోమందికి పరిణతితో కూడిన సలహాలు ఇస్తా ఉంటావు. నేను చెప్పే విషయం విని ఏమీ అనుకోరాదు మరి"

" సరేలేరా చెప్పు "

" మా! నీవు, రామయ్య సారూ కలసి ఉండొచ్చు గదా! సారు శానా మంచోడుమా! నిన్ను ఆశ్రమంలో ఉంచినందుకు నాకు చాలా గిల్టీగా ఉందిమా! నాకోసం నీవెంత కష్టపడ్డావొ నాకు తెలుసు. నా మనసుకు ఆవగింజంత కష్టం కలిగించకుండా పెంచావు. నాయన పేకాటలో అంతా పోగొట్టి చనిపోయేనాటికి అయిదు లక్షల అప్పు పెట్టినా ఒక్కరితో ఒక్క మాట అనిపించుకోకుండా ఆణా పైసలతో సహా నాయన చేసిన అప్పులు కట్టేశావు. వచ్చే పదైదు వేల పెన్షన్ తో నన్ను చదివించావు. మా ! ఈ భూమి పైన నాకు దేవుడు ఎవరైనా ఉన్నారా అంటే అది నీవే మా! నీవు ఆవృద్ధాశ్రమంలో ఉండడం నామనసుకు శానా కష్టంగా ఉందిమా! నేను, హాసినీ ఇండియా వస్తామంటే వొప్పుకోవు, నేను మీకోసం ఎలా కష్టపడినానో నీ పిల్లోల్లకోసం నీవు ఆమాదిరి కష్టపడల్ల అంటావు. ఒక్క సారి ఆలోచించు మా! " అని కళ్ళ నీళ్ళ పర్యంతం అయ్యాడు శరత్. శరత్ కళ్ళలో నీళ్ళు పెట్టుకోవడం చూసిన పార్వతమ్మ కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

" మా తొందర ఏంలేదు. బాగా ఆలోచించే నిర్ణయం తీసుకో. నీవు చేసే ఆలోచనమీద నాకు శానా గౌరవం ఉంటాది. నీవు నాకోసం కాకుండా నీకోసం ఎలాంటి నిర్ణయం తీసుకొన్నా నాకు సంతోశమే మా! " అన్నాడు శరత్.

" రెండురోజులు టైం ఇవ్వరా" అంది పర్వతమ్మ ఉద్విఘ్న వాతావరణాన్ని తేలిక చేసేందుకు.

" మా ! ఇంగోసారి చెబుతున్నా! నేను ఇలా అన్నానని తప్పుగా అనుకో మాకు. చిన్నోడిని మా ! తప్పుగా మాట్లాడి ఉంటే మన్నించుమా " అంటూ వేడు కొన్నాడు .

" ఉంటాను రా " అంటూ కన్నీరు తుడ్చుకొంటూ పార్వతమ్మ స్కైప్ ముందునుంచి లేచి ఇయర్ ఫోన్స్ పక్కన పెట్టి మొహం కడుక్కొనేందుకు వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళింది.

♦♦♦

డార్మేట్రీలో మంచంపై పడుకొని ఉన్న పార్వతమ్మకు నిద్ర పట్టడం లేదు. మనసు అల్లకల్లోలంగా ఉంది. రామయ్య సారుతో కలసి జీవించమని అర్థించిన శరత్ దీనమైన మొహమే

గుర్తుకు వొస్తోంది. తను రామయ్య సారుతో కలసి జీవించడం సాధ్యమా! మగవారిలో స్త్రీలను నిజంగా తమతో సమానంగా చూసుకొనేవారుంటారా? తన బిడ్డ శరత్ కూడా మగవాడే గా? మంచివాడేనా? ఏమో హాసినికి బాగా తెలిసి ఉంటాది. బయటకు మంచివారనిపించుకున్న మొగవాళ్ళు ఇంట్లో భార్యల పట్ల ఎంత అమానుషంగా ప్రవర్తించేవారిని తను ఎంతమందిని చూడలేదు. ఎవరిదాకా ఎందుకు ? తన భర్తే తనను మానసికంగా ఎంత వేదించలేదు. ఎంత భాధ్యత లేకుండా ప్రవర్తించేవాడు. పేకాట మోజులో పడి తనను, శరత్‌ను ఎంత నిర్లక్ష్యం చేసేవాడు? రోజులతరబడి ఇంటికొచ్చేవాడే కాదు. జీతం అంతా పేకాట అప్పులకే సరిపోయేది. శరత్ చదువుకు తన అన్న చేయి అందించకపోతే శరత్ ఏమైపోయేవాడు? ఎవరైనా తన తోటి ఉపాధ్యాయులు ఇంటికొస్తే వంటరూం లోకి వెళ్ళిపొమ్మనేవాడు. ప్రక్కన రూంలో పేకాటకు కూర్చొంటే వేళా పాళ లేకుండా టిఫిన్లు, టీలు చేయాలి. తనమీద అనుమానంతో వాటిని మాత్రం తనే వచ్చి పేకాట రూముకు తీసుకు వేళ్ళేవాడు. తన అన్న ఊరినుండి తనను సూసేందుకు వస్తే కనీసమర్యాద కూడా ఇచ్చేవాడు కాదు. అన్న ఊరు వెళ్ళేంత వరకూ పేకాటలోనే ఉండి ఇంటికి కూడా వచ్చేవాడు కాదు. తన అన్న వ్యవసాయదారుడనీ, తను ఉద్యోగస్తుడనీ అహంకారంతో ఉండేవాడు. “ఉద్యోగస్తుడు అని ఇస్తే నీ తలరాత ఇలా ఉందేమమ్మా?” అంటూ కన్నీరు పెట్టుకొని వెళ్ళే వాడు తన అన్న. తనకు ఒంటరిగా ఇంట్లోనే ఉండడం కష్టమై, స్కూల్లో లైబ్రరీలో ఏమైనా పుస్తకాలు ఉంటే చదువుకోవడానికి తెమ్మంటే కోపంతా ఇంతెత్తు లేచేవాడు. ఆడముండలకు చదువెందుకని కసిరేవాడు. దేవుడా నాకు ఆడ బిడ్డను ఇయ్యకుండా గొప్ప సాయం చేసావు తండ్రీ అనుకొనేది. ఒకసారి ఉపాధ్యాయ సంఘం సభలకు వెళ్ళి “ జానకి విముక్తి” నవల తెచ్చాడు. ఇంట్లో టేబుల్‌పై ఉంది కదా అని తను భోజనానికి వచ్చే సమయానికి ఒక ఇరవై పేజీలు చదివిందో లేదో ఇంతెత్తు ఎగిరిపడ్డాడు. ఎవడితో లేచి పోయేందుకు ఈ బుక్కు చదువుతున్నావని అనరాని మాటలన్నాడు. ఎవరో తెమ్మంటే తీసుక వచ్చాననీ, ఇంట్లో మరిచిపోవడం తన తప్పయ్యిందని గొణుగుకొంటూ ఆ పుస్తకాని తీసుక వెళ్ళిపోయాడు. అంతా ఇంతా నరకం కాదు అతను చూపించినది. ఇంటి చుట్టుపక్కల స్త్రీలతో మాట్లడుతూ ఉంటే పార్వతమ్మకు తెలిసిందేమంటే కొంచెం అటు ఇటుగా అందరి కథలూ ఈ మాదిరిగానే ఉన్నాయి.

ఇప్పుడు ఈ రామయ్యతో కలిసి జీవించడం అంగీకరిస్తే అతను తన మీద పెత్తనం చేయదన్న గ్యారంటీ ఏమిటి? ఇప్పుడు ఈ ఆశ్రమంలో ఎంత ఆనందంగా ఉన్నాను. నాకంటూ ఇష్టమైన ఒక జీవన విధానాన్ని మలచుకొన్నాను. నేను ఇలా ఉండాలి అనుకొని నాకు ఇష్టమైన జీవితాన్ని గడుపుతున్నాను. ఇంకా ఇక్కడ ఎన్ని బాధ్యతలున్నాయని. శారదమ్మ, ఆది శేషయ్యల పిల్లలు డబ్బుకు కక్కుర్తి పడి వారికి డార్మెట్రీ ఆప్షన్ తీసుకోవడం వలన ఆ ముసలి దంపతులు ఈ వయసులో ఎన్ని ఇబ్బందులు పడుతున్నారని. నెలకు ఒక్క మూడువేలు అదనంగా చెల్లిస్తే వారిద్దరినీ షేరింగ్ రూముకు మార్చవచ్చు. పాపం రాత్రి తొమ్మిది అయ్యిందంటే ఇరువురూ పరాయొల్లై పోతారు. ఎవరి డార్మెట్రీకు వారెళ్ళిపోతావుంటే మనసుకు ఎంత కష్టంగా ఉంటుంది. రాత్రిపూట భార్యా భర్తలు ఒకేచోట నిద్రించడం ఈ వయసులో శారీరక అవసరం కోసం కాదు. నాకూ ఒకరు తోడున్నారనే ఒక ధైర్యం కోసం. ఈ నెల నుండి తన పెన్షన్ నుండి మూడు వేలు చెల్లించి వారిని ఒక చోటకు చేర్చాలనుకొంటున్నది. మరణపు అంచున వున్న సుబ్రమ్మ తన పిల్లలు ఇక్కడ తను చనిపోయినా రారనీ, బ్రాహ్మణ సాంప్రదాయంలో తన భర్త కర్మకాండ జరిగిన హంపీలోనే తన కర్మకాండకూడా శాస్త్రోకంగా జరిపించాలనీ, ఆ బాధ్యత పార్వతమ్మదేననీ మాట తీసుకొంది. ఆశ్రమంలో పనిచేసే ఆయమ్మ కొడుకు కూడా ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హాసినే వాడి ప్రతిభను గుర్తించి వాడి చదువు భాధ్యతను తను తీసుకొంది. ఇలాంటి బాధ్యతలను రామయ్య ఒప్పుకొంటాడా? పుస్తకాలు చదవనిస్తాడా? రెండు సంవత్సరాలుగా వెన్ను నొప్పితో మంచంపై ఉండి, తనను అక్కా అని ఆప్యాయంగా పిలిచే నారాయణస్వామితో ఈ రామయ్య మాట్లాడనిస్తాడా? ఈ కలసి జీవించే ప్రతిపాదనే నాకు వద్దు. నాకు ఈ జీవితమే చాలా సంతృప్తి కరంగా ఉంది. నాకు ఈ జీవితమే బావుంది. మరో ఉచ్చులో ఇరుక్కోవడం ఎందుకు? మరొక నరకంలోకి ప్రవేశించే ధైర్యమూ తనకు లేదని అనుకొంటూ గట్టి నిర్ణయం తీసుకొంది పార్వతమ్మ. కొత్త బాధ్యతల నిర్ణయం వలన రోజూ ఆరు గంటలకు నిద్రలేచే పార్వతమ్మ ఈ రోజు ఐదున్నర గంటలకే నిద్ర లేచింది. ♦

కవిత

## అందరం కలుద్దాం

- బుర్రా సాయిబాబు
9291291751

నాలుగు గడ్డిపరకల్ని ఏరుకొనే క్రమంలో
దారితప్పిన గొర్రెల్లా... కొండలూ గుట్టలూ
పట్టి తిరిగినోళ్ళం
ఒక దీర్ఘచతురస్రపు నలుపుతెలుపు చిత్ర పటంలోంచి
రాలిపడి చెల్లా చెదురైన తునకలం
కాలపు శరాఘాతానికి పగిలిన నక్షత్రపు
వెలుగులు తలోదిక్కుకీ పాకిపోతుంటే
పటం మధ్యలో కూర్చున్న
తెల్లకండువా పెద్దాయన రోదించే ఉంటాడు,
ప్రతి విస్ఫోటనం తరువాత, కొత్త సమీకరణాలు
పుడతాయిట కదా!
కలుద్దాం అందరం మరొకసారి,



కలుసుకుందాం,
కలుసుకున్నప్పుడు రూపాయల గురించి మర్చిపోయి
మనుషుల్లా పలకరించుకుందాం

తరాలు మారినప్పుడు తెగిపడ్డవి,
కొత్తగా మొలిచినవి

పక్కపక్కల ఉంచుకుని పోల్చుకొని చూద్దాం
కాలం తెచ్చిన కొమ్ములు గొప్పవా
పెద్దాయన చేసిన హెచ్చరికలు గొప్పవా అని
తీర్మానించుకుందాం
కుచించుకు పోయిన మనిషి మనస్సులో
వైశాల్యాన్ని పెంచి ఆకాశాన్ని ప్రతిష్ఠిద్దాం,
ఈసారి మనం కలిసినప్పుడు ◆

---

## ఏ పాట నే పాడను?

- స్వర్ణలత గొట్టిముక్కల
99510 95636



ఈ రోజు
నివ్వెరపోయి
నీరవమై
నిస్సహాయంగా
నిలుచున్న కాలాన్ని
చెమ్మగిలే కంటినీ
గుండెనూ
అదిమి పట్టి
కదిలించాలనుకున్నా
ఊరడించాలనుకున్నా

కానీ
నీ పాటకు సరితూగే మాట
నా అంతరాంతరాల్లోనూ లేదని
మరేచోటా ఉండదని అర్థమయింది

నీ పాటనే మళ్ళీమళ్ళీ పాడుకోవడం తప్ప
మరేదారీలేదనీ కూడా
అర్థమయింది

అవును
ప్రతి ఉదయం సరికొత్త శ్వాస నాలో నింపింది నీ పాటే
ఒంటరి వేళల్లో
నా తోడై నడిచింది నీ పాటే

పరవశంగా నా మనసునీ తనువునీ వెలిగించింది కూడా నీ పాటే
దుఃఖాశ్రువులు ముంచెత్తకుండా మమతై మరపించిందీ నీ పాటే

పాటైన
నీ ప్రాణానికి
ప్రాణమైన నీ పాటకి
ఇంకేమివ్వగలను మళ్ళీ నీ పాటనే తప్ప ◆

విశ్లేషణ

# సమాజ అంతర్ బహిర్ స్వరూపమే 'జలగలవార్డు'




గొరుసు జగదీశ్వర రెడ్డి



- డా. ఎ. రవీంద్రబాబు
8008636981

సాహిత్య స్వరూప స్వభావాలను నిర్హేతుకంగా అర్థం చేసుకోవాలంటే సమాజంలోని మనిషి అంతర్ బహిర్ చేతనలపై అది చూపే ప్రభావాన్ని క్షుణ్ణంగా అంచనావేయాలి. రచయిత మానసిక ప్రపంచంలో కలిగే సంచలనాత్మక ప్రకటిత భావానికి కారణం బాహ్య సమాజమే. చలం, శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాస్తూ "తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వమ"ంటాడు. సాహిత్య సృజనకారుడి స్పందన, ప్రతిస్పందనలకు స్పష్టమైన నిర్వచనం ఇది. సమాజం కేవలం బయట మాత్రమే కాదు, సృజనశీలి అంతరంగంలోనూ, ఆ అంతరంగం నుంచి జనించే సాహిత్య ప్రక్రియలోని ప్రతి అశంలోనూ ఉంటుంది. అదే వాస్తవికతకు మూలాలను సిద్ధం చేసే క్రియ. కథ, కవిత్వం, నవల, నాటకం... ఏ ప్రక్రియలో అయినా శిల్పరహస్యాలను ఛేదన చేస్తూ, వాటికి వస్తువుతో ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే ఆ రచనను కచ్చితంగా అవగతం చేసుకోవచ్చు.

సమకాలీన సమాజంలో కథాప్రక్రియ ముందడుగులో ఉంది అనడంలో సందేహం లేదు. కథల్లోని పాత్రలు, వాటి సంఘర్షణ, బహిర్ ప్రవర్తన, భాషతో పాటు సన్నివేశాలు, వర్ణనల వంటి వాటిలో సమాజం ప్రతిబింబిస్తుంది. గొరుసు జగదీశ్వరరెడ్డి 30కి పైగా కథలు రాశారు. వీటిలో పదింటిని "గజ ఈతరాలు" పేరుతో ప్రకటించారు. "జలగల వార్డు" కథ "గజ ఈతరాలు" సంపుటిలోనిదే అయినప్పటికీ 27 డిసెంబర్ 1998న ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధంలో ముద్రించబడింది. రచయిత సమాజంతో రాజీపడలేక తన అంతరంగంతో యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధ ప్రతిఫలనమే ఈ రచన. అందుకే రచనలో రచయిత వేటితో రాజీపడలేకపోయాడో, వేటి వల్ల సంఘర్షణకు గురయ్యాడో అవే కనిపిస్తాయి.

"జలగల వార్డు" కథ ఉత్తమ పురుష దృష్టికోణంలో నడుస్తుంది. ప్రతి సన్నివేశాన్ని, సంవాదాన్ని, సంఘర్షణను కథకుడు తన దృష్టితోనే చూశాడు. కథ మొత్తాన్ని స్వీయ అనుభవంలా గీశాడు. రచయిత, వాళ్ల అమ్మకు పక్షవాతం వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తాడు. అక్కడ ఎదురైన ప్రత్యక్ష అనుభవాలను కథలో దృశ్యాలుగా చూపించాడు. హాస్పిటల్ నేపథ్యంతో సాగే ఈ కథలో సమాజంలోని అనేక అంశాలు కళ్లకు కడతాయి. డాక్టర్లు, నర్సులు, వార్డ్ బోయ్‌లు, రోగుల ప్రవర్తన, మాట తీరుతోపాటు బెడ్‌లు, బాత్‌రూమ్‌ల స్థితినీ తెలియజేస్తాయి. రచయిత మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రి నీలినీడల చిత్రాన్ని అక్షరాలతో గీశాడు.

వార్డ్‌లో ఒంటికెళ్లిన వాళ్లను స్వీపరు అరవడంతో కథ ప్రారంభమవుతుంది. తన ఉద్యోగం పోతుందని బాధపడే వార్డ్ బోయి స్థితిని రచయిత సామాజిక ఆర్థిక కోణాల్లో అర్థం చేసుకోవడంతో ముగుస్తుంది. ఈ రెండింటి మధ్య ఎన్నో సన్నివేశాలు, సంఘటనలు, పాత్రలు, వాటి సంఘర్షణలు, వాదాలను వాస్తవికంగా చిత్రించాడు జగదీశ్వరరెడ్డి. సమాజంలోని అనేక రుగ్మతలను, ఆర్థిక అసమానతల్లోంచి అవస్థలు పడుతున్న మనుషుల స్థితిగతులను, వారి బాధాతప్త

హృదయాలను కథలో సూక్ష్మంగా చెప్పే ప్రయత్నం చేశాడు.

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడినవాళ్లు. వాళ్ల స్థితిని ఆసరాగా చేసుకొని వాళ్లతో అక్కడి సిబ్బంది ఎలా మాట్లాడతారు? ఎలా ప్రవర్తిస్తారు?, బిక్కుబిక్కుమంటూ భయంతో రోగులు ఎలా ఉంటారు?... అన్నీ వివరిస్తాడు కథకుడు. వార్డ్‌లోని రోగులకోసం బ్రెడ్డు పాలు వచ్చినప్పుడు కథకుడితో అరవై ఏళ్ల ముసలామె "బాబ్బాబూ.. పాలు బ్రెడ్డూ అక్కర్లేకపోతే నాకిచ్చావా" అని దీనంగా అడుగుతుంది. ఆమెకి "తెచ్చాక ఇస్తాలే" అని చెప్తాడు రచయిత. ఆ మాటలు విన్న ఎదురు బెడ్ పేషంట్ వచ్చి "ఏటి బాబూ... పొద్దుటాలిచ్చే బెడ్డూ, పాలూ ఆ ముసిలిఖండికి ఇచ్చేసినారేటి? రోజూ ముసిల్దాయి అందరి దగ్గిరా సిగ్గూ, సెరవూ ఒగ్గీసి అడిగీసి తీసీసుకుంటాది. నాకు ముందూ, యెనకా ఏటీ నేదు బాబూ, ఆ మొగుడు సచ్చినోడు తాగీసి ఎక్కడో తొంగుండి పోతాడు. ఇంటి దగ్గిర సంటి పిల్లలున్నారు బాబూ... ఆకలాకలని గోలగోల సేత్తారు. మీకు మజ్జాన్నవూ, రేతిరీ భోజనం ఇత్తారుకదా, నాకిచ్చీయండి... సందేళకి మాయమ్మ వత్తాది. దానికిత్తే, ఆదొట్టుకెళ్ళి పిల్లలకెడతాది" అని అడుగుతుంది. "పేషంట్లు వాళ్ల జబ్బుల్ని నయం చేసుకోడానికి వచ్చినట్లు కన్పించడం లేదు. హాస్పిటల్ వాళ్ళు పెట్టే తిండికోసం లేని రోగాల్ని నిజంగా తెచ్చుకుంటున్నారని పించింది" అని నిజాన్ని అక్కడే ప్రకటిస్తాడు రచయిత.

వార్డ్‌బోయ్ వస్తుంటే భయంగా వణికిపోతూ, పిల్లిలా స్థంభం చాటును నక్కుతుంది ఓ పేషంటు. అటు ఇటు గెంతుతూ డాక్టర్ వచ్చేసరికి చలిజ్వరం వచ్చినట్లు వణికిపోతూ బెడ్‌కు అంటుకుపోయిన మరో ముసలమ్మ "ఒళ్లంతా ఒగటే సలుపు. కడుపులో పేగులన్నీ కరకర మంతాయి. మయదారి జబ్బునాగుంది బాబూ" అని చెప్తే డాక్టర్ చిన్నగా నవ్వుతూ మందులు రాసిస్తాడు. కానీ హౌస్ సర్జన్లు వస్తే తన రోగం గురించి ఎక్కడ చెప్పాలోనని తప్పించుకోడానికి ప్రయత్నించి వాళ్లకు దొరికిపోతుంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల గురించి కథకుడు చిత్రించిన దృశ్యాల వెనుక వాళ్ల వాస్తవిక జీవితం దాగి ఉంది. రోగం లేకపోయినా తమ తిండికోసం, ఇంట్లోవాళ్ల కడుపు నింపడం కోసం రోగిగా నటించేవాళ్ల దీనస్థితి ఉంది. వార్డ్ బోయ్‌లకు, నర్స్‌లకు, హౌస్ సర్జన్లకు, డాక్టర్లకు అబద్దాలు చెప్తూ, భౌతికంగా మానసికంగా ఓడిపోతూ, తమనుతాము నైతికంగా చంపుకుంటూ, పక్కల రోగులకు ఇచ్చే పాలు, బ్రెడ్డు, భోజనాలతో బతుకు ఈడ్చడం వెనక సమాజంలోని అట్టడుగు పొరల్లో జీవిస్తున్న ప్రజల కన్నీటి వ్యధ ఉంది.

కథలో నర్స్‌ల గురించిన ప్రస్తావన, వర్ణనలు అక్కడక్కడా కనిపిస్తాయి. ఒకచోట నర్సులు వార్డులో ఉన్న పరుపులు సర్దడం. మరోచోట బ్రెడ్డూ, పాలు వచ్చేయి అని చెప్పడం. ఇంకోచోట "ఏడుగంటలు అయ్యేసరికి నర్సులంతా బురదనీటిలో కదలాడే బాతుల్లా వార్డులో అటూ, ఇటూ పరుగెడుతున్నట్లు నడుస్తూ, ప్రతి పేషంటు దగ్గరా కేస్ షీట్స్ వున్నాయో, లేవో చెకప్ చేసుకుంటున్నారు. హెడ్ నర్స్ రావడంతోనే "ఈ కుర్చీ ఇక్కడెందుకుందీ? ఆ పేషంట్ దగ్గర మరో మనిషి ఎందుకు ఎగ్రస్టా వున్నాడు?" రకరకాల ప్రశ్నలను గుప్పిస్తూ తెల్లని ఐరావతంలా కదిలి వస్తూ అరవడం మొదలుపెట్టింది." అని వాళ్ళ భౌతిక రూపాల్ని, వృత్తిని వర్ణిస్తాడు రచయిత. హౌస్ సర్జన్ల డ్యూటీస్ గురించి ఓ పాత్ర చెప్తూ "బెడ్ చుట్టూ మూగేత్తారు. నీళ్ళు తాగాలనిపించినా. ఒగటికెళ్ళాలన్నా సిటంకదల్తానికీల్లేదంటారు. ఏటో నా జబ్బు గురించే దిక్కు మాలిన పశ్నల్నీ ఏత్తారు. అన్నీ యిని ఓపిగ్గా బదులుసెప్పాళాల్లకి. నిన్న మజ్జానం దాకా ఒగ్గల్లేదు" అని అంటుంది. డాక్టర్ల విధుల గురించి ప్రస్తావిస్తూ... "వార్డులోకి ఎనిమిదింటికి డాక్టరు వస్తాడు. అతనితోపాటు ఇద్దరు హౌస్ సర్జన్లూ, మరో ఇద్దరు సిస్టర్లూ, ఒక హెడ్ నర్సూ ఉన్నారు. "ఎలా ఉంది?" అని అడుగుతూ, ప్రతి పేషంట్ దగ్గరున్న కేస్ షీట్ ను చూస్తూ, నర్సులు రాసిన బి.పి.ని, టెంపరేచర్ రీడింగునీ చెకప్ చేస్తూ మందులు, ఇంజక్షన్లూ రాస్తున్నాడు. డాక్టరు ప్రతి చర్యనీ జాగ్రత్తగా గమనిస్తూ, అతని మాటల్ని అక్షరబద్ధం చేస్తున్నారు హౌస్ సర్జన్ కుర్ర డాక్టర్లు".

కథకుడు వాళ్లమ్మ దగ్గరకు డాక్టర్ వచ్చినప్పుడు "పెరాలిసిస్ ఎప్పుడు మొదలయ్యిందీ, వచ్చి ఎన్నాళ్ళయిందీ... అన్నీ వివరంగా డాక్టరుకు చెప్పాను.... ... అమ్మ కంటి చూపునీ, వినికిడినీ పరిశీలించి తను నోట్సులో రాసుకున్నారు హౌస్ సర్జన్లు. అమ్మకు పెరాలసిస్ రావడానికి గల కారణాల్ని, మెదడులోని రక్తనాళాలు ఎలా ప్రసరణ శక్తిని కోల్పోతాయో అన్నీ వివరంగా చెప్పుకుపోతున్నాడు డాక్టర్. పనిచేయని అవయవాలని నొక్కి నొక్కి చూస్తూ... ఆమె ఫీలింగ్స్ ని స్టడీ చేస్తున్నారు." అంటూ డాక్టర్ల నిబద్ధతో కూడిన వృత్తి నిర్వహణనీ చెప్తాడు. జనరల్ ఆసుపత్రిలో నర్స్‌లు, హౌస్ సర్జన్లు, డాక్టర్లు తమ వృత్తికి కట్టుబడి నిజాయితీగా పనిచేయడాన్ని కథలోని ఈ వాక్యాలు రుజువు చేస్తాయి.

హాస్పిటల్ లోని చెడు, మంచి... రెండింటినీ బేరీజు వేసే రచయిత సూక్ష్మ దృష్టికి నిదర్శనం ఇది.

జనరల్ హాస్పిటల్ ఎలా ఉంటుందో, ప్రధానంగా రెండు అంశాలలో చూపించాడు రచయిత. ఒకటి బెడ్‌లు, రెండు బాత్ రూమ్. బెడ్‌ల గురించి చెప్తూ నర్స్ లు "వార్డులో ఉన్న తుప్పుపట్టిన మంచాలపైన ఎన్నాళ్ళ నుంచో పేషంట్ల ఉచ్చలకీ, వాంతులకీ అట్టగట్టుకుపోయిన మరకల పరుపులని సర్దుతూ వాటిపైన తెల్లని బెడ్ షీట్లని పరుస్తున్నారు" అని వర్ణిస్తాడు. బాత్ రూమ్ గురించి "నిన్న రాత్రి వార్డు పక్కనే వున్న బాత్రూమ్ లోకి వెళ్ళాల్సివచ్చింది. అక్కడ నేలంతా అంగుళం దళసరి నాచు... కాలుమోపి, జారబోయి ఎలాగో తమాయించుకోబట్టి సరిపోయింది గానీ, లేకపోతే ఈ పాటికి ఏ ఆర్థోపెడిక్ వార్డులోనో పేషంట్ గా వుండాల్సి వచ్చేది. ఒక గంటపాటు ఆ బాత్రూమ్‌లో ఉంటే ఆ దుర్గంధానికి ఊపిరితిత్తులు చెడిపోవటం ఖాయమనిపించింది. వార్డులోని పేషంట్లు, వారి తాలూకూ మనుషులూ కారిడార్ లోనే అన్ని పనులు ఎందుకు కానిచ్చేస్తున్నారంటే... తప్పు వాళ్లదా?" అంటాడు. ఈ ప్రశ్న కేవలం అపరిశుభ్రత గురించి మాత్రమే కాదు, జనరల్ ఆసుపత్రులకు నిధుల కొరత, యాజమాన్య నిర్లక్ష్యం, పట్టించుకోని ప్రజాప్రతినిధులను విమర్శించడమూ ఉంది.

ఈ కథలో రచయిత ఎత్తిచూపిన ముఖ్య సమస్య జనరల్ హాస్పిటల్‌లోని లంచాలు. లంచాన్ని తీసుకునే వ్యక్తుల స్వభావాన్ని, వాళ్ల జీవితాలను, ఆర్థిక స్థితిగతులను కూడా కథలో చర్చకు పెట్టాడు జగదీశ్వరరెడ్డి. లంచం ప్రస్తావన కథలో అనేకచోట్ల కనిపిస్తుంది. రచయిత వాళ్లమ్మను హాస్పిటల్‌కు తీసుకొచ్చినప్పుడు వీల్ ఛైర్ అవసరమవుతుంది. "వార్డుబోయ్ ని గంటసేపు బ్రతిమిలాడితే విసుక్కుంటూ, కాస్త అమ్మ పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు వీల్ ఛైర్ తీసుకొచ్చేడు. తీరా వార్డుదాకా తీసుకొచ్చేక "మీరు వెళ్ళాల్సింది ఫస్ట్ ఫ్లోర్ లోని వార్డుకి. అక్కడికి రావడం కుదర్దు. స్ట్రెచర్‌లో తీసుకెళ్ళండి. అక్కడ వార్డ్ బోయ్ వుంటాడు. నాకు పదిరూపాయలివ్వండి...". అని అడిగి తీసుకుంటాడు.

మరోచోట వార్డ్ బోయ్ వెంకట్రావు మామూలు ఇవ్వలేదని ముసలమ్మను, రచయితను బెదిరిస్తాడు. "పన్నెండో నంబరు బెడ్ పేషెంటు తాలూకూ మీరేనా? నిన్న మజ్జానం జాయినయ్యారట కదా! ఏటి బాబూ, ఇంకా మాకు మామూలు యీయినేదు? గేటు దగ్గిరా, ఇక్కడా అంతా కలిసి నల్గురువ్. రెండొందలిచ్చీయండి. సర్దీసుకుంతాం ఎలాగో" అతను ఎవర్నడుగుతున్నాడో, ఎందుకడుగుతున్నాడో మొదట అర్థం అవలేదు. "ఏటి బాబూ, తవర్ని కానట్టు అల్లగసూత్తారేటి? మిమ్మల్నే అడుగుతా... వోర్డు బాయ్‌ల్కి పీజులిచ్చుకోవాల, నేకపోతే మీ తాలూకూ మనుసులెవ్వరూ లోనకి రాటానికీల్లేదు" నేను సమాధానం ఇచ్చేలోగా.. జాగిలంలా పసిగట్టి, స్థంభం చాటునున్న ముసలమ్మ రెక్కపట్టి లాగేడు." అని వార్డ్ బోయ్ లంచంకోసం ఎలా బెదిరిస్తాడో చెప్తాడు. కథకుడు మాత్రం కోపంగా ఒక్కపైసా ఇవ్వనని అతడిపై అరుస్తాడు. అతడు ఆ అరుపుల్ని లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా డాక్టరు వస్తున్నాడని తెలియడంతో "పేషంట్లదగ్గరున్న వాళ్ళనందరినీ గేదెల్ని తోలినట్లు అదిలించడం మొదలుపెడతాడు."

ఇంకో సన్నివేశంలో కథకుడు వెంకట్రావు గేటు దగ్గర గొడవపడడం వింటాడు. డాక్టరు వచ్చేటైంకు వెళ్లలేదని కడుపునొప్పితో బాధపడుతున్న రోగి భర్తను వాతలు పడేటట్లు బాదాడని కూడా తెలుస్తుంది. డ్యూటీ నర్స్‌కు కంప్లైంట్ చేసినా ఫలితం ఉండదు. మరో వార్డ్ బోయి అప్పారావు కథకుడి అత్త కేరేజ్ తీసుకొస్తుంటే రెండ్రూపాయలు తీసుకొని లోపలకు పంపుతాడు. పురుగుల మందు తాగి చనిపోయిన యువతి అన్న, సామాను మర్చిపోయి రెండు రోజుల తర్వాత వచ్చి, తమ బాధను రచయితతో వెల్లబోసుకుంటాడు. "పోస్టుమార్టంకు చెల్లి శవాన్ని స్ట్రెచర్ పైకి చేర్చింది మొదలు, వాళ్ళు మమ్మల్ని నానా హింసకు గురిచేశారండీ... వీళ్ళకు అడుగడుగున ముడుపుల్ని చెల్లించలేక... చచ్చామనుకోండి. తీరా మా బాధల్లో మేం ఉన్నామా... పంచనామా చేయడానికి మమ్మల్ని మా ఊరెళ్ళి పోలీసుల్ని తీసుకురమ్మన్నారు. లేకపోతే వెయ్యి రూపాయలు ఇస్తే ఆ తంతు తామే కానిచ్చేస్తాం అన్నారు. ఏం చేస్తాం? ఇవ్వక తప్పింది కాదు మరి. ఆ తర్వాత శవం బయటకి వచ్చేదాకా మా ప్రాణాలు తోడేశారు కదండీ!

చెల్లి శవం చుట్టూ రాబందుల్లా రెక్కలు చప్పుళ్ళు చేస్తూ మా వెంటే ఉన్నట్లు అన్పించింది. చివర్లో చెల్లి శవానికి చుట్టిన బట్టకు కూడా ఐదువందలు వసూలు చేశారండీ!" అని చెప్తాడు. అంతలో వార్డ్‌బోయ్ వచ్చి మా కివ్వాల్సిన మామూలు ఇవ్వలేదని అతడిని అడుగుతాడు. అతడికి కోపం వస్తుంది. ఇద్దరి మధ్యా గొడవ జరుగుతుంది. ఆ గొడవలో వార్డ్ బోయ్ చెవుకు దెబ్బతగిలి రక్తం కారుతుంది. అతడికి తగిన గుణపాఠం జరిగింది కదా...! అని జగదీశ్వరరెడ్డి అంతటితో కథ ముగించడు. వెంకట్రావు లంచం తీసుకోవడం వెనక ఉన్న రహస్యాన్ని, ఆ పనిచేయిస్తున్న పరిస్థితులను అతడితోనే చెప్పిస్తాడు. కథలో అప్పటి వరకు వార్డ్ బోయ్ ప్రవర్తనను చెప్పిన కథకుడు అతడి అంతరంగంలోని బాధను వెల్లగక్కిస్తాడు.

ఇదే కథకు ఆయువుపట్టు.

"ఇక్కడ కట్టవంతా నాదీని, సుకవంతా నన్నిక్కడుంచి నోడిదీనీ, నాకొచ్చీ జీతంనోంచి మూడొంతులు దొబ్బేసి, నాకు పావొంతు ఇత్తాడు. ఆడు మరో ఉజ్జోగువో, యాపారవో సేనుకుంతూ కాలుమీద కాలేనుకొని, దర్జాగా రాజానాగుంతాడు... నానూ... మీ అందరి సేతా సిగ్గూ సెరం వొగ్గేసి సప్పుదెబ్బలు తింతూ మీ నోటుమ్ము నా ముకం మీదూయించుకుంతాను... ఊసీయండి... రండి". "ఈ ఇసియం తెలిస్తే ఆడు నా ఉజ్జోగం తీసేత్తాడ్రా... రేపుడ్నుండి నా నేట్రా తిని బతకాలా... నా పెళ్ళాం పిల్లలు ఎక్కడ్రా ముస్టెంత్తుకు బతకాల" వెంకట్రావు జీరగొంతుక మెల్లమెల్లగా దూరమవుతోంది" అని అతడి ఉద్యోగ అభద్రతను, కుటుంబ కష్టాలను చెప్పిస్తాడు రచయిత. అప్పటి వరకు ఆ పాత్ర మీదున్న కోపం పోయి పాఠకులకు జాలి కలుగుతుంది. హృదయాలు ఆర్ద్రతతో నిండిపోతాయి. సరిగ్గా చలం చెప్పిన అంతర్ బహిర్ యుద్ధారావమే ఈ పాత్రలోని బాహ్య అంతర్ ప్రవర్తనలో, జీవితంలో కనిపిస్తుంది.

పేషంట్లను లంచం ఇవ్వమని వేధించడం అనేది వెంకట్రావు బాహ్య స్వరూపం. కానీ ఆ లంచం తీసుకోవడానికి ప్రేరేపించిన పరిస్థితులు..!? వేరే వాళ్ల ఉద్యోగాన్ని చేస్తూ ఒక్క వంతు మాత్రమే జీతంగా తీసుకుంటూ దోపిడీకి గురవుతున్నాడు. కుటుంబపోషణ భారం, ఉద్యోగ అభద్రత... అన్నీ కలిపి అతడిని లంచంవైపు నడిపించాయి. ఇవి సమాజంలో ఉన్న నిరుద్యోగ సమస్యను, ఉద్యోగస్తుల అక్రమాలను కళ్లకు కడతాయి. సమాజానికి పునాదైన ఆర్థికాంశం ప్రజల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తుందో కథలో వ్యక్తమవుతుంది. లంచాలు తీసుకుంటున్న వెంకట్రావు లాంటి వార్డ్ బోయ్‌లు, కేవలం తిండికోసమే ఆసుపత్రుల్లో చేరిన ముసలమ్మల జీవితాలన్నీ ఆర్థికాంశంతోనే ముడిపడి ఉన్నాయి. జలగలు రక్తాన్ని ఎలా పీల్చుకుంటాయో ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులను లంచాలపేరుతో అలా పీల్చుతున్నారని చెప్పడానికే జగదీశ్వరరెడ్డి ప్రతీకాత్మకంగా కథకు "జలగల వార్డ్"నే పేరుపెట్టాడు. చనిపోయిన యువతి అన్న కథకుడితో తమను హాస్పిటల్ వాళ్లు ఎలా పీడించారో చెప్పే సందర్భంలో రచయిత భక్తికి సంబంధించిన "ముడుపులు చెల్లించడం" అనే పదాన్ని వాడారు. దేవాలయానికి వెళ్లిన భక్తులు దేవుడితో తమ కోరికలు చెల్లిస్తే దానికి ప్రతిఫలంగా ఏదో ఒకటి ఇస్తామని లావాదేవీలు కుదుర్చుకుంటారు. కొందరు జుట్టు లేదా డబ్బును పసుపు గుడ్డలో మూటగట్టి కోర్కె తీరగానే దేవుడికి సమర్పిస్తారు. కొందరు దేవుడికి నగలు చేపిస్తే, మరికొందరు గుడికి సంబంధించిన కట్టడాలను నిర్మిస్తారు. ఇదే తెలుగు సమాజంలో వ్యంగ్యంగా "ముడుపులు చెల్లించడమ"నే నానుడిగా వాడుకలో ఉంది. కథకుడు దీనినే సందర్భానుసారంగా ప్రయోగించారు. నర్స్‌లను "బురదనీటిలో కదలాడే బాతులు", "తెల్లని ఐరావతం" అనే వర్ణనలతో సూచించారు. బురదనీటిని హాస్పిటల్, వార్డులకే కాకుండా సమకాలీన సమాజానికీ ప్రతీకగా తీసుకోవచ్చు. "ఐరావతం" పురాణాల ప్రకారం ఇంద్రుడి వాహనం. తెల్లగా మెరిసిపోతూ బలిష్టంగా ఉంటుంది. యుద్ధాలలో ఇంద్రుడికి సాయం కూడా చేస్తుంది. కథా ఇతివృత్తం ప్రకారం ఈ పోలికను హెడ్ నర్స్ రూపానికే కాకుండా ఆమె వైఖరికి కూడా అన్వయించుకోవచ్చు.

రచయిత వాళ్ల అమ్మ గురించి చెప్తూ... "అహర్నిశలూ మా కోసం కొవ్వొత్తిలా కరిగి కరిగి... ఇలా అయిపోయింది అమ్మ. నాన్న తెచ్చేది తక్కువ జీతమే అయినా పొదుపుగా దాచి, తిండికీ, చదువులకీ ఖర్చుపెడుతూ, చాలకపోతే తన ఒంటిపైని ఒక్కో నగనీ మా ఎదుగుదలకు కరిగిస్తూ... ఎంత శ్రమపడింది?. రెక్కలొచ్చేక ఉద్యోగాల వేటలో వలస జీవులమై వెళ్ళిపోయిన అన్నయ్యగానీ, నేను గానీ... ఈ వయసులో వాళ్ళ ఋణం తీర్చుకోలేక, భద్రత లోపించిన ఉద్యోగాలతో, పెరిగే ఖర్చులని తట్టుకోలేక, చిద్రమైపోతున్న బతుకుల్ని ఎగదోపుకుంటూ... ప్రేమల్నీ, ఆత్మీయతల్నీ కృతకంగా మార్చుకుంటూ, అనుబంధాల్ని వ్యాపార బంధాలను చేసుకుంటూ ఈ వ్యవస్థకి ప్రతీకలమై జీవిస్తున్నాం." అని అమ్మలోని త్యాగాన్ని, వెల కట్టలేని మమకారాన్ని, మనుషుల మధ్య ముసురుకుంటున్న వ్యాపార బంధాలను వర్ణిస్తాడు.

రచయిత ఆసుపత్రి అనుభవాలన్నీ అతడి బాహ్య స్వరూపానికి సంబంధించినవి. వాటితో రాజీపడలేక అంతర్ సంఘర్షణకు గురయ్యాడు. ఆ సంఘర్షణను పాత్రల సంఘర్షణ ద్వారా పాత్రోచిత భాషలో చూపించాడు. కొండ అద్దమందు అన్నట్లు జనరల్ ఆసుపత్రిలోని ప్రతి సూక్ష్మ అంశాన్నీ సమాజానికి ముడిపెట్టి చూపించాడు. సమాజానికి మూలమైన ఆర్థికాంశంతోపాటు, హాస్పిటల్‌లోని వ్యాధులు, వైద్యం, పేషంట్లు, నర్స్‌లు, డాక్టర్లు, వార్డ్‌బోయ్‌లు, కుటుంబ సంబంధాలు... అన్నింటిని నమూనా పాత్రల ద్వారా వాస్తవికతతో చిత్రించాడు. కథలో ఆసుపత్రే సమాజానికి ఒక నమూనా.

◆



# అనివార్యం

- నల్లా యోగేశ్వరరావు
9866640663

కిటికీ లోంచి లేత ఎండ ముఖంపై పడటంవలన ఎవరో నిద్రలేపినట్లు లేచిపోయాడు ప్రకాశం. యాంత్రికంగా గోడ వాచీ వైపు చూసాడు. ఆరూ ఇరవై నిముషాలు. వీధి రామాలయంలో భక్తి పాటలు వినిపిస్తున్నాయి. హమ్మయ్య వీధంతా సుభిక్షం గానే వుంది అనుకున్నాడు. 'ఎందుకంటే? ఎవరైనా పోయినా, లేదా అటూ ఇటూగా వున్నా కోవెల్లో పాటలు వేయరు. అయినా ఇలా ఆలోచిస్తున్నానేమిటి? అవును మరి..నిన్నరాత్రి పొద్దుపోయేంత వరకూ అలాంటి విషయాలే మాట్లాడుకొని, అలాంటి పనుల్లోనే గడపడం వల్ల అలాంటి ఆలోచనలు రాక మరి ఇంకెలాంటి ఆలోచనలు వస్తాయి' అనుకున్నాడు. తన ప్రాణ స్నేహితుడు రామనాధశాస్త్రి తల్లి, అన్నపూర్ణమ్మ గారు పోయి నేటికి సరిగ్గా సంవత్సరం అయింది. ఆ జ్ఞాపకాలు ప్రకాశాన్ని ఇంకా వదల్లేదు.

రామనాధశాస్త్రికి అరవై అయిదు సంవత్సరాలు వుంటాయి. ఒకటో, రెండో ఎక్కువ ఉండొచ్చు. ఇద్దరూ ఎలిమెంటరీ స్కూల్ నుండి మంచి స్నేహితులు. వాళ్ళిద్దరి మధ్యా అవ్యక్తమైన అనుబంధం వుంది. దానికి కారణం అన్నపూర్ణమ్మ గారే. ఎందుకంటే చనిపోయిన రామనాధం తల్లి అన్నపూర్ణమ్మగారు రామనాధంతో ప్రకాశాన్ని కూడా సొంత బిడ్డలాగా చూసేది. వాళ్ళిద్దరికీ ఎంత వయసులొచ్చినా ఆమె కంటికి వాళ్ళు చిన్నపిల్లలే. ఏదైనా పనుండి ప్రకాశం వాళ్ళింటికి వెళ్ళకపోతే, "ప్రకాశం ఎందుకో ఈ రోజు రాలేదు. ఏం పనుందో ఏమో" అని రోజు మొత్తంలో రెండు మూడు సార్లయినా అనేది. తరువాత రోజు ప్రకాశాన్ని చూసి గానీ తృప్తి పడేది కాదు. అందుకే ఈ సంవత్సర కాలం ఏదో తెలియని అనుబంధం వెంటాడుతూనే వుంది. ఆమె సంవత్సరీకం ఎంతో శాస్త్రీయంగా జరపాలన్నదే రామనాధం కోరిక. దానికి నా వంతు సహాయం అందించాలి' అనుకొని భార్యను తొందరగా తెమలమని చెప్పి బాత్‌రూమ్‌లోకి దూరాడు ప్రకాశం.

రామనాధశాస్త్రికీ, ప్రకాశానికీ ఒకే ఏడాదిలో పెళ్ళిళ్ళు అయ్యాయి. ప్రకాశానికి సంవత్సరం తరవాత బాబూ, మరోరెండేళ్ళ వ్యవధిలో పాపా పుట్టారు. ఆ ఇద్దరి పిల్లల్నీ అన్నపూర్ణమ్మ గారు సొంత మనవడూ, మనవరాలు లాగా చూసుకునేవారు. వాళ్ళ పుట్టిన రోజులకు బట్టలు తియ్యడం, బాబుకి మెడలో ఆంజనేయుడి బిళ్ళ చేయించడం, పిల్లలకు ఏదైనా అనారోగ్యం జాగ్రత్తలు చెప్పడం, తగిన సలహాలు ఇవ్వడం చేస్తుండేవారు. అలా పిల్లల్నిసాకడం వల్లనే పదేళ్ళ తరువాత శాస్త్రికి మగబిడ్డపుట్టాడని అన్నపూర్ణమ్మ గారి ప్రగాఢ విశ్వాసం. ఏ ఇంట్లో ఏ సమస్య వచ్చినా కలసి చర్చించుకునే వాళ్ళు.

రామనాధ శాస్త్రి తండ్రి రామకృష్ణ శాస్త్రి గొప్ప వేద

పండితుడు. ఆయన శాస్త్రి పదవ ఏటనే కాలం చేసాడు. అప్పటినుండి శాస్త్రి ఒంటరి కాకూడదని, చదువుబాట పట్టించి, చిన్నతనం నుండి ప్రకాశం మీద మంచి అభిప్రాయం ఉండడంతో, వాళ్ళ స్నేహాన్ని ప్రోత్సహించేవారు అన్నపూర్ణమ్మగారు. వాళ్ళ స్నేహం మరింత బలపడడానికి మరో కారణం కూడా వుంది. ఇద్దరిది ఒకే చోట వుద్యోగం. శాస్త్రి హెడ్ మాస్టారు. ప్రకాశం డ్రిల్ మాస్టర్. ప్రకాశం డ్రిల్ మాస్టారు కావడం మూలాన ఆరోగ్యం మీద కాస్త ఎక్కువ శ్రద్ధ వుండేది. శాస్త్రి కాస్త బద్ధకించినా, ప్రకాశం వేకువజామునే వచ్చి మార్నింగ్ వాక్‌కు తీసుకువెళ్ళేవాడు. అలా మొదలైన రోజువారి దినచర్య రాత్రి పడుకునే వరకూ కొనసాగేది. రోజులు గడుస్తూనే వున్నాయి.

రామనాథశాస్త్రి కొడుకు విష్ణు వర్ధన్ కొడుకు బాగా చదివి అమెరికాలో వుద్యోగం చేస్తున్నాడు. అమెరికా వెళ్లి మూడు సంవత్సరాలు అయ్యింది. వెళ్ళిన రెండు సంవత్సరాలకి అందరూ పట్టుబడితే ఇండియా వచ్చాడు. ఇక్కడ వున్న రోజుల్లో శాస్త్రి బావమరిది కూతురు సృజనతో పెళ్లి మాటలు కూడా అయిపోయాయి. సృజనకు బెంగుళూరులో ట్రైనింగ్ అంటూ ఆరునెలలూ, విష్ణుకి సెలవులు లేవంటూ మరికొన్నాళ్ళు ఇలా సంవత్సరం తాత్సారం అయిపోయింది. అలా పెళ్లి ప్రయత్నాలలో ఉండగానే అన్నపూర్ణమ్మ గారు చనిపోయారు.

ఈ రోజు అన్నపూర్ణమ్మ గారి సంవత్సరీకం. తొందరగా తయారై ప్రకాశం, ప్రకాశం భార్య వనజ ఇంటినుండి బయటపడ్డారు. ఎనిమిది గంటలకే శాస్త్రి ఇంటికి చేరుకున్నారు. వనజలోనికి వెళ్లి, శాస్త్రి భార్య మీనాక్షికి వంటలో సహాయం చేసే పనిలో పడింది. ఇంట్లో ఓ పది మంది దాకా దగ్గర బంధువులు వున్నారు. హాల్లో ముగ్గురు బ్రాహ్మణులు చేయబోయే కార్యక్రమంలో నిమగ్నమై వున్నారు. శాస్త్రి, నుదుటన అడ్డంగా విభూతి నామాలు పెట్టుకొని, రెండు కనుబొమల మధ్యా కుంకుమ బొట్టుతో, తెల్లటి పంచె, పై మీద తెల్లటి తువ్వాలు వేసుకొని, దివాన్ కాట్‌లో కూర్చున్నాడు. అప్పటికే సమయం పదకొండు. శాస్త్రి బంధువు బాగా ముసలాయన వచ్చి, "ఒరే!రామనాథం! కాఫీఅయినా తాగరా? మరీ అంతగా ఉపవాసం ఉండనక్కరలేదు. సుగరూ, బి.పీ అంటున్నావు. ఏదైనా తిని మాత్రలు వేసుకోవచ్చు" అంటూ కాస్త నచ్చ జెబుతూ...ప్రకాశం రావడం చూసి" అదిగో మీ తమ్ముడు కూడా రానే వచ్చాడు. నువ్వయినా చెప్పరా అబ్బీ!" అంటూ లోనికి వెళ్ళిపోయాడు.

ప్రకాశం చెప్పడానికి ధైర్యం చేయలేకపోయాడు. ఎందుకంటే, తనతల్లి అన్నపూర్ణమ్మగారి సంవత్సరీకం ఎంతో నిష్టగా, శాస్త్రోక్తంగా చేయాలన్నదే శాస్త్రికోరిక. అదీకాక తల్లిని తలచుకొంటూపుట్టెడు దుఃఖంలో కూర్చున్న మనిషికి ఏం చెప్పగలను' అనుకున్నాడు గానీ... స్నేహితుడి ప్రవర్తన తనకు నచ్చడంలేదు. మామూలు రోజైతే ఇప్పటికే టిఫిన్, చప్పటి కాఫీ తాగి, షుగర్, బి.పి మాత్రలు వేసుకునేవాడు. స్నేహితుడి దినచర్య తెలియనిది కాదు. ఇవాళ మాత్రం ఏమైంది? తన ఆరోగ్యం సంగతి మాత్రం చూసుకోవద్దూ? అనుకున్నాడు. ఇంతలో లోపలినుండి వనజ వచ్చి పైట కొంగుతో గ్లాసు అడుగున పట్టుకొని చప్పటి వేడి కాఫీ తెచ్చి "బావ గారూ! అక్క మీకు కాఫీ ఇమ్మంది" అంటూ కొంచం ఒంగొని నిల్చుంది.

"అమ్మా!వనజా! అమ్మ పూజ పూర్తయ్యేవరకూ పచ్చి మంచి నీల్లయినా ముట్టుకోను. నన్నిలా వదిలేయండి."అని కాస్త చిరుకోపం ప్రదర్శించేసరికి, వనజ మారు మాట ఎత్తకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"ఒరే శాస్త్రీ! సాధారణ ఆరోగ్యం వున్నవాళ్ళు మధ్యాన్నం రెండు గంటలేమిటి?సాయంత్రం ఆరు గంటల వరకైనా ఉండొచ్చు. కానీ... నీ పరిస్థితి అలాకాదు. ఒకసారి ఏమైందో గుర్తుంది కదా!"

"స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమం వుందని, ఏర్పాట్లు చూడ్డానికి ఏమీ తినకుండా స్కూలుకి వచ్చేసాడు. అప్పుడు షుగర్ లోలెవెల్‌కి పడిపోయి, ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే డాక్టర్‌ని పిలిచాం సకాలంలో వైద్యం అందింది కాబట్టి కోలుకున్నాడు. అలా సంఘటన మళ్ళీ పునవృతం కాకూడదని అంటున్నాను."

"నిజమా బావగారు?" అంది మళ్ళీ అంతలోనే అక్కడికొచ్చిన వనజ. మౌనంగానే అవునన్నట్లు తలవూపాడు.

"నా మాట విను. ఎందుకు చెబుతున్నానో ఒక్కసారి ఆలోచించు. నీకు అచారాల మీదా సాంప్రదాయాల మీద నమ్మకం వుంది కాబట్టి ఆచరించు. కాదనను. నా అభిప్రాయాలు ఎలా వున్నా నీ అభిప్రాయాలను గౌరవిస్తాను. కానీ... ఇప్పటి నీ పరిస్థితి అది కాదు. నువ్వు మరీ ఇబ్బంది పడి, ఇంత కఠినంగా ఆచరిస్తే మాత్రం అమ్మఆత్మ సంతోషిస్తుదనుకున్నావా?" అన్నాడు ప్రకాశం.

ఇంతలోనే పురోహితులు పిలవడంతో "అదిగో పిలవనే పిలిచారు ఎంత సేపు పూజ అయిపోతుంది." అంటూ ప్రకాశం మాట వినిపించు కోకుండా హాల్లోకి వెళ్ళాడు. అప్పటికే గోడకి ఆనించి వున్న పొట్టిబల్లపై అన్నపూర్ణమ్మగారి నిండుగా నవ్వుతున్న ఫోటో ఫ్రేంకి పూల దండవేసి, పూజా సామాగ్రి అంతా సర్దిపెట్టి ఉంచారు. పురోహితులు స్వీట్లూ, పళ్ళూ, ఆమెకు ఇష్టమైన వంటకాలనూ పెట్టి, శాస్త్రిని పిలిచి పటానికి ఎదురుగా కూర్చోమని చెప్పి పూజ మొదలుపెట్టారు. అంతా శాస్త్రోక్తంగా జరిగింది. శాస్త్రి "ఎంతసేపు" అన్నట్టుగా జరగలేదు. అలా జరగదని అందరికీ తెలుసు శాస్త్రితో సహా.

"అయ్యా! శాస్త్రిగారూ డాబా మీదకి పదండి. కాకులకు ఈ పిండం పెట్టిన తరువాత ఈ తంతు పరిసమాప్తమవుతుంది." అంటూ శాస్త్రిని డాబామీదకి తీసుకెళ్ళారు. వారితో ప్రకాశం మరికొంతమంది కూడా వెళ్లారు. డాబాపై పిండాన్నిపెట్టి, కాకుల రాకకోసం ఎదురు చూస్తున్నారు. ముక్కు నుండి చీదేసిన చీమిడితిన్నా, ఎండుమిరపకాయలు తిన్నా ఒకేలా ఆస్వాదించే పక్షి కాకి ఒక్కటే. చనిపోయిన వారి ఆత్మ కాకి సూక్ష్మ శరీరంలోకి ప్రవేశించి, పెట్టిన పిండాన్ని తింటారని నమ్మకం. కాసేపటికి కాకి వచ్చి పిండాన్ని తిన్నది. కాకి వచ్చి తిన్నందుకు అందరూ సంతోషించారు. అందరితోపాటు ప్రకాశం కూడా. తన నమ్మకాలు ఎలా వున్నా కార్యక్రమాలు పూర్తి అయిపోతే, మిత్రుడు కాస్త ఏదైనా తింటే, స్థిమిత పడతాడని అతను ఎదురు చూస్తున్నాడు.

శాస్త్రికి ఇప్పుడు ఎంతో సంతృప్తిగా వుంది. రాగి చెంబు, ఇత్తడిపళ్ళెం పట్టుకొని డాబా మీదనుండి క్రిందికి దిగుతున్నాడు. వెనుకనే అందరూ. మలుపు దగ్గర వెడల్పుమెట్టు వద్ద ఆగి "ప్రకాశం నాకు కళ్ళు తిరుగుతున్నాయిరా...." అంటూ వెనక్కి పడిపోయాడు. వెనుకనే అందరూ వుండడం వలనా, శాస్త్రి ముందుగా కళ్ళు తిరుగుతున్నాయని చెప్పడం వలనా శాస్త్రిని పట్టుకున్నారు, నెమ్మదిగా మెట్ల మీదనుండి దించి, దివాన్ కాట్‌పై పడుకోబెట్టి ఏ.సి. ఆన్ చేసారు. శాస్త్రి ఎక్కువగా ఆయాసపడుతున్నాడు.

◆◆◆

కామాక్షి ఐ.సి.సి.యు. తలుపు దగ్గర ఏడుస్తూ నిలుచుంది. ఐ. సి. సి. యు. లోనికి వెళ్లక ముందే కొంచెం తెలివి వచ్చింది. కానీ మాట్లాడడానికి చాలా ఇబ్బంది పడుతున్నాడు. లోనికి వెళుతున్నప్పుడు అలా ఆయాసపడుతూనే " విష్ణుకి ఫోన్ చేసి వెంటనే రప్పించరా ప్రకాశం" అన్నాడు. ఆ మాట శాస్త్రి నోటి వెంట రావడంతో గుండె గుబేల్ మంది. ఎంతో ప్రాణం మీదికి వస్తేనే గానీ ఆ మాట నోటి వెంటరాదు. కాసేపటికి లోపలినుంచి నర్సు వచ్చి రామనాధ శాస్త్రి గారి పేషంటు తాలూకా ఎవరైనా వున్నారా?" అంది. వెంటనే కామాక్షి ప్రకాశం వైపు చూసింది "నువ్వెళ్ళు" అన్నట్లు. వెంటనే ప్రకాశం లోనికి వెళ్ళాడు. "ఈ షీట్ మీద సంతకం చెయ్యండి. పేషంటుకి మీరేమవుతారు" ' స్నేహితుడ్ని' అని చెప్పలేకపోయాడు. "తమ్ముడ్ని" అన్నాడు.

"ఈ రిలేషన్ దగ్గర ' బ్రదర్ ' అని రాయండి." అంది. ఒక్కసారి బెడ్ వైపు చూసాడు. శాస్త్రికి ఆక్సిజన్ పెట్టారు. ఒళ్ళంతా వైర్లతో వున్న బిళ్ళల్లాంటివి అంటించారు. చిన్న టి.వి. లాంటిదానిలో వంకి వంకీల గీతలు పరిగెడుతున్నాయి. కీ..కీ..కీ.. మంటూ శబ్దం వినిపిస్తోంది. వాతావరణం భీతిగొలిపేటట్లు వుంది. అదంతా చూసిన తరువాత, శాస్త్రి మనలోకంలో లేడా అనే సందేహం కలిగింది ప్రకాశానికి. పెద్ద డాక్టర్ మాతో కొంచెం మాట్లాడి, వెంటనే శాస్త్రి దగ్గరకు వెళ్ళాలన్న తొందర అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

"హార్ట్‌లో కొన్ని బ్లాకులు వున్నాయి. అవసరమైతే ఓపెన్ సర్జరీ చేయవలసి వస్తుంది. అతన్ని చూడాలనుకున్న వారు ఎవరైనా వుంటే వాళ్ళని తొందరగా పిలిపించండి. మీరు బయట వుండండి" అని విషయం చెప్పిలోనికి వెళ్ళిపోయారు. ప్రకాశానికి కాళ్ళూ, చేతులూ ఆడడం లేదు. శాస్త్రి మూర్ఖత్వంతో తన ప్రాణం మీదకి తెచ్చుకున్నాడు. అప్పటికీ తను చెబుతూనే వున్నాడు. విన్నాడు కాదు. ఇప్పుడు ఎన్ననుకొని ఏం ప్రయోజనం. డాక్టర్ వెనకాతలే వెళ్ళాడు.

"ఎంత ఖర్చు అయినా పర్వాలేదు డాక్టర్! మా అన్నయ్య ప్రాణాలు కాపాడండి" గద్గద స్వరంతో అన్నాడు. "అవన్నీ మేం చూసుకొంటాం. మీరు బయట వుండండి" కాస్త చిరాకు ధ్వనించింది డాక్టర్ స్వరంలో. చేసేదేమీలేక బయటకు నడిచాడు. అప్పటికే విషయం చాలా మందికి తెలిసి, చూడ్డానికి వస్తున్నారు. అందులో కామాక్షి అన్నయ్య కూడా వున్నాడు. ప్రకాశం ఏం చెబుతాడోనని అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అందరూ ఆందోళన చెందకుండా వుండాలని "కొంచెం బాగానేవుంది. డాక్టర్ గారు ఫరవలేదన్నారు" అందరూ కాస్త స్థిమితపడ్డారుగానీ...ప్రకాశానికి మాత్రం

ఆందోళగానే వుంది. కామాక్షి అన్నయ్యకు విషయం చెప్పాడు పక్కకు పిలిచి. రెండు గంటల తరువాత నర్సు వచ్చి చెప్పింది.

"బి.పి...షుగర్ కంట్రోల్ అయిన తరువాత ఎల్లుండి ఉదయం 11 గంటలకి ఆపరేషన్ చేస్తామన్నారు. వారి భార్యనీ, ప్రకాశం గారినీ లోనికి రమ్మన్నారు." ప్రకాశం, మీనాక్షి లోనికి వెళ్లారు. డాక్టర్ గారి చాంబర్‌లో ఎవరో ఉండటంతో శాస్త్రి దగ్గరకు వెళ్లారు. ముఖానికి వున్న మాస్క్‌ని తొలగించమని నర్సుకి సైగ చేస్తున్నాడు శాస్త్రి.

"మాస్క్ తీయకూడదు. మీరేం చెప్పాలనుకున్నా కాగితం మీద రాయండి."అని చెప్పి కాగితం, పెన్నూ ఇచ్చింది. ఏటవాలుగా వున్న బెడ్ మీద కూర్చున్నాడు శాస్త్రి. అది తీసుకొని కొక్కిరి గీతల్లాగా ఆతృతతో రాసిచ్చాడు. అందులోని సారంశం.

'కామాక్షి అన్నయ్య కూతురు సృజననీ, శాస్త్రి అబ్బాయి విష్ణునీ తను ఆపరేషన్ థియేటర్ లోనికి వెళ్లకముందే తనకు జంటగా చూపించమని' రాసివుంది. విషయం అర్థం చేసుకొని, నర్సుకి జాగ్రత్తలు చెప్పి, తెలిసిన బంధువుకు కాస్త డబ్బు ఇచ్చి "అవసరమైతే ఖర్చు చెయ్యండి" అని చెప్పి ఇంటికి బయలుదేరారు కామాక్షి అన్నయ్యా, కామాక్షీ, ప్రకాశం. జరిగినదంతా కామాక్షి వదినతో చెప్పి "రేపు మధ్యాన్నానికి ఎట్టి పరిస్థితుల్లోనూ సృజన ఇక్కడ వుండాలి" అని చెప్పారు. కడిగిన ముఖం, అడిగినపిల్లా వుంటే ఎందుకైనా మంచిదని అన్నపూర్ణమ్మగారు అంటుండేవారు. అది ఇలాంటి పరిస్థితులకే వర్తిస్తుందేమో అనుకున్నాడు ప్రకాశం. విష్ణుకి ఫోన్ చేసి విషయం చెప్పాడు. విని నిర్ఘాంతపోయి, చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు.

"బాబాయ్ నేను వెంటనే బయలుదేరుతున్నాను. కానీ..."

"ఏమిటి చెప్పు"

"ఏమీలేదు. మళ్ళీ నేను వెంటనే బయలుదేరాలి. ఎందుకంటే ఒక సి. ఇ. ఓ. గా నా కింది వాళ్ళు శెలవు పెడితే నేను ఒకంతట శెలవు గ్రాంట్ చెయ్యను. అలాంటిది నేనే శెలవు పెడితే చాలా అసహ్యంగా వుంటుంది. మరి నాన్నకోసం తప్పదు కాబట్టి వస్తున్నాను." ఏకోడ్ ఎంటర్ చేస్తే, ఏది ఓపెన్ అవుతుందో, ఒక్క డాట్ మరిచిపోయినా ఎలా ఓపెన్ అవ్వదో అన్నట్టు ఎలక్ట్రానిక్ భాషలో ముక్తసరిగా చెప్పాడు.

ఇరు కుటుంబాలలో ముఖ్యమైన వాళ్ళందరూ వచ్చారు. ప్రకాశం, విష్ణువర్ధన్, సృజనా కలసి పక్కపక్క సీట్లలో డాక్టర్ సీటుఎదురుగా కూర్చొని డాక్టర్ గారికోసం ఎదురు చూస్తున్నారు. రౌండ్స్ ముగించుకొని డాక్టర్ గారు వచ్చారు. అందరూ ఒక్కసారి లేచారు.

"వీళ్ళు రామనాథ శాస్త్రి హార్ట్ పేషంట్ తాలూకా" నర్సు చెప్పింది. "కూర్చోండి" డాక్టర్.

"మీరు పేషంట్‌కి ఏమవుతారు?" విష్ణుని ఉద్దేశించి అడిగారు.

"రామనాథ శాస్త్రి గారి అబ్బాయి నండి"

"అచ్చా! నర్స్. నో అబ్జక్షన్ సైన్ ఇతనిది కూడా తీసుకో"

వెంటనే నర్సు కాగితాలు తీసుకు వచ్చి, విష్ణు సంతకం తీసుకొని వెళ్ళిపోయింది.

"ఈ వయసులో ఆపరేషన్ పరవలేదంటారా?" విష్ణు అడిగాడు కొంచెం బొంగురు గొంతుకతో.

" తప్పదు, ఆపరేషన్ చెయ్యకపోతే కొన్ని రోజుల్లోనే బేడ్ న్యూస్ వినవలసి వస్తుంది. బై గాడ్ గ్రేస్ అతని బాడి తట్టుకొని ఆపరేషన్ సక్సెస్ అయితే, మరో కొన్నేళ్ళు హాపీగా బ్రతికేస్తారాయన" డాక్టర్ వాచీ చూసుకొని చెప్పాడు. సరే! ఆపరేషన్ టైం అవుతోంది. "మిమ్మల్ని చూడాలని వుంది" ఆయన అన్నారని మిమ్మల్ని పిలిపించాం. అతన్ని చూసినపుడు మీరు ఎవరూ ఏడవడం చేయకండి. మామూలుగా వుండండి. ఎందుకంటే అతను ఆందోళన పడకూడదు. ఒక్క నిముషం మాట్లాడి వచ్చేయండి" అని డాక్టర్ అందరికీ బోధించినట్లు చెప్పాడు. ఐ.సి. నుండి వీల్ స్ట్రెచర్‌తో శాస్త్రిని తీసుకొచ్చారు. ఆక్సిజన్ వెంటే వుంది. శాస్త్రి ఎదురుగా కాబోయే దంపతులు నిలుచున్నారు. చుట్టూ మిగతా అందరూ నిలుచున్నారు. భార్య కామాక్షివైపు చూసి, కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాయి. అందర్నీ ఒక్కసారి చూసి, ఎదురుగా వున్న విష్ణూ, సృజనల మీద చూపు నిలిపాడు. అందరి కళ్ళల్లో దుఃఖం నిండుగా వుంది. గానీ. ఎవరూ బయటపడడం లేదు.

"నాన్నగారూ! మీకేం భయంలేదు. మీరు హేపీగా తిరిగొస్తారు" అన్నాడు విష్ణు.


"మామయ్యా! ఆ దేముడు మాకు అన్యాయం చెయ్యడు. ధైర్యంగా వుండండి" సృజన దుఃఖాన్ని మునిపంటి కిందనొక్కి అతి కష్టం మీద అనగల్గింది. వెంటనే నర్సులు ఆపరేషన్ థియేటర్లోకి తీసుకు వెళ్ళిపోయారు.

నిముషాలు యుగాల్లాగా గడుస్తున్నాయి. ఎవరికీ ఏమీ

## కవిత

# అక్షరాలు మొలకెత్తుతున్న వేళ..

- లోసారి సుధాకర్
99499 46991



జీవించడమే మరణించడమే
సమస్యగా పరిణమించినపుడు
పోరాటం వైపు నిలబడతాను
కలమెత్తుతాను..గళమెత్తుతాను
పిడికిలెత్తుతాను గాని
గుడ్డిగా మరణించను
ఉత్తుత్తిగా జీవించనూలేను
చెమటచుక్క నేలబడితే
పచ్చటిపొలంగా ఎదగాలి
నెత్తుటిబొట్టు పైకి చిమ్మితే
ఆకాశం ఎరుపెక్కాలి
రెప్పమూతబడితే
ఉరుముల మెరుపుల
పెళపెళ ధ్వనులవ్వాలి
బలిబలీయమంటూ
కంఠపు గర్జనలు మ్రోగాలి
చూపు నిప్పులవాన
వేళ్ళు రోళ్ళు మారణాయుధాలు
ఇక ఏదైతేనేం..ఇక ఎవరైతేనేం..
నన్ను నేను గన్నుగా
మలచుకున్నప్పుడు
నాకు నేను చైతన్యగోళంగా
మారుతున్నప్పుడు
నాకు నేనుగా అగ్నికణంగా
అవతరిస్తున్నప్పుడు
వందల వేల శత్రువులు
చుట్టూ మొహరించినపుడు
కాదు మరణం వృధా
కాదు జీవితం వృధా
ఎలుగెత్తి నిలబడటం
వెలుగై నిలబడటం కావాలి
చూడు చూడు అక్షరం
మదిలో మొలకెత్తుతుంది
చూడు చూడు అంకురం
భూమిలో
ఆకృతి పొందుతుంది
ఈ అక్షరాలు
విత్తులుగా
మొలకెత్తుతున్న తరుణం. ♦

తోచడం లేదు. ఏవేవో మాట్లాడుతున్నారు గానీ.. అందరి దృష్టి శాస్త్రి మీదే వుంది. నాలుగు గంటల తరువాత నర్స్ వచ్చి "ప్రకాశాన్నీ, విష్ణునీ డాక్టర్ గారు రమ్మన్నా"రని చెప్పింది. ఇద్దరూ ఆపరేషన్ థియేటర్‌కి ఆనుకొని వున్న రూమ్‌లోనికి వెళ్లారు. అప్పటికే డాక్టర్ గారు సీటులో కూర్చొని వున్నారు. ఇద్దర్నీ చూసి, కూర్చోండి అన్నట్లు సైగ చేసారు. ఇద్దరూ కూర్చొని ఆయన చెప్పబోయే విషయం కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.


"సారీ..సార్! ఎంతగానో ప్రయత్నించాం. కానీ...లాభం లేకపోయింది. హి వజ్ పాస్డ్ ఎవే" అని చిన్నగా అన్నారు. ప్రకాశానికి ఒక్కసారి కూర్చున్న కుర్చీకింద భూమి కంపించినట్లయింది. ఎంతో గంభీరంగా, హుందాగా వుండే విష్ణు కూడా కుర్చీలోనుండి లేచి, గోడపక్కగా నిలబడి చిన్నపిల్లాడిలా రోదిస్తున్నాడు. ప్రాణస్నేహితుడు మరణించాడన్న విషయం జీర్ణించుకోలేక పోతున్నాడు ప్రకాశం. ఆకాశం చివరి అంచునుండి భూదిగంతాల వరకూ వ్యాపించి వున్న శిఖరం కోనపై నిలుచున్నట్లు, సృష్టిలో అతనొక్కడే వున్నట్లు, మిగతా వాళ్ళెవ్వరూ మనుషులే కారు అన్నంత ఒంటరితనం ఆవహించింది. అందులోనుండి బయటపడేలోపే, విష్ణు ఏడుస్తూ...డాక్టర్‌తో, ప్రకాశంతో మాట్లాడుతున్నాడు.

" డాక్టర్ గారూ...బాబాయ్...మీ ఇద్దరూ నాకొక హెల్ప్ చెయ్యాలి" ఏమిటన్నట్లు ఇద్దరూ అతనివైపు చూసారు.

"నేను కంప్లసరి రేపు రిటన్ అవ్వాలి. అక్కడ బిలియన్ డాలర్ల ప్రోజక్ట్ నా మీద ఆధారపడి వుంది. డ్యూటీ మీద భక్తో, లేక భద్రతలేని ఉద్యోగమో అనుకోండి. ఎలా అనుకున్నా పరవాలేదు. నేను వెళ్లకపోతే, కంపెనీ నామీద క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటారు. నాన్నను ఇలాంటి స్థితిలో వదిలి వెళ్ళడం దేముడు నాకు వేసిన శిక్ష అనుకుంటాను. దయచేసి నేను వెళ్ళినంత వరకూ, నాన్న పోయేరన్న విషయం బయటకు తెలియజేయవద్దు. ఒకవేళ తెలిస్తే ఈ లోకానికి నేను ముఖం చూపించలేను. నన్నొక భ్రష్టుడిలాగా చూస్తారు. దయచేసి నాకీ సహాయం చెయ్యండి." అంటూ రెండు చేతులూ జోడిస్తూ...ఏడుస్తూ అంటున్నాడు. అతని మాటలు విని నిర్ఘాంతపోయాడు ప్రకాశం. "మీ ఇష్టం" అంటూ డాక్టర్ గారు లోనికి వెళ్ళిపోయారు.

వాళ్ళ తాతల, తండ్రులనుండి సనాతన సాంప్రదాయాలను పుణికి పుచ్చుకున్న రామనాథ శాస్త్రికి ఇలాంటి పరిస్థితి వస్తుందని నేను ఊహించలేదు. నేనేకాదు ఎవరూ ఊహించి వుండరు. అయితే...రామనాథ శాస్త్రికి ప్రాణస్నేహితుడిగా నేను పుట్టింది అతని దహన సంస్కారాలు పూర్తి చెయ్యడానికేనేమో' అనుకున్నాడు ప్రకాశం. విష్ణు పుట్టినపుడు పుత్రోత్సాహంతో "ఒరే! ప్రకాశం నేను పోయినపుడు నాకు తలకొరివిపెట్టి, నన్ను పున్నామ నరకం నుండి విముక్తి చేయడానికి మగబిడ్డ పుట్టాడురా!" అని ఆనాడు ఎంతో సంతోషంతో అన్న శాస్త్రి మాటలు ప్రకాశం చెవుల్లో గింగురుమంటున్నాయి. ♦

# స్వీకారం



**గణిక** కథలు

**బండారు విజయ**

వెల : 150/- పేజీలు: 190

ప్రతులకు : 8801910908

బండారు విజయ కథలు ప్రస్తుత సామాజిక అవసరాన్ని తీరుస్తున్నాయి. జటిలమైన సమస్యలనూ, పురుషాహంకారాన్ని ఈ కథలలోని పాత్రలు ఎలా ఎదుర్కొన్నాయో అత్యంత సహజంగా చిత్రించారు. సమకాలీన సమాజంలోని స్త్రీల సమస్యలను - ముఖ్యంగా దిగువ మధ్యతరగతి స్త్రీల జీవితాలను నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కార దిశగా కథనం సాగించి సమాజానికి దిశా నిర్దేశం చేయటంలో ఆమె కృతకృత్యులయ్యారు.

**- డా . విజయభారతి**



**మధుర కవీంద్ర శతకము**

**చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి**

వెల : 25/- పేజీలు: 40

ప్రతులకు : 9989265444

సాహిత్య చరిత్రలో జాన్ కవి గారికి ఇప్పటికే ఒక విశిష్ట స్థానం ఉండగా ఆ స్థానాన్ని ఈ శతకం మరింత ద్విగుణీకృతం చేస్తుంది. జాన్ కవితో, ఆయన సాహిత్యంతో సాన్నిహిత్యం ఉన్నవాళ్లకే కాకుండా ఆయన ఎలా ఉంటారో, ఆయన సాహిత్యం ఎలా ఉంటుందో తెలియని వాళ్ళకు కూడా ఈ శతకము ఎంతో అనుభూతిని, ప్రేరణనూ కలిగించేటట్లు వర్ణించిన కవి చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి గారు ఎంతైనా అభినందనీయులు!

**- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**



**పుణ్య పురుషుడు** కవిత్వం


**మల్లవరపు జాన్**

వెల : 75/- పేజీలు: 47

ప్రతులకు : 9989265444

ఒంగోలు ప్రాంతమంతా క్లౌ దొరగా పిలుచుకునే జాన్ ఇ.క్లౌ గారి జీవిత సంగ్రహం ఈ కావ్యం. అప్పటి మిషన్ కార్యకలాపాల చరిత్రనెరిగిన వ్యక్తులు చాలా తక్కువగా మిగిలారు. వారు కూడా గతించక ముందే వారిద్వారా మనం ఎరుగని చరిత్రను నమోదు చేయాల్సిన అవసరం ఉంది.

**- మల్లవరపు ప్రభాకరరావు**



**వలస భారతం** వచన కవితా కావ్యం


**డా॥ జి.వి. కృష్ణయ్య**

వెల : 50/- పేజీలు: 56

ప్రతులకు ఇ: 7075957010

అనాలోచితంగా తీసుకునే ఆకస్మిక నిర్ణయాలు ఎన్ని అవస్థలు సృష్టిస్తాయో, వర్యవసానాలు ఎలా వుంటాయో తెలియనంత అమాయకులా పాలకులు? భయమనే నరుకుని పెట్టుబడిగా మార్చుకుని ఎన్ని వికృత చేష్టలకు, విపరీతాలకు పునాదులు వేస్తున్నారో, కరోనాలాంటి వైరస్‌ల ఉధృతికి కార్యకారణ సంబంధంతో ఈ 'వలస భారతం' వచన కావ్యం రచించాను.

**- డా॥ జి.వి. కృష్ణయ్య**



**వీరగాథ**


**మల్లవరపు రాజేశ్వరరావు**

వెల : 125/- పేజీలు: 120

ప్రతులకు: 9989265444

ఈ వీరగాథ ఖండకావ్యంలోని కళాఖండికల్లో కవి చేసిన ప్రయోగాలు, చూపిన కొత్తరీతులు గురించి నేను ప్రత్యేకించి పేర్కొన్నను. వాక్య నిర్మాణంలో చూపించిన కొత్తదనం, పదప్రయోగం పద్యాలకు మేలిమి అందాన్నిస్తే, అడుగడుగునా కనిపించే అలంకారాలు మరింత అందాన్నిచ్చాయి. పద్య కవిత్వ కళ తెలిసిన రాజేశ్వరరావు గారు అచ్చంగా జానుకవి వారసులు. తెలుగువారి వారసత్వపు జీవనలేఖ అయిన పద్యాన్ని సామాన్యులు అసామాన్యగాథలకు కష్టజీవుల వక్షాన్ని వహించేలా ప్రజాపరం చేశారు.

**- డా. పత్తిపాక మోహన్**



**ఎద్దు ఎవుసం**

**సురుకుల వైద్యం** కవిత్వం

**గులాబీల మల్లారెడ్డి**

వెల : 100/- పేజీలు: 136

ప్రతులకు: 9848787284

ఈ కవికి కవిత్వం ఒక సామాజిక చర్య. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు ఇనుమును కాల్చి వాత పెట్టడం ద్వారా అనారోగ్యాన్ని తగ్గిస్తారు. దానికి 'సురుకుల వైద్యమని' పేరు. ఈ కవి తన కవిత్వం ద్వారా మంచిని కాపాడేందుకు, చెడును నిర్మూలించేందుకు సమాజానికి "సురుకుల వైద్యం" చేస్తున్నారు. ఇది ఇవ్వాళ అత్యంత అవసరం

**- వేదకుమార్. యం.**

# విజయవంతంగా అంతర్జాలంలో వైతాళికుల స్ఫూర్తి సంబరాలు

**జాషువా 125వ జయంతి సందర్భంగా 'వైతాళికుల స్ఫూర్తి సంబరాలు'**
**సెప్టెంబర్ 21 నుండి 28 వరకు**



మహాకవి గుర్రం జాషువా 125వ జయంతిని పురస్కరించుకుని జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం వేదికగా పది సాహిత్య, సాంస్కృతిక సంస్థల భాగస్వామ్యంతో సెప్టెంబర్ 21 నుండి 28 వరకు 'వైతాళికుల స్ఫూర్తి సంబరాలు జరిగాయి. అంతర్జాలం వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎనిమిది రోజుల పాటు ప్రధాన ప్రసంగాలు, కీలక ప్రసంగాలతో పాటు షార్ట్ ఫిలింస్, జానపద, అభ్యుదయ గేయాలు, వీడియో కవితలు, వేమన పద్యాలు, జాషువా పద్యాలు, నీతి కథలు, చిత్రలేఖనం అంశాలలో పోటీలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. మొత్తం ఎనిమిది అంశాలకు 979 వీడియోలు పోటీకి వచ్చాయి. షార్ట్‌ఫిలింస్ –212, నీతి పద్యాలు – 162, వేమన పద్యాలు – 159, చిత్రలేఖనం – 135, కవితలు – 110, జాషువా పద్యాలు – 59, జానపద గీతాలు – 105, అభ్యుదయ గీతాలు – 37 వీడియోలు పోటీకి వచ్చాయి. పోటీకి వచ్చిన వీడియోల నుండి ప్రతీ అంశం నుండి 40 వీడియోల చొప్పున ఎనిమిది రోజులకు 320 వీడియోలను ఎంపికచేసి ఆన్‌లైన్‌లో ప్రసారం చేయడం జరిగింది. ప్రతీ అంశానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు ప్రత్యేక బహుమతులను అందజేయడం జరిగింది. పోటీలలో పాల్గొన్న అందరికీ డిజిటల్ సర్టిఫికెట్‌లను వాట్సప్‌లో పంపించడం జరిగింది. ఎనిమిది అంశాలలో గెలుపొందిన 40 మందికి 75వేల రూపాయల నగదు బహుమతిని అందజేయడం జరిగింది.

సాహితీస్రవంతి, తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, సుమధుర కళా నికేతన్, శ్రీశ్రీ సాహిత్య నిధి, నవ్యాంధ్ర రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సంస్థలు ఈ కార్యక్రమంలో భాగం పంచుకున్నాయి.

సెప్టెంబర్ 21న గురజాడ జయంతితో ప్రారంభించి సెప్టెంబర్ 28 గుర్రం జాషువా జయంతి వరకూ ఈ కార్యక్రమం ఆన్‌లైన్‌లో విజయవంతంగా సాగింది. తొలిరోజు గురజాడ సమకాలీనతపై ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు ఎం.వి.ఎస్. శర్మ ప్రధాన ప్రసంగం చేశారు. రెండవ రోజు కందుకూరి సంస్కరణోద్యమం మీద బెంగుళూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె. ఆశాజ్యోతి, మూడోరోజు గిడుగు రామ్మూర్తి – తెలుగు భాష ఔన్నత్యంపై శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు, నాలుగో రోజు వేమన స్ఫూర్తి – భౌతికవాదం పై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్, ఐదోరోజు కుసుమ ధర్మన్న సాహిత్యంపై ప్రముఖ కవి, విమర్శకులు కోయి కోటేశ్వరరావు, ఆరో రోజు శ్రీశ్రీ కవిత్వంపై సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి, ఏడో రోజు సి.వి. సాహిత్యంపై ప్రముఖ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, చివరి రోజు జాషువా ప్రాసంగికతపై శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రధాన ప్రసంగం చేశారు. ప్రధాన ప్రసంగాలతో పాటు సామాజిక, సాంస్కృతిక రంగాలలో స్ఫూర్తినిచ్చిన యోధులపై పలువురు ప్రముఖులు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. ప్రతీరోజు పోటీలకు వచ్చిన వీడియోలను 5 చొప్పున ఎనిమిది అంశాలకు సంబంధించి మొత్తం 320 వీడియోలను ప్రదర్శించడం జరిగింది. షార్ట్ ఫిలింస్ అత్యధికంగా రావడంతో అదనంగా 40 షార్ట్ ఫిలింస్‌ను ప్రదర్శించారు. ఈ మొత్తం కార్యక్రమంలో యువత,

## ఓల్గా, చంద్రబోస్‌కు జాషువా కవితా పురస్కార ప్రదానం




గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం నుంచి ఆన్‌లైన్ ద్వారా జాషువా 125వ జయంతి సభ సెప్టెంబర్ 27న జరిగింది. ఈ సందర్భంగా జాషువా కవితా పురస్కారాన్ని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా, సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ శ్రమ చేసేది ఒకరు, దాన్ని అనుభవించేది మరొకరనే సామ్యవాద సత్యాన్ని జాషువా చాటి చెప్పారన్నారు. తన ప్రతి రచనలో దోపిడీని ప్రశ్నించారని, అణగారిన వర్గాల చైతన్యం కోసం కృషి చేశారన్నారు. కరోనా నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన ప్రజలను, కార్మికులను ఆదుకోవడానికి చేతులు రాని కేంద్ర ప్రభుత్వం... కార్పొరేట్లకు, టెలికం కంపెనీలకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందన్నారు. రైతు వ్యతిరేక వ్యవసాయ బిల్లులను హుటాహుటిన పార్లమెంట్‌లో బలప్రయోగంతో ఆమోదించుకుందని పేర్కొన్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ తన రచనల్లో జాషువా సాహిత్య స్ఫూర్తి అంతర్లీనంగా ఎప్పుడూ ఉంటుందని పాటలు పాడి వివరించారు. ఓల్గా మాట్లాడుతూ నేడు సమాజంలో జరుగుతున్న కులవివక్షతను గుర్రం జాషువా స్ఫూర్తితో ఎదుర్కోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కోవిడ్ విపత్తులో సభను ఆన్‌లైన్‌లో నిర్వహించామని, అయినా వందల మంది సభలో పాల్గనడం జాషువా సాహిత్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని తెలియచేస్తోందని అన్నారు. సభలో ఎఎస్ఎస్ఎన్ కళాశాల తెలుగు విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ కాకాని సుధాకర్, జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, కార్యదర్శి ఎన్.కాళిదాసు, సినీనటులు కృష్ణేశ్వరరావు మాట్లాడారు. ♦


బాలబాలికలు అత్యంత ఉత్సాహంగా పాల్గొనడం నిర్వాహకులకు సంతోషం కలిగించింది. ఆనాటి వైతాళికుల భావాలను, సమాజ ఉన్నతికోసం వారు చేసిన కృషిని నేటి తరానికి అందజేయడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన గాదె సుబ్బారెడ్డి తెలిపారు. యు.వి. రామరాజు, నారాయణ, డి.వి.రాజు, హరిప్రసాద్, రంగారెడ్డి, నరేష్ తదితర కార్యకర్తల బృందం కార్యక్రమం విజయవంతం కావడంలో మంచి కృషి చేసారన్నారు. కార్యక్రమ సమీక్షా సమావేశంలో ఎం.బి. విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి పిన్నమనేని మురళి ఈ వైతాళికుల స్ఫూర్తి సంబరాలలో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఈ అనుభవంతో మరిన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు.

### వీడియో కవితల పోటీ విజేతలు

**సాహితీస్రవంతి – జాషువా సాంస్కృతిక** వేదిక నిర్వహించిన వీడియో కవితల పోటీకి 110 వీడియో కవితలు వచ్చాయి. 40 కవితలను ఎంపిక చేసి వైతాళికుల స్ఫూర్తి సంబరాలలో ప్రతి రోజూ 5 చొప్పున వీడియో కవితలను ప్రసారం చేయడం జరిగింది. ఈ పోటీలో శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలసకు చెందిన కుప్పిలి వెంకట రాజారావు 'పత్తిపూల పొత్తిళ్లలో..' కవితకు ప్రథమ బహుమతి, కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన శిఖా – ఆకాష్ 'బానిసల స్వర్గం' కవితకు ద్వితీయ బహుమతి, పశ్చిమగోదావరి జిల్లా బయ్యనగూడెంకు చెందిన మెట్టా నాగేశ్వరరావు 'చాకలి పద్యం' కవితకు తృతీయ బహుమతి, విజయవాడకు చెందిన వైష్ణవిశ్రీ 'సముద్రం పోటెత్తుతోంది' కవితకు, తిరుపతికి చెందిన దారల విజయకుమారి 'సామాజిక న్యాయం' కవితలకు ప్రత్యేక బహుమతులు లభించాయి. ప్రముఖ కవులు గంటేడ గౌరునాయుడు, కె. ఆనందాచారి, డా॥ రాధేయ లు ఈ వీడియో కవితల పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ♦

# కొడవటిగంటి కుటుంబరావు

28.10.1909–17.08.1980



మొట్టమొదటి కథ 'ప్రాణాధికం' గృహలక్ష్మి మాసపత్రిక ఏప్రిల్ 1931 సంచికలో అచ్చయింది. ఆనాటి నుంచి వందలకొలదీ కథలు, కల్పికలు, పదిపన్నెండు నవలలు, నాటికలు, వేలకొలదీ వ్యాసాలు రాశారు. కన్ను మూసేవరకు కలం కింద పెట్టలేదు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 2 ▪ SANCHIKA - 1 ▪ KRISHNA ▪ October 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 3.10.2020

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు

## విప్లవం అంటే ఏమిటి?



పేజీలు 32
రూ. 10/-

భగత్‌సింగ్‌ను భారతదేశంలో తొలితరం మార్క్సిస్టుల్లో ఒకరుగా పేర్కొనవచ్చు. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ స్థాపకుల్లో ఆయన ఒకరు. భారత్, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని జైలులో 64 రోజులపాటు నిరాహారదీక్ష చేపట్టి బ్రిటీషు పాలకులకు సింహస్వప్నంగా నిలిచాడు. ఆయన రాసిన రెండు ముఖ్యమైన వ్యాసాలను ఈ చిన్న పుస్తకరూపంలో అందిస్తున్నాం. ఇవి నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి.

## నాన్నా ఎందుకిలా చేశారు.



పేజీలు 32
రూ. 10/-

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్‌ను కాల్చి చంపిన పోలీసు అధికారిపై ప్రతీకారం తీర్చుకోవడం, పార్లమెంట్ భవనంలో బాంబు విసరడం చేసినందుకు 1931 మార్చి 23న భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీశారు. భగత్ సింగ్ అమరుడై దాదాపు 90 ఏళ్లు కావస్తున్నా నేటికీ యువతరానికి వేగుచుక్కగా నిలిచాడు. ఆయన ఉరితీతకు ముందు తన కుటుంబీకులకు, విప్లవ సహచరులకు రాసిన లేఖలు నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి. వాటన్నిటినీ ఈ చిన్న పుస్తకరూపంలో అందిస్తున్నాం.

భారతదేశ చరిత్రను మార్క్సిస్టు దృక్కోణంతో పరిశీలించిన గ్రంథమిది. భారతదేశ చరిత్ర చాలా సంగ్రహంగా ఇందులో చెప్పారు. మనదేశ చరిత్రలో జరిగిన విభిన్న సంఘటనలను మార్క్సిస్టు తత్వశాస్త్రమైన 'చారిత్రక భౌతికవాద సిద్ధాంత' దృక్పథంతో కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఈ పుస్తకంలో పరిశీలించారు. భారతదేశంలో ఇంత వరకు జరిగిన సామాజిక మార్పులు, యుద్ధాలు వాటి వర్గ ధోరణి, సామాజిక మార్పుల్లో విభిన్న వర్గాల పాత్ర, భారతీయ సామాజిక వ్యవస్థ ప్రత్యేకతలు మొదలగువాటిని సంగ్రహంగాను, స్పష్టంగాను కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. వివరించారు.

భారతదేశ చరిత్ర
ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్
పేజీలు 128 రూ. 100/-





గతితార్కిక భౌతికవాదం
పేజీలు 104 రూ. 85/-

మార్క్సిజాన్ని అధ్యయనం చేసేవారు గతితార్కిక భౌతికవాదాన్ని తెలుసుకొని తీరాలి. అందులోనూ కమ్యూనిస్టులైన వారికి ఇది విధి. గతితార్కిక చారిత్రిక భౌతికవాదాన్ని అధ్యయనం చేయకుండా కమ్యూనిస్టులైనవారు సరైన రాజకీయ అవగాహనకు కూడా రాలేరు. సరైన విధానాలనూ అనుసరించలేరు. అందుకు జరిగే ప్రయత్నంలో ఒక భాగంగానే ఈ పుస్తక రచన. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని ఇంకా ఎక్కువ లోతుగా ఎక్కువ వివరాలతో అభ్యసించడానికి ఇది ప్రాతిపదికగా ఉపయోగపడుతుందనే ఆశతోనే దీని ప్రచురణ.

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2. ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు** : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**